


www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..
శనివారం
06-07-2024
సంపుటి : 01 | సంచిక : 63 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS

## తెలంగాణ హోంశాఖ ఎవరికి?

### రేసులో సీతక్క, రాజగోపాల్ రెడ్డి, యశస్విని రెడ్డి

- సీతక్కకే రేవంత్ మద్దతు..?
- తమ్ముని కోసం కోమటిరెడ్డి ఆరాటం
- ఢిల్లీ పెద్దల వద్ద పంచాయితీ




**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త జగడం షురూ అయింది. అదే మంత్రి వర్గ విస్తరణ. వాస్తవానికి జులై 4న మంచి రోజు కాబట్టి ఆరోజు మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని.. కొత్తగా ఆరుగురికి మంత్రి పదవులు దక్కుతాయని అందరూ అనుకున్నారు. రేవంత్, భట్టి ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడారు. తెల్లారితో కొత్త మంత్రులు ఎవరో తెలియాల్సి ఉండగా.. సడెన్ గా మంత్రి వర్గ విస్తరణ ఆగిపోయింది. దానికి కారణాలు కూడా ఉన్నాయి. కొత్త మంత్రుల విషయంలో పోటీ ఉండటంతో పాటు కొన్ని శాఖలు ఎవరికి ఇవ్వాలనే దానిపై ఏకాభిప్రాయం రాలేదని తెలుస్తోంది.

మిగతా2లో...

## నీట్ కొత్త షెడ్యూల్ రిలీజ్

- ఆగస్టు 11న ఎగ్జామ్స్.. రెండు షిఫ్టుల్లో పరీక్షలు
- వాయిదా వేసిన రెండు వారాల తర్వాత షెడ్యూల్



2



## శాసనమండలి శాశ్వతంగా రద్దు?

- నిబంధనలకు విరుద్ధంగా నడుస్తోన్న తెలంగాణ పెద్దల సభ!
- 171 సెక్షన్ ప్రకారం కోర్టుకు వెళితే వెంటనే కౌన్సిల్ రద్దయ్యే ఛాన్స్

- 120 మంది ఎమ్మెల్యేలు, 40 మంది ఎమ్మెల్సీలు ఉండాలని నిబంధన
- ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యే పదవి రద్దుతో 119కి పడిపోయిన సంఖ్య
- 39 మంది ఎమ్మెల్సీలతో శాసన మండలి ఉండదంటున్న బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్

తెలంగాణ శాసన మండలి ఉనికే ప్రమాదంలో పడిందని సంచలన వ్యాఖ్యలు చేశారు మాజీ ఎంపీ వినోద్ కుమార్. రాజ్యాంగం 171 సెక్షన్ ప్రకారం ఎవరైనా కోర్టుకు వెళితే వెంటనే కౌన్సిల్ రద్దయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు. ఇంతకీ సడన్ గా తెలంగాణ శాసన మండలికి వచ్చిన ప్రమాదం ఏంటి..? ముందుగా రాజ్యాంగం శాసనమండలి ఏర్పాటు గురించి ఏం చెప్పిందో చూద్దాం...

**విశ్వంభర, హైదరాబాద్ :** ఆయా రాష్ట్రాలు ఎగువ సభగా లెజిస్లేటివ్ కౌన్సిల్ ఏర్పాటు చేసుకోవాలనుకుంటే ఆర్టికల్ 169, 170, 171, 172 లో ఉన్న నిబంధనలను పాటించాలి. ఆర్టికల్ 171 ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా శాసనమండలి ఏర్పాటు చేయాలనుకుంటే అక్కడున్న శాసన సభ్యుల సంఖ్యలో 1/3 వంతుల సంఖ్యతో కౌన్సిల్ ఏర్పాటు చేసుకోవాలి. అదే రాజ్యాంగంలో ఆర్టికల్ 172 లో ఇదే కౌన్సిల్ ఏర్పాటు

మిగతా2లో...

## సుప్రీం కోర్టుకు కవిత కేసు

- రంగంలోకి దిగిన కేటీఆర్, హరీష్ రావు
- ఇద్దరు నేతలు ఢిల్లీలోనే మకాం
- కవితకు బెయిల్ ఇప్పించేందుకు విశ్వప్రయత్నాలు
- ధైర్యంగా ఉండాలని చెల్లెకు భరోసా కల్పించిన కేటీఆర్



2

## సామరస్యంగా పరిష్కరించుకోండి

- తెలంగాణ, ఆంధ్రా భాగోళికంగానే విడిపోయింది
- తెలుగు రాష్ట్రాల ప్రజలు ఇప్పటికీ కలిసే ఉన్నారు
- విభజన హామీలపై కేంద్రంపై ముఖ్యమంత్రులు ఒత్తిడి చేయాలి
- చంద్రబాబు, రేవంత్ కు సీపీఐ నారాయణ సలహా



2



2

తెలంగాణలోనే దిక్కులేదు..

## ఇతర రాష్ట్రాల్లోనూ పార్టీని నడిపిస్తావా?

- ఓటమిపై కేసీఆర్ ఆత్మ విమర్శ చేసుకోరా..?
- మాజీ సీఎంకు మధుయాష్కి గౌడ్ చురకలు

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

## అసెంబ్లీలో చర్చించి జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తాం

### నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం జాబ్స్ ఇస్తాం

- ఇప్పటికే 28,942 ఉద్యోగ నియామకాలు చేపట్టాం
- ఇష్టమొచ్చినట్లు నిబంధనలు మార్చితే కోర్టుల్లో చిక్కులు తప్పవు
- స్వార్థపూరిత శక్తుల కుట్రలకు నిరుద్యోగులు బలి కావద్దు
- నిరుద్యోగుల ఆందోళనల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- విద్యార్థి నేతలు, అధికారులు, నాయకులతో సీఎం సమీక్ష




**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, తప్పకుండా నిరుద్యోగులకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు, స్వార్థపూరిత శక్తుల కుట్రలకు నిరుద్యోగులు బలి కావద్దని నిరుద్యోగులకు సూచించారు.

మిగతా2లో...

## హీరో రాజ్ తరుణ్ పై చీటింగ్ కేసు

### పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు

- నార్సింగి పోలీస్ స్టేషన్ లో యువతి ఫిర్యాదు
- లావణ్యకు వేరే వ్యక్తితో ఎఫైర్ ఉంది
- అందుకే దూరంగా ఉన్నా..
- నాపై తప్పుడు కేసులు పెట్టింది
- ఆమెతో నాకు శారీరక సంబంధం లేదు
- హీరో రాజ్ తరుణ్ స్పష్టత



**విశ్వంభర, హైదరాబాద్:** హీరో రాజ్ తరుణ్ చిక్కుల్లో పడ్డాడు. ఇప్పటికే విజయాలు లేక కెరీర్‌లో ఇబ్బంది పడుతున్న రాజ్ తరుణ్.. పర్సనల్ లైఫ్‌లోనూ ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నాడు. తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి రాజ్ తరుణ్ మోసం చేశాడని లావణ్య అనే యువతి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 11 ఏళ్లుగా తాను, రాజ్ తరుణ్ రిలేషన్‌లో ఉన్నట్లు తెలిపింది. తామిద్దరం గుడిలో రహస్యంగా పెళ్లి కూడా చేసుకున్నట్లు చెప్పింది. సినీ హీరోయిన్‌తో అఫైర్

మిగతా2లో...



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 117 | ₹ 139 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹202 | ₹229 |

## బాబుకు బ్రహ్మరథం

- జోరు వానలోనూ పసుపు దళం హోరు
- బేగంపేటలో ఘన స్వాగతం పలికిన టీటీడీపీ శ్రేణులు
- ఎయిర్ పోర్ట్ నుంచి జూబ్లీహిల్స్ వరకు భారీ ర్యాలీ
- పసుపుమయం అయిన బేగంపేట విమానాశ్రయం
- నేడు ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి భేటీ



2

## కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు

- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారంటూ ఆగ్రహం
- తన ప్రతిష్టకు భంగం కలిగేలా వీడియోలు పెట్టారని ఆవేదన
- తప్పుడు ప్రచారం చేసినందుకు లిఖితపూర్వక క్షమాపణ చెప్పాలి



2

## విమానంలో కేటీఆర్‌కు లెటర్ ఇచ్చిన యువతి

- బాగా ఇంప్రెస్ అయ్యానన్న మాజీ మంత్రి
- డియర్ కేటీఆర్ సర్.. లెటర్‌లో ఏం రాసిందంటే..?



2

## సామరస్యంగా పరిష్కరించుకోండి

**విశ్వంభర, హైదరాబాద్:** రెండు రాష్ట్ర ప్రయోజనాల కోసం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చోని సానుకూలంగా చర్చించుకోవాలన్నారు సీపీఐ నేత నారాయణ. ఎవరో రెచ్చగొడితే రెచ్చిపోవాల్సిన పనిలేదన్నారు. జూలై 6న హైదరాబాద్ ప్రజాభవన్ వేదికగా రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీ కానున్నారు. ఇది ఒక శుభదినం అని అభివర్ణించారు. ఈ కీలక సమావేశం నేపథ్యంలో సీపీఐ నేత నారాయణ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. తెలుగు మాట్లాడే ప్రజల క్షేమం కోరాలన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ఏ రాష్ట్రానికి రావల్సిన ప్రయోజనాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఏ రాష్ట్రం హక్కులను వారు కాపాడుకుంటూనే సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. పోలవరం, నీటి తగాదాలపై కూడా స్పందించారు. భద్రాచలంలో ముంపు ప్రాంతాలకు సంబంధించిన అంశాలను కూడా సున్నితంగా చర్చించి పరిష్కరించుకోవాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ నీటి సమస్యలు ఉండేవని, అయితే అవి అంతర్గతంగా ఉండేవని గుర్తు చేశారు. అయితే మారిన రాజకీయ, ప్రాంతీయ పరిస్థితుల దృష్ట్యా బహిర్గతం అయిందన్నారు. తెలంగాణ, ఆంధ్రా భౌగోళికంగానే విడిపోయిందన్నారు. అయితే తెలుగు మాట్లాడే వారు కలిసే ఉన్నట్లు చెప్పారు. ఒకప్పుడు సెంటిమెంట్ పనిచేసిందని, కానీ సెంటిమెంట్ ఎల్లవేళలా పనిచేయదు, ఉండాల్సిన అవసరం కూడా లేదన్నారు. ఇది తాత్కాలికమే తప్ప శాశ్వత రాజకీయ పరిష్కారం కాదని చెప్పారు. పరిష్కారం అవ్వని విభజన హామీలపై కేంద్ర ప్రభుత్వంపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒత్తిడి తీసుకురావాలన్నారు. అప్పుడే సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ భేటీ గురించి ఒక్కొక్కరు ఒక్కోరకంగా మాట్లాడుకుంటారని వాటిని పట్టించుకోనవసరం లేదని అన్నారు.

## విమానంలో కేటీఆర్‌కు లెటర్ ఇచ్చిన యువతి

**విశ్వంభర, హైదరాబాద్:** ఎన్ని ప్రయాణాలు చేసినా వాటిలో కొన్ని మాత్రం చాలా సంతృప్తికరంగా జరుగుతూ ఉంటాయి. తాజాగా అలాంటి అనుభవమే మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు ఎదురైంది. ఆయన ఢిల్లీ పర్యటనకు ఓ విమానంలో వెళ్లగా.. ఓ యువతి రాసిచ్చిన లెటర్ ఆయన్ను ఎంతగానో ఆకట్టుకుంది. ''ఈ రోజు సాయంత్రం నేను ఢిల్లీ విమానాశ్రయంలో దిగినప్పుడు వినీల అనే ఈ యువతి నా దగ్గరకు వెళ్లి, నాతో ఫోటో దిగింది. ఇంకా ఓ పేపర్ నాప్కిన్‌పై ఆమె రాసిన ఈ నోట్‌ని నాకు అందజేసింది. ఆమె మంచి మాటలకు ధన్యవాదాలు. ఆమె భవిష్యత్తు బాగా ఉండాలని నేను కోరుకుంటున్నాను'' అని కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇంకా ఆ యువతితో దిగిన ఫోటో, ఆమె టిష్యూ పేపర్ పై రాసిన లెటర్‌ను కూడా ఆ పోస్టుకు జతచేశారు.

**ఆ లెటర్‌లో ఏముందంటే..**

''డియర్ కేటీఆర్ సర్.. మీతో కలిసి మాట్లాడిన కొద్ది నిమిషాల్లోనే నేను ఎంతగా స్ఫూర్తి పొందానో చెప్పలేను. నాకు రాజకీయాల గురించి తెలిసినప్పటి నుంచి నేను మిమ్మల్ని ఫాలో అవుతున్నాను. ఎందుకంటే మీరొక విజనరీ లీడర్. అదీకాక మీరు చాలా సింపుల్‌గా ఉండే ఒక సాధారణ మనిషి. భారత్‌కి మీలాంటి ప్రధాన మంత్రి ఉండాలని నేను ఎన్నో చోట్ల కామెంట్ చేశాను. ఫ్లైఓవర్లు, పట్టణీకరణ, ఫారిన్ పోర్ట్‌పోలియో ఇన్‌వెస్ట్‌మెంట్స్, ఫారిన్ డైరెక్ట్ ఇన్‌వెస్ట్‌మెంట్స్, టీ హబ్, స్టార్టప్ కల్చర్ ఇలా చాలా విషయాల్లో మీరు చాలా అందుబాటులో ఉంటారు. ఇంకా ఎన్నో అంశాల్లో మీ లాంటి లీడర్ మా జనరేషన్‌లో ఉన్నందుకు చాలా సంతోషకరం. మాకు మీరు ఎన్నో మార్గాలను సుగమం చేశారు. తెలంగాణ తెచ్చినందుకు ధన్యవాదాలు. హైదరాబాద్ పట్ల మేం ఎంతో గర్వకారణంతో ఉంటాం'' అని హైదరాబాద్ కు చెందిన యువతి వినీల ఓ టిష్యూ పేపర్‌పై రాసి కేటీఆర్ కు ఇచ్చారు.

## నీట్ కొత్త షెడ్యూల్ రిలీజ్

**విశ్వంభర, హైదరాబాద్:** దేశ వ్యాప్తంగా ఉన్న ప్రతిష్టాత్మక మెడికల్ విద్యా సంస్థల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు నిర్వహించే నీట్‌పీజీ పరీక్షను వాయిదే వేసిన సంగతి తెలిసిందే. జూన్ 23న ఈ పరీక్ష జరగవల్సి ఉండగా.. పరీక్షకు కొన్ని గంటల ముందు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ క్యాన్సిల్ చేసింది. నీట్ యూజీ 2024, యూజీసీ నెట్ 2024 పరీక్షల పేపర్ లీకేజీల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో కేంద్ర ప్రభుత్వం తెల్పింది. అయితే తాజాగా నీట్ పీజీ పరీక్ష కొత్త తేదీలను NBE ప్రకటించింది. 202425 విద్యాసంవత్సరానికి పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆగస్టు 11న పరీక్ష నిర్వహించనున్నట్లు శుక్రవారం (జులై 5) ప్రకటించింది. ఈ మేరకు ఆగస్టు 11న పరీక్ష నిర్వహించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్ణయించింది. మొత్తం రెండు షిఫ్టుల్లో ఈ పరీక్ష జరుగుతుంది. ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో పరీక్ష నిర్వహించబోతున్నట్లు స్పష్టం చేసింది. నీట్ పీజీ పరీక్షను వాయిదా వేసిన రెండు వారాల తర్వాత కొత్త తేదీలను వెల్లడించింది. ఈ మేరకు రివైజ్డ్ షెడ్యూల్‌ను ప్రకటించారు. గత ఏడేళ్లుగా నీట్ పీజీ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పటి వరకు పేపర్ లీకేజీ ఆరోపణలు రాలేదు. అయితే, నీట్‌యూజీ 2024 పరీక్షపై దేశ వ్యాప్తంగా తీవ్ర ఆరోపణలు సంచలనంగా మారిన నేపథ్యంలో.. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా నీట్ పీజీ పరీక్షను కేంద్రం వాయిదా వేసింది. ఈసారి నీట్ పీజీ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించబోతున్నారు. నీట్‌పీజీ పరీక్షకి కేవలం 2 గంటల ముందు మాత్రమే ప్రశ్నపత్రాన్ని తయారు చేయాలని కేంద్రం నిర్ణయించింది. అంటే సరిగ్గా పరీక్ష రోజున.. పరీక్ష ప్రారంభానికి రెండు గంటల ముందు మాత్రమే సంబంధిత పరీక్ష కేంద్రాలకు క్వశ్చాన్ పేపర్లు పంపించాలని కేంద్రం నిర్ణయించింది.

## బాబుకు బ్రహ్మరథం

**విశ్వంభర, బేగంపేట:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి హైదరాబాద్‌కు వచ్చిన చంద్రబాబుకు, తెలుగుదేశం శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. దిల్లీలో రెండు రోజుల పర్యటన ముగించుకొని, బేగంపేట విమానాశ్రయానికి వచ్చిన చంద్రబాబును తొలుత గజమాలతో సత్కరించారు. అనంతరం బేగంపేట నుంచి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం వరకు ర్యాలీ చేపట్టారు. సన్‌రూఫ్ కారు నుంచి చంద్రబాబు పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. సాయంత్రం సుమారు 4 గంటల నుంచే ఎయిర్ పోర్ట్‌కు భారీగా చేరుకున్న అభిమానులు, పార్టీ శ్రేణులతో బేగంపేట పరిసరాలు పసుపు రంగు అద్దుకున్నాయి. రాత్రి ఏడు గంటలకు బేగంపేట విమానాశ్రాయానికి వచ్చిన బాబుకి పార్టీ నేతలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం ద్విచక్ర వాహనాలు, కార్లతో భారీగా ర్యాలీ చేపట్టారు. బేగంపేటలో జోరు వాన కురుస్తున్నా లెక్కచేయని కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. జూబ్లిహిల్స్‌లోని, ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు బాబు చేరుకోగానే భారీగా బాణాసంచా కాల్చి స్వాగతం పలికారు. దారి పొడవునా తెలుగు దేశం కార్యకర్తలు, చంద్రబాబు అభిమానులు సైతం పెద్ద సంఖ్యలో వేచి ఉండి స్వాగతం పలికారు. చంద్రబాబు రాక సందర్భంగా, పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

**నేడు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కీలక భేటీ**

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కీలక భేటీ శనివారం జరగనుంది. విభజన అంశాల వివాదాల పరిష్కారమే లక్ష్యంగా, సాయంత్రం 6 గంటలకు ప్రజా భవన్ వేదికగా రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు సమావేశం కానున్నారు. సుమారు రెండు గంటలు జరిగే సమావేశానికి, పది ప్రధాన అంశాలతో ఎజెండా సిద్ధం చేశారు. తొమ్మిది, పదో షెడ్యూలులోని సంస్థల పంపిణీతో పాటు విద్యుత్ బకాయిలు, ఉద్యోగుల విభజన వంటి చిక్కుముళ్లపై సమాలోచనలు చేయనున్నారు. ఈ భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చే అంశాల్లో విద్యుత్ బకాయిలు, ఏపీఎఫ్‌సీ ఉన్నాయి. అంతేకాకుండా రెండు రాష్ట్రాల మధ్య 15 ఈఏపీ ప్రాజెక్టుల రుణ పంపకాలపై సమీక్ష జరగనుంది. ఉద్యోగుల పరస్పర బదిలీలు, లేబర్ సెస్ పంపకాలపై సైతం రివ్యూ చేయనున్నారు.

# హీరో రాజ్ తరుణ్‌పై చీటింగ్ కేసు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుకుని తనను వదిలేశాడని ఆరోపిస్తోంది. రాజ్‌తరుణ్‌ను వదిలేయాలని.. లేదంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆమె కంప్లైంట్‌లో పేర్కొంది. తనను అన్యాయంగా డ్రగ్స్ కేసులో ఇరికించారని.. 45 రోజులు జైల్లో ఉన్నానని ఆమె వాపోతుంది. 3 నెలల నుంచి రాజ్ తరుణ్ తన నుంచి దూరంగా ఉంటున్నట్లు లావణ్య చెబుతోంది.

**ఆ హీరోయినే కారణం..**

లావణ్య ఫిర్యాదుకు అసలు కారణం మాల్వీ మల్హోత్రా. ఆమె రాజ్‌తరుణ్‌తో కలిసి తిరగబడరా సామీ అనే సినిమాలో నటించారు. అయితే మాల్వీ మల్హోత్రా, ఆమె సోదరుడు మయాంక్ తనను బెదిరించారని లావణ్య ఫిర్యాదు చేసింది. రాజ్‌తరుణ్ జీవితంలోంచి వెళ్లిపోకపోతే చంపుతామంటూ వాళ్లిద్దరూ బెదిరించారని నార్సింగి పోలీసులకు రాసిన ఫిర్యాదులో లావణ్య తెలిపింది. అంతేకాదు, హిమాచల్ ప్రదేశ్ CM తమ నాన్నకు ఫ్రెండ్ అనీ, తాము తలచుకుంటే ఏమైనా చేయగలమని మాల్వీ మల్హోత్రా, ఆమె సోదరుడు మాయాంక్ తనను బెదిరించినట్లు లావణ్య ఆరోపించింది. మాల్వీ ట్రాప్‌లో పడి, రాజ్‌తరుణ్ తనను దూరం పెడుతున్నాడని లావణ్య ఆరోపించింది. మాల్వీ మల్హోత్రతో ఎఫైర్ కారణంగానే రాజ్‌తరుణ్ తనను పక్కనబెట్టాడనీ లావణ్య అంటోంది. మాల్వీ మల్హోత్రాను కలుసుకోవడానికి తరచూ రాజ్‌తరుణ్ ముంబై వెళ్లేవాడని లావణ్య చెబుతోంది. అంతేగాదు, రాజ్‌తరుణ్ లైఫ్ నుంచి బయటకు వెళ్లడానికి మాల్వీ మల్హోత్రా, ఆమె సోదరుడు మయాంక్ తనను డబ్బు ఆశ చూపించారనీ, ఎంతకూ వినకపోతే చంపేస్తామని బెదిరించినట్లు లావణ్య తన ఫిర్యాదులో వివరించింది. కానీ తాను రాజ్‌తరుణ్ లేకపోతే



ఉండలేనంటోంది. తాను రాజ్‌తరుణ్‌తో కలసి ఉండాలని కోరుకుంటోంది.

**లావణ్యకు వేరే వ్యక్తితో ఎఫైర్ ఉంది**

ప్రియురాలు ఆరోపణలపై రాజ్ తరుణ్ స్పందించాడు. లావణ్య చెబుతున్నవన్ని అబద్ధాలు అని చెప్పాడు. "లావణ్యతో తాను రిలేషన్‌లో ఉన్నమాట నిజమే. 2014 నుంచి మేం రిలేషన్‌లో ఉన్నాం. ఇద్దరం ఒకటే రూంలోనే ఉన్నాం. కానీ నేనెప్పుడు ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పలేదు. ఆమెతో నాకు ఎలాంటి శారీరక సంబంధం లేదు. లావణ్యకు మరో వ్యక్తితో ఎఫైర్ ఉంది. అతడి పేరు మస్తాన్ సాయి. అతడితో రిలేషన్ కోసం ఆమె నన్ను టార్చర్ పెట్టింది. ఆ వేధింపులు తట్టుకోలేక రూం నుంచి బయటకు వచ్చాను. ఆమెను అక్కడే ఉండమన్నాను. కానీ, నేను బయటకు రావడంతో ఆమె తన బాయ్‌ఫ్రెండ్ మస్తాన్‌తో కలిసి ఉంది. అందువల్లే మా మధ్య బంధం చెడింది. కానీ నాకు లావణ్యను పెళ్లి చేసుకునే ఉద్దేశం ఎప్పుడు లేదు. ఆమె మా కుటుంబ సభ్యులకు కూడా పరిచయమే. కానీ తనకున్న ఉన్న డ్రగ్స్ అలవాటు, మరో వ్యక్తి ఎఫైర్ వల్ల నేను ఆమెకు దూరంగా ఉన్నాను. అందుకే ఇప్పుడు నాపై ఇలాంటి ఆరోపణలు చేస్తుంది. ఆమె చెప్పేవన్ని అబద్ధాలు. ఈ కేసులో తనకు కొంచం సపోర్టు చేయండి. ఈ విషయమై నేను లీగల్‌గా ముందుకు వెళతాను" అంటూ రాజ్ తరుణ్ చెప్పాడు.

### గుంటూరు పోలీస్ స్టేషన్ లోనూ కేసు

అలాగే "లావణ్య గతంలో మస్తాన్ తనని పెళ్లి చేసుకోవాలంటూ గుంటూరు పోలీసులు స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు కూడా చేసింది. ఆ కేసుకు సంబంధించి ఎఫైర్ కాపీ కూడా నా దగ్గర ఉంది. మస్తాన్‌తో లావణ్యకు శారీరక సంబంధం కూడా ఉంది. అందుకే నేను ఆమెకు దూరంగా ఉంటున్నా. దాంతో లావణ్య నాపై ఇలా తప్పుడు ఆరోపణలు చేస్తుంది. ఆమెను నమ్మకండి. దయచేసి ఈ విషయంలో నాకు సపోర్టు చేయండి. నా లీగల్ లాయర్ ద్వారానే నేను లావణ్యను అప్రోచ్ అవుతాను. అప్పటి వరకు ఆమెకు నేను ఎలాంటి సమాధానం ఇవ్వదలుచుకోలేదు" అంటూ రాజ్ తరుణ్ వివరణ ఇచ్చాడు.

# తెలంగాణ హోంశాఖ ఎవరికి?

(మొదటి పేజీ తరువాయి)

అందులో కీలకమైన హోంశాఖపై క్లారిటీ రాలేదు.

**ముగ్గురు మధ్య తీవ్ర పోటీ**

ఇప్పటి వరకు హోంశాఖ సీఎం రేవంత్ రెడ్డి దగ్గరనే ఉంది. ప్రభుత్వంలో సీఎం తర్వాత పవర్ ఫుల్ శాఖ హోం మంత్రి. కాబట్టి ఆ శాఖను తన వర్గీయులకే ఇవ్వాలని రేవంత్ మొదటి నుంచి పట్టుబడుతున్నారు. ఇందులో ప్రధానంగా వినిపిస్తున్న పేరు సీతక్క. రేవంత్ రెడ్డికి టీడీపీలో ఉన్నప్పటి నుంచి విధేయురాలుగా, సపోర్టుగా ఉంటోంది సీతక్క. అందుకే రేవంత్ ఆమె పేరును సిఫారసు చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే అటు నల్గొండ జిల్లా నేతలు మాత్రం హోం శాఖను రాజగోపాల్ రెడ్డికి ఇవ్వాలంటూ పట్టుబడుతున్నారంట. మంత్రి కోమటిరెడ్డి కూడా ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. రాజగోపాల్ రెడ్డికి కూడా కాంగ్రెస్ లో బలమైన పట్టు ఉంది. పైగా నల్గొండలో కాంగ్రెస్ ఎంత బలంగా ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. నల్గొండ అంటేనే కోమటిరెడ్డి బ్రదర్స్. కాబట్టి రాజగోపాల్ రెడ్డి పేరును చాలా మంది ప్రతిపాదిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక యూత్ ను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అటు యశస్విని రెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. ఆమె పాలకుర్తిలో ఉద్దండుడైన ఎర్రబెల్లి దయాకర్ ను ఓడించి 26 ఏళ్లకే ఎమ్మెల్యే అయ్యారు. రాహుల్ గాంధీ యువతకు మంత్రి పదవులు ఇవ్వాలనే ఆదేశాల మేరకు ఆమె పేరు కూడా వినిపిస్తోంది.

**ఆ క్రెడిట్ కోసం రేవంత్ రెడ్డి తహతహ**

కానీ రాజకీయ పరంగా చూసుకుంటే మంత్రి సీతక్కకు, రాజగోపాల్ రెడ్డికి ఉన్నంత ఇమేజ్ యశస్విని రెడ్డికి లేదు. పైగా ఆమె మొదటిసారి ఎమ్మెల్యే అయ్యారు. ఇక సీఎం రేవంత్ దగ్గర అందరికంటే ఎక్కువ పలుకుబడి ఉన్నది మాత్రం మంత్రి సీతక్కకే. వాస్తవానికి ఆమెకు మొదట్లోనే డిప్యూటీ సీఎం పదవి వస్తుందని ఆశించినా.. మల్లు భట్టివిక్రమార్క అడ్డు చెప్పడంతో ఆగిపోయారు రేవంత్. డిప్యూటీ సీఎం ఇవ్వలేదు కాబట్టి పవర్ ఫుల్ హోం శాఖ ఇవ్వాలని రేవంత్ భావిస్తున్నారంట. అలా చేస్తే ఒక ఆదివాసీ బిడ్డకు హోంశాఖ ఇచ్చిన క్రెడిట్ దక్కుతుందని నచ్చజెబుతున్నారంట. దీనిపై ప్రస్తుతం ఇంకా చర్చలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పుడు ఢిల్లీ నుంచి రేవంత్ తెలంగాణకు వచ్చేశారు. రేవంత్, భట్టి ఇద్దరూ ఢిల్లీ వెళ్లి అటు కాంగ్రెస్ పెద్దలను రహస్యంగా కలిసి మంత్రి వర్గ విస్తరణపై చర్చించినట్టు తెలుస్తోంది. తొందర్లోనే దానిపై ప్రకటన వస్తుందని తెలుస్తోంది. చూడాలి మరి ఈ ముగ్గురిలో హోం శాఖ ఎవరికి దక్కుతుందో.

# శాసనమండలి శాశ్వతంగా రద్దు?

(మొదటి పేజీ తరువాయి)

కోసం మరో నిబంధన పొందుపరిచారు. ఎమ్మెల్యేల సంఖ్యలో 1/3 విభజించిన ఎమ్మెల్సీల సంఖ్య 40 కి తగ్గకూడదు. అంటే ఏ రాష్ట్రంలోనైనా లెజిస్లేటివ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలంటే కచ్చితంగా 40 మంది ఎమ్మెల్సీలు ఉంటేనే అది సాధ్యమవుతుంది. అందుకోసం కచ్చితంగా 120 మంది ఎమ్మెల్యేలు ఉంటేనే ఆ రాష్ట్రంలో కౌన్సిల్ ఉండే అవకాశం ఉంది. ఇందువల్లనే గోవా, జార్ఖండ్ లాంటి చిన్న రాష్ట్రాలలో శాసనమండలి లేదు. ఇక రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ శాసన సభ్యుల సంఖ్య 119. కానీ అప్పటికి ఉన్న చట్ట ప్రకారం ఒక నామినేటెడ్ ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యే కలుపుకుంటే 120 కి చేరింది. దీంతో 40 మందితో శాసనమండలి ఏర్పాటు చేశారు. కానీ ఆ తర్వాత 2018లో కేంద్ర ప్రభుత్వం నామినేటెడ్ శాసనసభ్యుల విధానాన్ని రద్దు చేసింది. దీంతో మొన్నటి అసెంబ్లీ 119 మంది సభ్యులతోనే మొదలైంది. ఇలా 119 లో 1/3 చేస్తే 39 మంది శాసనమండలి సభ్యులు మాత్రమే వస్తారు. కనీసం 40 మంది ఉంటేనే శాసనమండలి ఉండాలని చట్టానికి ఇది విరుద్ధంగా ఉంటుందనేది మాజీ ఎంపీ వినోద్ వాదన..




**శాసనమండలి మనుగడ ప్రమాదంలో పడిందా..?**

ఇప్పుడు ఎవరైనా కోర్టుకు వెళ్తే శాసనమండలి రద్దడం ఖాయమని అందుకే ఆయన చెప్తున్నారు. తెలంగాణ శాసనమండలి మనుగడ ప్రమాదంలో పడింది అంటున్నారు బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్. తెలంగాణలో శాసనమండలి కొనసాగాలంటే.. అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరగాలంటున్నారు. లోక్ సభలో, శాసనసభలో నామినేటెడ్ ఆంగ్లో ఇండియన్ సభ్యులను మోదీ ప్రభుత్వం తొలగించడంతో రాష్ట్ర అసెంబ్లీ సభ్యుల సంఖ్య 119కి తగ్గిందన్నారు వినోద్. ప్రస్తుతం రాష్ట్రంలో మండలి రాజ్యాంగం ప్రకారం లేదని, ఎవరైనా కేసు వేస్తే మండలి రద్దు అవుతుందన్నారు. తెలంగాణ శాసనమండలి ఉనికికి ప్రమాదం ఏర్పడిందన్నారు. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ పెట్టాలని వినోద్ సూచిస్తున్నారు. తెలంగాణ సర్కార్ కేంద్ర ప్రభుత్వంతో చర్చించి.. అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరిగేలా చేస్తుందా..? లేక మండలి రద్దవుతుందా..? అనేది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు వినోద్ కామెంట్స్ వెనుక ఉన్న మర్మమేంటీ..? ఇప్పుడే రద్దు అంశం ఎందుకన్న దానిపైనా తెగ చర్చ నడుస్తోంది.

# అసెంబ్లీలో చర్చించి జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షలు జరుగుతున్న సమయంలో ఇష్టమొచ్చినట్లు నిబంధనలు మార్చితే తలెత్తే చట్ట పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం చేసినట్లు తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే నిరుద్యోగులకు న్యాయం జరగకపోగా.. ఇప్పుడున్న నోటిఫికేషన్లు కూడా రద్దయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం తమ ప్రభుత్వం ఇప్పటికే 28,942 ఉద్యోగ నియామకాలు చేపట్టిందని గుర్తు చేశారు. ఏళ్లకు ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 నియామకాలకు ఉన్న కోర్టు చిక్కులన్నింటిని అధిగమించిందని చెప్పారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం పోటీ పరీక్షలు నిర్వహించి, ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లోనే లో చర్చించి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నియామక పరీక్షలు, వివిధ బోర్డులు నిర్వహించే పరీక్షలతో ఆటంకాలు ఏర్పడకుండా నిరుద్యోగులకు పూర్తి న్యాయం జరిగేలా క్యాలెండర్ రూపొందిస్తామన్నారు. ఇంత కీలకంగా తమ ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో కసరత్తు చేస్తుంటే కొందరు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. కొందరు చేసే కుట్రలతో నోటిఫికేషన్లలోని నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే ఉద్యోగాలు భర్తీ చేసే ప్రక్రియ నిలిచిపోయి, నిరుద్యోగులు మరింత నష్టపోతారని సీఎం స్పష్టం చేశారు.

**డిమాండ్లను పరిష్కరించేందుకు సీఎస్‌తో చర్చ**

నిరుద్యోగుల ఆందోళనల దృష్ట్యా శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి తన నివాసంలో సమావేశం ఏర్పాటు చేశారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, సామ రామ్మోహన్‌రెడ్డి, పవన్ మల్లాది, ప్రొఫెసర్ రియాజ్, టీచర్ల జేఏసీ హర్షవర్ధన్‌రెడ్డి, ఓయూ విద్యార్థి నాయకులు చనగాని దయాకర్, మానవతారాయ్, బాల లక్ష్మి, చారకొండ వెంకటేష్, కాల్వ సుజాత తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో నిరుద్యోగులకు సంబంధించిన డిమాండ్లు, జరుగుతున్న ఆందోళనలను గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు సంబంధిత అధికారులను పిలిపించి మాట్లాడారు. నిరుద్యోగులు లేవనెత్తిన డిమాండ్లను పరిష్కరించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై చర్చించారు. గ్రూప్ 1 పరీక్షకు ఒక్కో పోస్టుకు 1: 50 నిష్పత్తి చొప్పున కాకుండా 1: 100 చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేయాలనే డిమాండ్ పై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చ జరిగింది. గత ప్రభుత్వం 2022లో వేసిన గ్రూప్ 1 పరీక్ష పేపర్ల లీకేజీ, తప్పుడు నిర్ణయాల కారణంగా రెండు సార్లు వాయిదా పడిందని, కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే సుప్రీంకోర్టులో ఉన్న ఈ పిటిషన్ వెనక్కి తీసుకుందని అధికారులు సీఎంకు వివరించారు. పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి అదనంగా మరిన్ని పోస్టులతో కొత్త నోటిఫికేషన్ జారీ చేసిందని చెప్పారు. పన్నెండేండ్ల తర్వాత చేపట్టిన గ్రూప్ 1 పరీక్షకు నాలుగు లక్షల మంది అభ్యర్థులు పోటీ పడ్డారు.. ఇటీవలే ప్రిలిమినరీ పరీక్షను టీజీపీఎస్‌సీ పకడ్బందీగా నిర్వహించిందని చెప్పారు. నోటిఫికేషన్ ప్రకారం ప్రిలిమ్స్ లో మెరిట్ ఆధారంగా ఒక్కో పోస్టుకు 50 మంది చొప్పున మెయిన్స్ కు ఎంపిక జరుగుతుందని వివరించారు. ఇప్పుడు 100 మందిని ఎంపిక చేసేలా నిబంధనలను సవరిస్తే కోర్టులు జోక్యం చేసుకునే ప్రమాదముందని, అదే జరిగితే మొత్తం నోటిఫికేషన్ మళ్లీ నిలిచిపోతుందని అధికారులు వివరించారు. నోటిఫికేషన్‌లో ఉన్న నిబంధనలను మార్చితే న్యాయపరంగా చెల్లుబాటు కాదని సీఎంకు వివరించారు.

## సుప్రీం కోర్టుకు కవిత కేసు..

**విశ్వంభర,ఢిల్లీ :** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టైన ఎమ్మెల్సీ కవిత తీహార్ జైల్లో జుడీషియల్ కస్టడీలో ఉన్నారు. శుక్రవారం ఉదయం ఆమెని కలిసేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీ వెళ్లారు. తీహార్ జైల్లో ఉన్న కవితతో ములాఖత్ అయ్యారు. ఈడీ, సీఐడీ కేసుల్లో ఆమె వేసిన బెయిల్ పిటిషన్లను హై కోర్టు తిరస్కరించింది. ఈ నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై కవిత కుటుంబసభ్యులు దృష్టి సారించారు. సుప్రీం కోర్టులో బెయిల్ పిటిషన్ వేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. సుప్రీం కోర్టులో వేయనున్న బెయిల్ పిటీషన్ పై ఢిల్లీలో న్యాయ నిపుణుల బృందంతో కేటీఆర్, హరీష్ లు చర్చలు జరుపుతున్నారు. సుప్రీం కోర్టు సెలవులు ముగియగానే కవిత బెయిల్ పిటిషన్ వేయనున్నారు. సోమవారం పిటిషన్ వేసే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. అప్పటివరకు కేటీఆర్, హరీష్‌రావులు ఢిల్లీలోనే ఉండి న్యాయవాదులతో సమన్వయం చేసుకోనున్నారు. కాగా, ములాఖత్ లో కవితతో మాట్లాడిన ఇద్దరు నేతలు ఆమెని ధైర్యంగా ఉండాలని సూచించారు. న్యాయవ్యవస్థ పైన పూర్తి నమ్మకం ఉందని, త్వరలోనే బెయిల్ లభిస్తుందని ఇరువురు భరోసా వ్యక్తం చేశారు.

**'కవిత నిస్సహాయ మహిళ కాదు'...**

లిక్కర్ కేసులో అరెస్టైన కవిత దాదాపు నాలుగు నెలలుగా తీహార్ జైల్లోనే గడుపుతున్నారు. ఈడీ, సీబీఐ కేసుల్లో ఆమె వేసిన బెయిల్ పిటిషన్లను ఈ నెల 1 న ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. అంతేకాదు, మహిళ అనే కారణంతో కవితపై సానుభూతి చెప్పలేమని తేల్చి చెప్పేసింది. విద్యావంతురాలిగా, పలుకుబడి కలిగిన మహిళగా ఆమె చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన విషయాన్ని గుర్తుంచుకోవాలంటూ చురకలంటించింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణం కేసులో కవితకి బెయిల్ ఇవ్వాలా? వద్దా? అనే అంశం ఆమెకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యాలపై ఆధారపడి ఉంటుందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో ప్రధాన కుట్రదారుల్లో కవిత కూడా ఒకరని, మరికొందరు నిందితులు కూడా ఆమె తరపునే పని చేసినట్లు తేలిందని కోర్టు వెల్లడించింది. ఈ క్రమంలో ఆమెని నిస్సహాయ మహిళగా భావించలేమంటూ... కవిత బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం రిజెక్ట్ చేసింది.

## కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు

**విశ్వంభర, హైదరాబాద్ :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి మంత్రి సీతక్క శుక్రవారం లీగల్ నోటీసులు జారీ చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారంటూ ఈ లీగల్ నోటీసులు ఇచ్చారు. తన ప్రతిష్టకు భంగం కలిగేలా వీడియో పెట్టారని ఆరోపించారు. తనపై చేసిన తప్పుడు ప్రచారానికి గాను లిఖితపూర్వకంగా క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఇందిరమ్మ రాజ్యం... ఇసుకరాళ్ల రాజ్యం పేరుతో సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టారని పేర్కొన్నారు. జూన్ 24వ తేదీన బీఆర్ఎస్ అధికారిక సోషల్ మీడియా పేజీలో ఈ పోస్టులు పెట్టారు. నిరాధార ఆరోపణలు చేశారని, ఇది సరికాదని ఆమె పేర్కొన్నారు. తమపై చేసిన ఆరోపణలకు గాను తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణలోనే దిక్కులేదు.. ఇతర రాష్ట్రాల్లోనూ పార్టీని నడిపిస్తావా?



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలోనే దిక్కులేదు .. ఇక మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ పార్టీని నడిపిస్తా అని గంభీర్యాలు పలికిన కేసీఆర్ బోల్తాపడ్డాడని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఓటమి పట్ల మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల ప్రజలు బాధపడుతున్నారని కేసీఆర్ వ్యాఖ్యానించడం పట్ల మధుయాష్కి గౌడ్ స్పందించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు. పదేళ్లపాటు అహంకారంతో ప్రజలను పట్టించుకోకుండా, సామాన్యుల సమస్యలు వినకుండా పరిపాలన చేసిన కేసీఆర్... ప్రజలు బాధపడుతున్నారంటూ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. దిగజారుడు మాటలు ఆయన మానసిక స్థితిని తెలియజేస్తున్నాయన్నారు. ఓటమి బాధ నుంచి బయటపడని కేసీఆర్.. తన పరిపాలనలో ఎక్కడ తప్పు చేశానన్న విషయంపై ఆత్మ విమర్శ చేసుకోవటం లేదన్నారు. తన మాయమాటలతో ప్రజలను ఇంకా మభ్య పెట్టాలని చూస్తున్నాడని విమర్శించారు.



# వంద కేసులు పెట్టిన భయపడే ప్రసక్తే లేదు

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

**విశ్వంభర, హుజురాబాద్ :** అరేయ్ బిడ్డ నేను కేసీఆర్ శిష్యుడిని.. కేసులకు భయపడే ప్రసక్తే లేదని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. మీరు ఇలాంటి వంద కేసులు పెట్టిన కూడా.. మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు మేము కేసీఆర్ నాయకత్వంతో మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటామని కాంగ్రెస్కు సవాల్ విసిరారు. ఇంకో సంవత్సరం ఆగితే డైరెక్ట్ గా ముఖ్యమంత్రి కాన్వాయికే అడ్డం తిరుగుతాం.. ఏం చేస్తారో చేసుకోండంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్ రెడ్డి పై రెండ్రోజుల క్రితం క్రిమినల్ కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. భారత్ న్యాయ సంహిత చట్టంలో కేసు నమోదు అయిన మొట్టమొదటి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డినే. జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే వ్యవహారించిన తీరుపై జడ్పీ సీఈవో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ పమేలా సత్పతి బయటికి వెళ్ళే సమయంలో కౌశిక్ రెడ్డి అడ్డుకుని బైఠాయించారు. దీంతో ఆయనపై భారత్ న్యాయ్ సంహిత యాక్ట్ ప్రకారం సెక్షన్ 221,126 (2ఊ కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్ చట్టం అమలులోకి వచ్చిన రెండవ రోజే కౌశిక్ రెడ్డి పై నమోదు అయింది.

# పర్యాటకులను ఆకర్షించే విధంగా నల్లమల ఫారెస్ట్ అభివృద్ధి

## మంత్రి జూపల్లి



**విశ్వంభర, అచ్చంపేట:** దేశంలోని టూరిస్టును ఆకర్షించే విధంగా నల్లమల ఫారెస్ట్ ను అభివృద్ధి చేస్తామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. నల్లమలలోని పర్యాటక ప్రాంతాలను గుర్తించేందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహ,ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు తో కలిసి కృష్ణారావు శుక్రవారం అచ్చంపేట నుంచి బయలుదేరారు.ముందుగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉమామహేశ్వరం ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి మొదటి విడతగా రూ.50లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరం వచ్చే విధంగా ప్రధాన రహదారిపై బోర్డులను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. 2 రోజులపాటు నల్లమలలో పర్యటించి పురాతన ఆలయాలతో పాటు టూరిజం పరంగా అభివృద్ధి చేసే ప్రాంతాలను పరిశీలిస్తామని తెలిపారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చడంతో పాటు ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇక ఆ తర్వాత రంగాపూర్ నిరంజన్ షావలి దర్గాను మంత్రులు, ఎమ్మెల్యేలు దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# బర్రెలక్క అరెస్ట్..

## స్టేషన్ కి తరలించిన పోలీసులు..!



**విశ్వంభర, హైదరాబాద్ :** సోషల్ మీడియాలో ఒక్క వీడియోతో రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన బర్రెలక్క అలియాస్ శిరీష అరెస్ట్ అయ్యారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికై నిరుద్యోగ జేఏసీ, పలు విద్యార్థి సంఘాలు శుక్రవారం టీజీపీఎస్సీ ముట్టడికి పిలుపునిచ్చాయి. ఈ మేరకు హైదరాబాద్ నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద బర్రెలక్క ఆందోళనకు దిగారు. టీజీపీఎస్సీ ఆఫీస్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు ఈ క్రమంలో ఆమె పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే తనను అరెస్ట్ చేయడం ఏంటని పోలీసుల తీరుపై మండిపడ్డారు. తెలంగాణలో రౌడీ రాజ్యం నడుస్తోందని బర్రెలక్క ఘాటు వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కాగా, నిరుద్యోగుల ముట్టడి నేపథ్యంలో ఇవాళ ఉదయం నుండి టీజీపీఎస్సీ కార్యా లయం వద్ద హై టెన్షన్ వాతావరణం నెలకొం ది. జేఏసీ పిలుపు మేరకు పెద్ద ఎత్తున నిరుద్యోగులు తరలివచ్చి ఆందోళనకు దిగారు. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు ఎక్కడి కక్కడే నిరుద్యోగులను అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.



# త్వరలోనే తెలంగాణలో మరో యూనివర్సిటీ..!

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ విద్యార్థులకు గుడ్ న్యూస్ అనే చెప్పాలి. గత ఏడాది డిసెంబర్ లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కొత్త కొత్త మార్పులను తీసుకొస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే కూడా మెరుగైన వైద్యం, విద్యను అందించేందుకు ప్రణాళికలను రచిస్తోంది. ముఖ్యంగా కోడంగల్ నియోజకవర్గంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయనున్నారు. మధిరలో కూడా మరో కళాశాల ఏర్పాటు చేయనున్నారు. దీంతో బీజేపీ నేతలు సీఎం, డిప్యూటీ సీఎం నియోజకవర్గాల్లోనే మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే.. మిగతా నియోజకవర్గాల పరిస్తితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే.. తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. త్వరలోనే రాష్ట్రంలో రాజీవ్ గాంధీ స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. న్యాక్ సెంటర్ వద్ద మొత్తం 32 ఎకరాల విస్తీరణంలో స్కిల్ వర్సిటీ నిర్మిస్తామన్నారు. ఇక, కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే ఆరోగ్య శ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచామని గుర్తు చేశారు. ఫార్మా దిగ్గజాలు సీఎస్ఆర్ ఫండ్స్ ఇవ్వాలని కోరారు. రూ.32 వేల కోట్ల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.

# జులై 7న మాదిగ గర్జనను విజయవంతం చేయాలి

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రమణనంపల్లి వెంకటయ్య



**విశ్వంభర, పీఏపల్లి :** జులై 7న హైదరాబాదులో జరిగే తెలంగాణ ఎమ్మార్పీఎస్ మాదిగ దీక్షను విజయవంతం చేయాలని పీ.ఏ.పల్లి మండలం అంగడిపేట స్టేజి వద్ద ఎమ్మార్పీఎస్ టీఎస్ మండల అధ్యక్షుడు రమణనంపల్లి వెంకటయ్య ఆధ్వర్యంలో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తున్నందుకు వెంటనే వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో వర్గీకరణ సాధనకై వంగపల్లి శ్రీనివాస్ ఈనెల 7న హైదరాబాద్ ఇంద్ర పార్క్ దగ్గర చేపట్టిన దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఎల్లేష్, నియోజకవర్గ ఇంచార్జ్ పోట్ట మురళి పిలుపుమేరకు ఉమ్మడి పీఏపల్లి మండలంలోని ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో దీక్షకు తరలిరావాలని కోరారు. అనంతరం దీక్ష కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా నాయకులు ఏలేటి నరసింహ, వట్టేపుగోవర్ధన్, మద్దిమడుగు అచ్యుత్ కుమార్, మార్కు ,భాషిపాక రవి, మద్దిమడుగు కాశయ్య, ధర్మపురం ఎల్లయ్య, గోవర్ధన్, సునీల్, మార్తిన్, కోటి, శేఖర్ ప్రవీణ్, సైమన్, హరి, గండు వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ఆస్పత్రి కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

**విశ్వంభర, దేవరకొండ :** దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాములు నాయక్కు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ నెల 15 నుంచి కనీస వేతనం 15,600 అమలు చేయనిచో సమ్మెలోకి వెళ్తామని ఏఐటీయూసీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తున్నారని జీవో నెంబర్ 60 ప్రకారం నెలకు 15,600 ఇవ్వాలని కమిషనర్ జీవో అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని పీఎఫ్ కటింగ్ యజమాన్యం కార్మికులకు 3600 పీఎఫ్ పోగా మిగతా 12వేల రూపాయలు ఇవ్వాలని రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేసి వారికి కనీసం నెలకు 30,000 జీతం ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ కోశాధికారి జూలూరి వెంకట రాములు, కార్మిక నాయకులు అంకురి రామేశ్వరమ్మ, వనజ, రాణి, భద్రమ్మ, తారమ్మ, రాణి, అలివేలు, జానకి, లింగమ్మ, శాంతి పద్మ, ప్రణయ్, శారద, వెంకటయ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

**విశ్వంభర, దేవరకొండ :** దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో గురువారం జరిగిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ దేవరకొండ డిపో సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.రెడ్డి, జిల్లా కార్యదర్శి బాసాని వెంకటయ్య, జిల్లా అడ్వైజర్ మొయినుద్దీన్ హాజరై మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు నిర్వహించిందని భవిష్యత్తులో కార్మికుల సమస్యల పరిష్కారమే ఎజెండగా పనిచేస్తుందని వారు అన్నారు. అనంతరం దేవరకొండ డిపో ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. నూతన డిపో కార్యదర్శిగా బి. యాదయ్య, డిపో అధ్యక్షులు డీ యాదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వీజే రెడ్డి, సహాయ కార్యదర్శి లక్ష్మయ్య, ప్రచార కార్యదర్శి ఎండీ జానీ పాషా తదితరులను ఎన్నుకున్నారు.



# బీజేవైఎం నాయకుల అక్రమ అరెస్టు సిగ్గుచేటు




**విశ్వంభర, చింతపల్లి :** బీజేవైఎం నాయకుల అక్రమ అరెస్టులు సిగ్గుచేటని చింతపల్లి బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్ గౌడ్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి బీజేవైఎం పిలుపునివ్వడంతో చింతపల్లి బీజేపీ, బీజేవైఎం నాయకులను ముందస్తుగా పోలీసులు తెల్లవారుజామున అరెస్టు చేసి పోలీసు స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా బోడ్డు మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. తమ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతీ ఒక్కరికి ఉందని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకలను ఆపాలని చూస్తే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేరికల మీద ఉన్న శ్రద్ధ విద్యార్థుల మీద లేకపోవడం బాధాకరమన్నారు. గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులను అదనంగా పెంచాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ని వెంటనే ప్రకటించాలన్నారు. పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు జీవో నంబర్ 46 రద్దుచేసి వారికి న్యాయం చేయాలన్నారు. అన్ని నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అరెస్ట్ చేసిన బీజేవైఎం నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరెస్ట్ అయిన వారిలో రాపర్తి సతీష్, గజ్జె అభినవ్, సోమరాజు ప్రదీప్, కుందేళ్ల శ్రీశైలం, కంచుకట్ల వినోద్, గడ్డి మహేందర్, చనమోని అరవింద్ తదితరులు పాల్గొన్నారు.






# కొత్త క్రిమినల్ చట్టాలు ప్రజా ఉద్యమాలను అణచడానికేనా?




ఎన్‌డీఏ ప్రభుత్వం 2023లో కొత్తగా తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను 2024 జులై 1 నుంచి అమలులోనికి వచ్చినవి. వీటిని పరిశీలించితే ప్రజాస్వామ్య ఉద్యమాలపైన, హక్కులకొరకు ఉద్యమిస్తున్న ఉద్యమకారుల పైన కఠినతరమైన చట్టాలను ప్రయోగించి వారిని జీవితాంతం జైళ్లలో లేదా మరణశిక్ష విదించే విధంగా రూపొందించినారు. పాత చట్టాలలో ఉన్న వాటికి అదనంగా కొన్ని సెక్షన్స్ చేర్చి మరింత కఠిన తరం చేశారు. వీటిని అమలులో పోలీసులకు విశేష అధికారాలు కల్పించారు. పాత భారతీయ శిక్షాస్మృతిలోని 24 సెక్షన్లను తొలగించి, కొత్తగా తీసుకొచ్చిన బీఎస్ఎన్‌లో 23 కొత్త సెక్షన్లను చేర్చి కొత్త చట్టాన్ని రూపొందించారు. కొత్త చట్టం ద్వారా రాజ్యద్రోహం అనే దాన్ని దేశద్రోహంగా మార్చారు. హక్కులకొరకు ఉద్యమించే వారిపైనా.., పౌరహక్కులకొరకు ఉద్యమంచే వారిపైనా చివరకు హక్కుల రక్షణలకు ఢిల్లీ పార్లమెంటును ముట్టడించినా, ప్రజాస్వామ్య ఉద్యమకారులను అడిచి వేటకు.. కొత్త రాష్ట్రం కోసం ఎవరైనా గొంతు ఎత్తితే కూడా ఈ కొత్త నిబంధన ప్రకారం నేరం అవుతుంది. పాత నిబంధనలో సార్వభౌమత్వం, సమగ్రత అన్న పదాలు లేవు. వాటిని ఈ కొత్త నిబంధనలు చేర్చారు.

ఇవి ప్రజాస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన చట్టాలని న్యాయకొవిధులు, మేధావులు, విపక్ష పార్టీల నేతలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కొత్త క్రిమినల్ చట్టాల అమలును వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ చట్టాల్లో అనేక తిరోగమన నిబంధనలు ఉన్నాయని విమర్శించారు.

భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు అనుగుణంగా రాజ్యాంగాన్ని రూపకల్పన చేసుకోవడం జరిగింది. ఈ 77 సంవత్సరాల ప్రజాస్వామ్య పాలనలో అనేక చట్టాలను మార్పులు చేసుకోవడం జరిగింది. 2014 లో అధికారంలోనికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం బ్రిటిష్ కాలము నాటి చట్టాలను మన దేశ పరిపాలన అవసరాలకు అనుకూలంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రకటించారు. అందుకు అనుగుణంగానే పార్లమెంట్లో చట్టాలపై చర్చించి ప్రజామోదంతో చట్టాల రూపకల్పన చేసుకోవచ్చు. కానీ 2019లో బిజెపికి తిరుగులేని మెజార్టీ రావడంతో ఏకపక్షంగా వారు చెబుతున్నట్టు చట్టాలలో మార్పులు తీసుక రావాలసిన సంస్కరణలపై చర్చించి అవసరం వస్తే పార్లమెంట్ స్టాండింగ్ కమిటీని వేసి, బహిరంగ చర్చలకు అనుమతించి ప్రజాభిప్రాయాన్ని పొందుతూ చట్టాల్లో చేర్పులు మార్పులు తీసుకురావచ్చు. కానీ 202021లో కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తు పార్లమెంట్లో సమావేశాలు బహిష్కరించిన సందర్భంలో ఎలాంటి చర్చలు లేకుండా 44 కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొచ్చి నాలుగు కోడ్లుగా మార్చినారు. అదేవిదంగా 2023 పార్లమెంట్ సమావేశంలో ఇండియన్ పినల్ కోడ్(ఐపీసీ) భారతీయ న్యాయ సంహిత చట్టాన్ని, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ) భారతీయ నాగరిక్ సురక్ష సంహితచట్టాన్ని, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈఏ ) భారతీయ సాక్షియ అధినియం చట్టాన్ని ప్రతి పక్షాలు తీవ్రంగా వ్యతిరేకించ నప్పటికీ 146 మంది సభ్యులను సస్పెండ్సు కనీసం చర్చలు లేకుండా, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి రికమండేషన్ చేయకుండా మూజువాడి ఓటుతో కొత్త చట్టాలు డిసెంబర్ 2023 నాడు పార్లమెంట్లో ఆమోదించుకున్నారు. కొత్త చట్టాలపై ఎలాంటి చర్చ జరగకుండా కొన్ని నిమిషాలలోనే పార్లమెంట్లో ఆమోదం పొందారు. 2024 జూలై 1 నుంచి ఈ మూడు చట్టాలు అమలులోనికి తీసుకొచ్చారు.

భారతీయ న్యాయ సంహిత : భారతీయ న్యాయ సంహిత చట్టంలో 350 విభాగాలు ఉన్నాయి. దేశంలోని కొత్త క్రిమినల్ కోడ్, దీనిలో 511 సెక్షన్లు ఉన్నాయి. 163 ఏళ్ల పాత ఐపిసిని ఈ కొత్త చట్టం భర్తీ చేయనుంది. అత్యాచారం, ఆర్గనైజేషనల్ క్రైమ్స్, సైబర్ క్రైమ్స్ వంటివి పరిష్కరించేందుకు కొత్త చట్టంలో పొందుపరిచారు.

ఈ కొత్త చట్టాలతో దేశ న్యాయవ్యవస్థలో ఎన్నో కీలక మార్పులు చోటు చేసుకుంటారని తెలిసింది. జీరో ఎఫ్ఐఆర్, ఆన్ లైన్‌లో పోలీసులకు కంప్లైంట్ రిజిస్ట్రేషన్, ఎస్ఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ మోడ్ల ద్వారా సమన్లు పంపడం, క్రూరమైన నేరాలకు సంబంధించి వీడియోగ్రఫీ తప్పనిసరి వంటి నిబంధనలు కొత్త చట్టాల ద్వారా అమల్లోనికి వస్తాయని చెప్పుతున్నది. రాజ్యాంగంలో పొందుపరిచిన ఐడియాలజీలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత సామాజిక వాస్తవాలను, నేరాలను పరిష్కరించేందుకు, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అవసరమైన మెకానిజాన్ని ఈ చట్టాలు అందిస్తాయని హోంశాఖ అధికారులు అభిప్రాయపడ్డారు.

కొత్త నేరచట్టాలను వాయిదా వేయాలి

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా కొత్త నేర చట్టాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ అంశాన్ని విపక్ష పార్టీలు పార్లమెంటులో లేవనెత్తుతాయని స్పష్టం చేశారు. ఈ మూడు కొత్త నేర చట్టాలను సీపీఐ వ్యతిరేకిస్తుందని తెలిపారు.

మూడు కొత్త నేర చట్టాల అమలుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే తీవ్రంగా ఖండించారు. ఎన్నికలలో రాజకీయంగా, నైతికంగా ఎదురు దెబ్బ తిన్న మోడీజీ బీజేపీ రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నట్లు నటిస్తున్నారు. ఇండియా ఐక్య సంఘటన ఇకపై ఈ' బుల్డోజర్ సీస్టిస్ 'ను పార్లమెంటరీ వ్యవస్థలో అమలు చేయడానికి అనుమతించం ' అని స్పష్టం చేశారు. 'జూలై 1, 2024 అర్ధరాత్రి 12 నుంచి అమలు లోకి వచ్చిన కొత్త నేర చట్టాలు ఈరోజు భారతదేశంలో పోలీసు రాజ్యాంగా మార్చడానికి పునాదులు వేసింది. వాటిని అమలులో తక్షణమే నిలిపి చేయాలని తృణమూల్ కాంగ్రెస్ నేత.. మమత బెనర్జీ, డీఎంకే నేత స్టాలిన్, తదితరులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ డిమాండ్ చేశారు.



- ఉజ్జిని రత్నాకర్ రావు
సెల్ :9490952646
ఏఐటీయుసీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి

## మహోన్నత పార్లమెంటేరియన్ వ్యక్తి

# జగ్జీవన్ రాం

### నేడు బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి



**భారత దేశ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేత జగ్జీవన్ రామ్. అతి చిన్న వయస్సులో (27 ఏళ్లకే) శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యి రికార్డు సృష్టించిన ప్రజానాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, బాబూ జగ్జీవన్ రాం. పోలిటికల్ కింగ్ మేకర్‌గా రాజకీయంలో రాణించి, అధికారం కోసం కాకుండా ప్రజా శ్రేయస్సు కోసమే పనే చేసిన మహోన్నత వ్యక్తిత్వం ఆయన సొంతం. యాభై ఏళ్ళు పార్లమెంట్‌లో సభ్యునిగా కొనసాగిన సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది.**

1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రం, షాబాద్ జిల్లా, ఛాందా గ్రామంలో శిబిరం, బసంతి దేవి దంపతులకు జగ్జీవన్ జన్మించారు. ఆయన ఒక పేద దళిత కుటుంబంలో జన్మించడంతో ఎన్నో అవమానాలను, ఛీత్కారలను ఎదుర్కొన్నారు.

చిన్ననాడే తండ్రి చనిపోవడంతో సాంఘిక, ఆర్థిక ఇక్కట్ల మధ్య తల్లి వసంతీదేవి సంరక్షణలో తన చదువు కొనసాగించారు. రాత్రింబవళ్ళు భోజ్‌పురితో పాటు హిందీ, ఇంగ్లీషు, బెంగాలి, సంస్కృత భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఇంటర్, కలకత్తా విశ్వ విద్యాయం నుంచి డిస్టింక్షన్‌లో బిఎస్సీ డిగ్రీ పూర్తి చేసి పట్టభద్రు డయ్యారు. పీజీ చదువు పూర్తి చేశారు.

కార్మికుల కోసం పోరాడి 35వేల మంది కార్మికులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి అనేకమంది జాతీయ నాయకుల దృష్టిలో పడ్డారు. ఆయన జీవితకాలం 78 ఏళ్ళు అయితే అందులో 52 ఏళ్ళు రాజకీయ జీవితం గడిపారు. 1952లో భారత రిపబ్లిక్ తొలి లోక్‌సభ ప్రవేశించిన జగ్జీవన్‌రామ్ వరుసగా ఎనిమిది సార్లు గెలిచారు. ఏకధాటిగా 33 సంవత్సరాలు కేంద్రమంత్రిగా, దేశ ఉప ప్రధానిగా ఆయన ప్రత్యేకత చాటుకున్నారు.

మొదటి శ్రేణి పార్లమెంట్ రియన్‌గా నిలిచారు. మంత్రి మండలిలో అతి చిన్న వయసుడైన జగ్జీవన్‌రామ్‌ను అందరూ 'బేబి మినిష్టర్' అని పిలిచే వారు. ప్రజలంతా ప్రేమతో 'బాబుజీ' అని పిలిచే వారు. వ్యవసాయ శాఖ మంత్రిగా, ఆహార శాఖ మంత్రిగా, రైల్వే మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఎన్నో సేవలనందించిన ప్రగతిశీలి ఆయన. దామోదరం సంజీవయ్యను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చెయ్యటంలో కీలకపాత్ర పోషించారు.

1942లో కాంగ్రెస్ లో చేరి, జగ్జీవన్ 1969లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 1977లో ఇందిరా గాంధీతో విభేదించి పార్టీ నుంచి బయటకు వచ్చి 'ప్రజాస్వామ్య కాంగ్రెస్' పార్టీ ఏర్పాటు చేశారు. ఇంద్రాణిదేవితో బాబుజీకి 1935 జూన్ 1న వివాహం జరిగింది. ఇంద్రాణి కూడా స్వాతంత్ర్య సమరయోధురాలు. ఆయన కుమార్తె మీరాకుమార్ తండ్రి ఆదర్శాలతోనే పెరిగి, ఆయన బాటలోనే కేంద్రమంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా దేశానికి సేవలందించారు.

బాబుజీ గొప్ప రచయిత అన్న సంగతి చాలా మందికి తెలియదు. ఆయన హిందీలో, ఇంగ్లీషులో రచనలు చేశారు. "భారత దేశంలో కులం సవాళ్ళు", " జీవన సరళి వ్యక్తిత్వ వికాసం" అను రెండు విశిష్ట గ్రంథాలను రాశారు.


ఆయన గొప్ప అధ్యయనశీలి. ఉజ్జయినిలోని విక్రమ విశ్వ విద్యాయం 1967లో జగ్జీవన్‌రామ్‌కు 'డాక్టర్ ఆఫ్ సైన్స్' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన సేవను మెచ్చిన కాన్పూర్ విశ్వవిద్యాయం 1968లో డాక్టరేట్‌తో సత్కరించింది. జగ్జీవన్ రామ్ అమూల్యరత్నం'' అని గాంధీ ఒక సందర్భంలో రాశారు. 1986 జూలై 6వ తేదీన బాబూజీ తన తుదిశ్వాస విడిచారు.

బాబు జగ్జీవన్ రామ్ వరుసగా ప్రజాప్రతినిధిగా, భారత దేశంలో ఎక్కువ కాలం పనిచేసిన క్యాబినెట్ మంత్రిగా రికార్డు సృష్టించారు. ఆయన కేంద్ర కార్మిక మంత్రిగా 1946 నుండి 1952 సంవత్సరం వరకు ఉన్నారు. ఆయన 1952 నుండి 1956 సంవత్సరం వరకు కేంద్ర సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు.1956 నుండి 1962 వరకు కేంద్ర రవాణా, రైల్వే శాఖ మంత్రిగా పని చేశారు.1962 నుండి 1963 సంవత్సరం వరకు ఆయన కేంద్ర రవాణా మరియు సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. 1966 నుండి 1967 సంవత్సరం వరకు కేంద్ర కార్మిక, ఉపాధి మరియు పునరావాస శాఖ మంత్రిగా పని చేశారు. 1967 నుండి 1970 వరకు కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నారు. 19701974, 1977 1979 కేంద్ర రక్షణ మంత్రిగా ఉన్నారు.1974 నుండి 1977 వరకు కేంద్ర వ్యవసాయ, నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నారు. సెప్టెంబర్ 1976 నుండి 1983 ఏప్రిల్ వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షుడిగా పని చేశారు. భారత ఉప ప్రధాన మంత్రిగా, 1977 మార్చి 24 నుండి 1979 జూలై 28 వరకు విధులు నిర్వర్తించారు.

- రామ కిష్టయ్య సంగన భట్ల..
9440595494

# పీడియాట్రిక్ వైకల్యాలను నిర్లక్ష్యం చేయడం

### ముందస్తు జోక్యానికి ప్రాధాన్యత ఇవ్వడానికి ఒక పిలుపు



పీడియాట్రిక్ వైకల్యాలు, పుట్టుకతో వచ్చే అసాధారణతల నుంచి అభివృద్ధి రుగ్మతల వరకు, పిల్లలు మరియు వారి కుటుంబాలకు గణనీయమైన సవాళ్లను కలిగిస్తాయి. దురదృష్టవశాత్తూ, ఈ పరిస్థితులు తరచుగా సమాజం, బీమా కంపెనీలు మరియు ప్రభుత్వ పథకాల నిర్లక్ష్యంతో బాధపడుతున్నాయి, ఇవి పిల్లల దీర్ఘకాలిక ఆరోగ్యం మరియు స్వాతంత్ర్యంపై హానికరమైన ప్రభావాలను చూపుతాయి. ఈ కథనం పిల్లల వైకల్యాలకు చికిత్స చేయడంలో ముందస్తు జోక్యం యొక్క క్లిష్టమైన ప్రాముఖ్యతను అన్వేషిస్తుంది మరియు అన్ని వాటాదారుల నుండి మరింత చురుకైన విధానం కోసం వాదిస్తుంది.

**చికిత్సకు అడ్డంకులు**

పిల్లల వైకల్యాలను నిర్లక్ష్యం చేయడానికి అనేక అంశాలు దోహదం చేస్తాయి:

1) సామాజిక కళంకం : శారీరక వ్యత్యాసాల పట్ల అపోహలు మరియు సామాజిక వైఖరులు తరచుగా ఒంటరితనం మరియు వివక్షకు దారితీస్తాయి, కుటుంబాలు చికిత్స పొందకుండా నిరుత్సాహపరుస్తాయి.

2) ఆర్థిక పరిమితులు : ప్రత్యేక చికిత్సలు మరియు శస్త్రచికిత్సల కోసం బీమా కవరేజీ తరచుగా పరిమితం చేయబడుతుంది, కుటుంబాలు గణనీయమైన ఆర్థిక భారాన్ని మోయడానికి లేదా అవసరమైన సంరక్షణను వదులుకోవలసి వస్తుంది.

3) అవగాహన మరియు విద్య లేకపోవడం : అనేక కుటుంబాలు మరియు ఆరోగ్య సంరక్షణ ప్రదాతలకు కూడా అందుబాటులో ఉన్న చికిత్సలు లేదా ముందస్తు జోక్యం వల్ల కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాల గురించి పూర్తిగా తెలియకపోవచ్చు.

4) ఫ్రాగ్మెంటెడ్ హెల్త్‌కేర్ సిస్టమ్స్ : కొన్ని ప్రాంతాల్లో, ప్రత్యేకమైన పీడియాట్రిక్ కేర్‌కు యాక్సెస్ పరిమితం కావచ్చు, ఇది రోగ నిర్ధారణ మరియు చికిత్సలో జాప్యానికి దారి తీస్తుంది. అలాగే పీడియాట్రిక్ వైకల్యాలకు సంబంధించిన బోధన మరియు శిక్షణ కార్యక్రమాలు నిశ్శబ్దంగా పరిమితం చేయబడ్డాయి మరియు తృతీయ సంరక్షణ కేంద్రాలలో మాత్రమే అందుబాటులో ఉంటాయి.

**ముందస్తు జోక్యం యొక్క ప్రాముఖ్యత**

పిల్లల వైకల్యాల ప్రభావాన్ని తగ్గించడంలో మరియు పిల్లల స్వతంత్రతను ప్రోత్సహించడంలో ముందస్తు జోక్యం కీలకం. ఇక్కడ ఎందుకు ఉంది.

1) అభివృద్ధి సంభావ్యతను పెంచడం : పిల్లల శారీరక మరియు అభిజ్ఞా అభివృద్ధిని ఆప్టిమైజ్ చేయగల దిద్దుబాటు శస్త్రచికిత్సలు, భౌతిక చికిత్స మరియు సహాయక పరికరాలు వంటి సకాలంలో జోక్యాలను ప్రారంభ చికిత్స అనుమతిస్తుంది.

2) సెకండరీ సంక్లిష్టతలను నివారించడం : వైకల్యాలను ముందుగానే పరిష్కరించడం వలన సంకోచాలు మరియు దీర్ఘకాలిక నొప్పి వంటి ద్వితీయ సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇది చలనశీలత మరియు జీవన నాణ్యతను గణనీయంగా దెబ్బతీస్తుంది.

3) మానసిక శ్రేయస్సు : శారీరక వ్యత్యాసాలను ముందుగానే పరిష్కరించడం ద్వారా మరియు పిల్లల కోసం సహాయక వాతావరణాన్ని పెంపొందించడం ద్వారా సమయానుకూల జోక్యాలు సానుకూల ఆత్మ గౌరవాన్ని మరియు సామాజిక ఏకీకరణను ప్రోత్సహిస్తాయి.

4) దీర్ఘకాలిక వ్యయ పొదుపులు : ప్రారంభ చికిత్స ఖర్చులు నిరుత్సాహకరంగా అనిపించినప్పటికీ, ముందస్తు జోక్యం చికిత్స చేయని వైకల్యాల నుండి ఉత్పన్నమయ్యే సమస్యలను నిర్వహించడానికి దీర్ఘకాలిక ఆరోగ్య సంరక్షణ వ్యయాలను తగ్గిస్తుంది.

**సొసైటీ, ఇన్సూరెన్స్ కంపెనీలు మరియు ప్రభుత్వ పాత్ర**

పీడియాట్రిక్ వైకల్యాల నిర్లక్ష్యం పరిష్కరించడానికి, బహుళ వాటాదారుల నుండి సమిష్టి ప్రయత్నాలు అవసరం:

1) సమాజం : విద్య మరియు న్యాయవాదం ద్వారా అవగాహన మరియు చేరికను ప్రోత్సహించడం వలన వారి పిల్లలకు సకాలంలో చికిత్స అందించడంలో కళంకం మరియు మద్దతు కుటుంబాలు తగ్గుతాయి.

2) ఇన్సూరెన్స్ కంపెనీలు : కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక అడ్డంకులను తగ్గించడానికి ప్రత్యేక పీడియాట్రిక్ కేర్ మరియు థెరపీల కోసం కవరేజీని మెరుగుపరచడం చాలా అవసరం.

3) ప్రభుత్వం : పీడియాట్రిక్ వైకల్యాలను ముందస్తుగా గుర్తించడం, జోక్యం చేసుకోవడం మరియు పునరావాస సేవలకు ప్రాధాన్యతనిచ్చే సమగ్ర ఆరోగ్య సంరక్షణ విధానాలను అభివృద్ధి చేయడం చాలా కీలకం. ఇందులో నిధుల పరిశోధన, ప్రత్యేక సంరక్షణకు ప్రాప్యతను మెరుగుపరచడం మరియు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల్లో పిల్లల పునరావాసాన్ని ఏకీకృతం చేయడం వంటివి ఉన్నాయి.

**ముగింపు**

పీడియాట్రిక్ వైకల్యాలను నిర్లక్ష్యం చేయకూడదు లేదా తక్కువ అంచనా వేయకూడదు. సమయానుకూల జోక్యం అనేది కేవలం కాస్మెటిక్ మెరుగుదల గురించి మాత్రమే కాదు, పిల్లల మొత్తం శ్రేయస్సు మరియు భవిష్యత్తు స్వాతంత్ర్యానికి ప్రాథమికమైనది. ఈ వైకల్యాలను ముందుగానే పరిష్కరించడం ద్వారా, మనం సంతృప్తికరమైన జీవితాలను గడపడానికి మరియు సమాజానికి అర్థవంతంగా సహకరించడానికి పిల్లలను శక్తివంతం చేయవచ్చు. పిల్లల వైకల్యాల కోసం ముందస్తు జోక్యానికి ప్రాధాన్యతనిచ్చే మరియు మద్దతు ఇచ్చే విధానాలు మరియు అభ్యాసాల కోసం మేము వాదించడం అత్యవసరం, ప్రతి బిడ్డ వారి పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడానికి అవకాశం ఉందని నిర్ధారిస్తుంది. వాకింగ్ కిడ్ ఫౌండేషన్ అనేది లాభాపేక్ష లేని ప్రభుత్వ సంస్థ, పీడియాట్రిక్ కన్సల్టెంట్‌ల బృందం ద్వారా ఈ లక్ష్యాల కోసం పని చేస్తోంది. ప్రతి పిల్లవాడు తన తల పైకెత్తి జీవించగలిగే వైకల్య రహిత ప్రపంచం వైపు పని చేయాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాం.

**నిర్లక్ష్యం యొక్క ప్రభావం**

**పీడియాట్రిక్ వైకల్యాలు పుట్టుకతో వచ్చే అవయవ వ్యత్యాసాలు, క్రానియోఫేషియల్ క్రమరాహిత్యాలు, పార్శ్వగూని వంటి వెన్నెముక వైకల్యాలు మరియు సెరిబ్రల్ పాల్సీ వంటి నరాల సంబంధిత రుగ్మతలతో సహా అనేక రకాల పరిస్థితులను కలిగి ఉంటాయి. ఈ పరిస్థితులు పిల్లల శారీరక రూపాన్ని ప్రభావితం చేయడమే కాకుండా వారి చలనశీలత, అభిజ్ఞా వికాసం, స్వాతంత్ర్యం మరియు మొత్తం జీవన నాణ్యతను కూడా ప్రభావితం చేస్తాయి. ఈ వైకల్యాలను నిర్లక్ష్యం చేయడం వల్ల వాటి ప్రభావాలను మరింత తీవ్రతరం చేస్తుంది. సకాలంలో వైద్య జోక్యం లేకుండా, పిల్లలు రోజువారీ కార్యకలాపాలు, సామాజిక పరస్పర చర్యలు, విద్య మరియు ఉద్యోగ అవకాశాలలో తీవ్రమైన పరిమితులను ఎదుర్కోవచ్చు. అంతేకాకుండా, చికిత్స చేయని వైకల్యాలు సామాజిక కళంకం కారణంగా దీర్ఘకాలిక నొప్పి, కీళ్ల సమస్యలు మరియు మానసిక ఆరోగ్య సమస్యలతో సహా ద్వితీయ సమస్యలకు దారితీయవచ్చు.**



- డాక్టర్ AV ఆనంద్
కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఆర్థోపెడిషియన్
అపోలో గ్రూప్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ పీడియాట్రిక్ ఆర్థోపెడిక్స్ అండ్ గైట్ డిజార్డర్స్



# ఉద్యాన అధికారులకు పోస్టింగ్ ఆర్డర్స్ అందజేత

**విశ్వంభర, హైదరాబాద్ :** సెక్రటేరియట్‌లో శుక్రవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన చాంబర్‌లో నూతనంగా ఎన్నికైన ఉద్యాన అధికారులకు పోస్టింగ్ ఆర్డర్స్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యాన పంటలు మరియు వాటి ప్రాముఖ్యత అలాగే అధికారుల కృషివల్ల ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి గురించి తెలియజేశారు. అలాగే నూతనంగా ఎన్నికైన అధికారులు కష్టపడి పని చేసి ఉద్యానశాఖ మరియు రైతుల అభివృద్ధికి దోహదపడాలని దిశానిర్దేశం చేశారు. నూతనంగా ఎన్నికైన ఉద్యాన అధికారులకు గత నెల అనగా 13.06.2024 నుండి 05.07.2024 వరకు ఉద్యాన, వ్యవసాయ మరియు ఇతర అనుబంధ శాఖల గురించి అలాగే వారు చేపట్టే కార్యక్రమాలు, వాటి ఆవశ్యకత, సాంకేతికత తదితర అంశాలపైన శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ రఘునందన్ రావు, ఉద్యాన శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాషా, ఉద్యానశాఖ అధికారులుపాల్గొన్నారు.



# పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి

### మున్సిపల్ కమిషనర్ టీ మోహన్

**విశ్వంభర, మెట్పల్లి :** మెట్పల్లి పట్టణంలోని అంబేద్కర్ పార్క్ మరియు కూబ్ సింగ్ కుంట పార్కులో గల చెట్లను మున్సిపల్ కమిషనర్ టీ మోహన్ పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. వివిధ ఆకారాల్లో డిజైన్ చేస్తూ పార్కులకు వచ్చే వారికి మానసిక ఉల్లాసాన్ని కలిగించే విధంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ప్రతినిత్యం చెట్లకు నీటి సరఫరా చేస్తూ పచ్చదనం కనిపించే విధంగా తీర్చిదిద్దాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్చార్జి ఇన్స్పెక్టర్ గుర్రం రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నిజాం, అశోక్, నరేష్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.




# పాలస్తీనాకు సంఘీభావంగా రేపు ఇందిరాపార్క్ వద్ద నిరసన

### అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం

**విశ్వంభర, హిమాయత్‌నగర్ :** పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న ఏకపక్ష భీకర దాడులకు నిరసనగా అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం తెలంగాణ రాష్ట్ర సంఘం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఏఐపీఎస్ఓ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ తెలిపారు. ఈ నిరసర కార్యక్రమం జయప్రదం చేయాలని ముద్రించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్, హిమాయత్ నగర్, అమృత ఎస్టేట్స్ ఏఐపిఎస్ఓ రాష్ట్ర కార్యాలయంలో ఎఐపిఎస్ఓ జాతీయ అధ్యక్షవర్గ సభ్యులు డాక్టర్ దిడ్డి. సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రపంచం ఇజ్రాయెల్‌పై ఒత్తిడి చేయకపోతే, గాజాపై యుద్ధం, పాలస్తీనియన్ల పై అణచివేత కొనసాగుతూనే ఉంటుందని, పౌర మరణాలు మరియు విధ్వంసం మితిమీ రిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనాలో శాంతి నెలకొల్పడానికి ప్రపంచ దేశాలు, పౌర సంఘాలు కృషిచేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో ఎఐపిఎస్ఓ హైదరా బాద్ జిల్లా ప్రధాన కార్యదర్శులు రామరాజు, జెకె శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రాం నారాయణ, రంగారెడ్డి జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి పొలగాని రవికిషోర్, నేతలు మాజిద్, సోహెల్, యమున గౌడ్, జావెద్, సుబ్బారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఎఐపిఎస్ఓ సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, రాష్ట్ర కార్యవర్గం సభ్యులు రఘుపాల్ పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు, శాంతి కాముకులు పాల్గొనే నిరసన కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగనుందని తెలిపారు.



# వాన కోసం బతుకమ్మ

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం సర్వపల్లి గ్రామంలో శుక్రవారం మహిళలు గ్రామ నడిబొడ్డున బిందేలతో చేరి ఆ బిందేలకు కుంకుమ, పసుపు బొట్లు పెట్టి బిందేకు అలంకరణ చేసి వేపాకులతో దండను కట్టి, తోరణంగా చుట్టి వానలు పడటం లేదని వానదేవుని కోసం బిందేలనిండుగా నీరు నింపి బతుకమ్మ ఆడారు. అనంతరం గ్రామ దేవతలకు బిందెలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మూసాపేట్ సర్కిల్


- అధికారుల కళ్ళకు కాసుల గంతలు
- 300 గజాలో 6నుంచి 7 ఫ్లోర్ల నిర్మాణం
- సర్కిల్లో కనిపించని నిబంధనలు
- అదనపు అంతస్తుకి రూ.2 లక్షల నుంచి 4లక్షలు వసూలు
- బైట వ్యక్తులతో వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్న అధికారులు

**ప్రభుత్వ నియమ నిబంధనలు మూసాపేట్ సర్కిల్ అక్రమ నిర్మాణ దారులకు వర్తించవనే తీరుగా వ్యవహరిస్తున్నారు. సర్కిల్ పరిధిలో అధికారులు ఉన్నారో లేరో తెలియని అగమ్య గోచర పరిస్థితి. మూసా పేట్ సర్కిల్ పరిధిలో 50కు పైగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా.. వాటిపై చర్యలు మాత్రం శూన్యమనే చెప్పాలి. ఫిర్యాదులు వస్తే తప్ప సైట్ విజిట్ చేయని టౌన్‌ప్లానింగ్ అధికారులు. కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్లో ఇదే స్థితి.**



**విశ్వంభర, కూకట్‌పల్లి :** గత కొన్ని సంవత్సరాలుగా ఓ ఉన్నత అధికారి మూసాపేట్ సర్కిల్‌ని కంచుకోటగా మార్చుకుని వసూళ్లే లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. ప్రధానంగా ఉన్నతాధికారి కనుసైగల్లోనే ఇలాంటి వ్యవహారాలునడుస్తున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల కైతలాపూర్‌లోని సెల్లార్‌తో కలిపి 7 ఫ్లోర్లు నిర్మించిన నిర్మాణ దారుడి బిల్డింగ్‌కి తూతూ మంత్రంగా రెండు రంధ్రాలు పెట్టి వెళ్లిపోయారు. రెండు రోజులు పూర్తి కాకపోయినా సదరునిర్మాణదారుడు ఆ బొక్కలను పూడ్చి మళ్ళీ స్లాబ్ నిర్మించాడు. ఇలాంటివి చేస్తుంటే అధికారుల వైఫల్యం నిజమనేలా కనిపిస్తున్నాయి. నిర్మాణాలు చేస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాల్సింది పోయి వారికి ఉచిత సలహాలు ఇస్తూ.. వారి దగ్గర నుంచి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. ఏళ్ళుగా వందల భవన నిర్మాణాల నుంచి వసూలు చేసిన సొమ్ముతో కోట్లకు పడగలెత్తాడని, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భారీ పెట్టు బడులు పెట్టారని బహిర్గతంగా చెబుతున్న సత్యం. అతని చేతి కింద పని చేస్తున్న టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి ఈ తతంగమంతా నడుపుతున్నట్లు భవన నిర్మాణ దారుల బాహాటంగా చెబుతున్నారు.

కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకు మామూలు ముట్టకపోతే సదరు నిర్మాణాల వద్దకు డిమాలుషన్ టీంను తీసుకువెళ్లి హడావిడి చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. నిర్మాణ దారుల వద్ద డబ్బు తీసుకొని టౌన్ ప్లానింగ్ విభాగానికి అధిక మొత్తంలో గండికొడుతూ తన సొంత గూడు నింపుకుంటున్నారు. ఎవరన్నా ఫిర్యాదు చేస్తే యాక్షన్ తీసుకోవాల్సింది పోయి వారికి ఉచిత సలహాలు ఇస్తున్నారు. మామూలు ముట్టిన అక్రమ నిర్మాణంపై ఫిర్యాదులు వస్తే చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. కచ్చితంగా కూల్చివేయాలని పైఅధికారుల నుంచి ఒత్తిడి ఉన్నా.. కోర్టు నుంచి నోటీసులు వచ్చినా.. వాటిని కూడా స్లాబ్‌కు రెండు రంధ్రాలు పెట్టి వాటి ఫోటోలను సబ్మిట్ చేస్తూ.. పబ్బం గడుపుతున్నారు. అక్రమ నిర్మాణాదారులు రెంట్లకు అలవాటు పడి ఎవరికి ఇష్టం వచ్చినట్టు వాళ్ళు ఐదు నుంచి ఏడు అంతస్తుల వరకు నిర్మిస్తున్నారు. అధికారులు మాత్రం పట్టి పట్టనట్లు వ్యవహరించడం చూస్తే వీరి ప్రమేయం ఏ మేరకు ఉందో అర్థం అవుతుంది. టౌన్ ప్లానింగ్ విభాగంపై ప్రత్యేక నిగా ఉంచి, జీహెచ్ఎంసీలో ఇష్ట రీతిగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, స్థానికులు కోరుతున్నారు.



# కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరిన బీజేవైఎం కార్యకర్తలు అరెస్ట్





**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శుక్రవారం బీజేవైఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న మండల బీజేవైఎం నాయకులని అక్రమంగా అరెస్టు చేశారు. మండల బీజేవైఎం అధ్యక్షులు పైళ్ళ ప్రశాంత్ మాట్లాడుతూ.. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించని, ఈ చాతగాని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి 7 నెలలు పూర్తవుతున్నా.. 100 రోజులలోనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని ఎన్నికల మానిఫెస్టోలో పెట్టిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను ఇలా హింసించడం చాలా బాధాకరమని బీజేవైఎం నాయకులు మండిపడ్డారు. ఈ చేతగాని ప్రభుత్వం కొనసాగడానికి అర్హత లేదని, ఈ ప్రభుత్వం మీద కొట్లాడడానికి బీజేవైఎం నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు. అరెస్ట్ అయిన వారిలో బీజేవైఎం మండల నాయకులు ప్లకార్డులను పట్టుకుని పోలీస్ స్టేషన్లో నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండలం ప్రధాన కార్యదర్శి లోడి మహేష్ గౌడ్, మండల అధికార ప్రతినిధి సూర్య ప్రకాష్, సోషల్ మీడియా కన్వీనర్ బండారి సాయికుమార్, సెక్రెటరీ వనం మధు ఉన్నారు.

# సమయపాలన పాటించని మద్యం షాప్‌లు

### వైన్స్ బందైన సరే మద్యం బాబులకు అడ్డాగా పర్మిట్ రూం
### పర్మిట్ రూంకి తెల్లవారే దాక పర్మిషన్లు ఉన్నాయా.. ?

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీలో గురువారం రాత్రి 10: 25 నిమిషాలు అయినా కూడా (శ్రీ దుర్గా) వైన్స్ బంద్ చేసిన తరువాత కూడా దర్జాగా పర్మిట్ రూంలో సిట్టింగ్ పెడుతూ మందు బాబులకు మద్యం సేవించడానికి ప్రోత్సహిస్తున్నారు. నిజానికి వైన్స్ బంద్ చేయగానే పర్మిట్ రూం కూడా బంద్ చేయాల్సి ఉండగా.. శ్రీ దుర్గా వైన్స్ నిర్వాహకులు మాత్రం ఎవరికీ చెప్పిన ఏం కాదు మమల్ని ఏ అదికారులు ఏం చేయలేరు అనుకుంటున్నారు ఏమో ఇలా సమయం పాలన లేకుండా మద్యం అమ్మకాలకు ప్రోత్సహిస్తున్నారు. లేదా వైన్స్ కి రాత్రి 10 గంటల వరకు పర్మిట్ రూంలకు తెల్లవారే దాక పర్మిషన్లు ఉన్నాయా అంటూ పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి, అధి అలా ఉండగా వైన్స్ రాయిగిరి మోత్కూర్ ప్రధాన రహదారిపై ఉండడంతో అతిగా మద్యం సేవించిన తర్వాత వారు రోడ్డుపై రాత్రి పూట వాహనాలపై వెళ్లేటపుడు ప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవరు అని పలువురు ప్రశ్నిస్తున్నారు.




ఇకనైనా సమయపాలన పాటిస్తూ వైన్స్ బంద్ చేయగానే పర్మిట్ రూం కూడా బంద్ చెసే విధంగా అబ్కారీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంగిస్తున్న వైన్స్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



# అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్

**విశ్వంభర, కూకట్‌పల్లి :** ఆల్విన్ కాలనీ డివిజన్, ఎల్లమ్మబండ పరిధిలోని కమలమ్మ కాలనీలో గతంలో నిధులు మంజూరై పెండింగ్ వర్క్స్ జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే భవిష్యత్తులో ఎలాంటి సమస్య తలెత్తకుండా డ్రైనేజీ నిర్మాణ పనులను పక్కప్రణాళికతో పూర్తి చేయాలని అన్నారు. నిర్మాణ పనులను దగ్గరుండి పర్యవేక్షించాలని కాలనీవాసులకు సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, పాండుగౌడ్, షౌకత్ అలీ మున్నా, సయ్యద్, అగ్రవాసు, వాలి నాగేశ్వరరావు, రాజుగౌడ్, బాలస్వామి సాగర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.




షాద్‌నగర్, చటాన్ పల్లి రైల్వే గేట్ మరమ్మతుల కారణంగా గేటును తాత్కాలికంగా మూసివేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఆ రహదారి వైపు వెళ్లే ప్రయాణికులు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవాలని తెలిపారు. మరో రెండు రోజుల వరకు పనులు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

– విశ్వంభర, షాద్‌నగర్

# పర్యాటక రంగ అధ్యయనానికి కదిలిన ప్రభుత్వ బృందం

- ఉమామహేశ్వర ఆలయం, సయ్యద్ నిరంజన్ షా వలి దర్గాలను దర్శించుకున్న మంత్రులు ఎమ్మెల్యేలు



**విశ్వంభర, ఆమనగల్లు :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పర్యాటక కేంద్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అధ్యయన బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం పాలమూరు జిల్లాలోని ఆయా దేవాలయాలు, దర్గాలు ఇతర పర్యాటక స్థలాలను మంత్రులు ఎమ్మెల్యేలు కలిసి దర్శించుకుంటున్నారు. ఉమామహేశ్వర స్వామి, అచ్చంపేటలోనీ రంగాపూర్ హజ్రత్ సయ్యద్ నిరంజన్ షావలి దర్గాను రాష్ట్ర మంత్రులు మరియు ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహా, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్ తదితరులు అచ్చంపేట నియోజకవర్గంలోని రంగాపురం ఉమామహేశ్వర స్వామి వారిని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య , ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మరియు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రులకు, ఎమ్మెల్యేలకు ఆలయ అధికారులు, పండితులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులు ఆశీర్వదించి.. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, వంశీకృష్ణ, వాకిటి శ్రీహరి, డా. రాజేష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, స్థానిక ఎంపీపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, పురావస్తు శాఖ డైరెక్టర్ భారతి హోళికేరి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇల త్రిపాఠి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్, డీఎఫ్ఓ రోహిత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## గోవర్ధన్ రెడ్డికి నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, పరిగి :** కొడంగల్ నియోజకవర్గం పోతిరెడ్డిపల్లిలో మున్సిపల్ కౌన్సిలర్ (ఫ్లోర్ లీడర్) కి నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు పరిగి ఎంఎల్ఏ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి. హైదరాబాదు బేగంపేట్ విమానాశ్రయం నుంచి నేరుగా కొస్గి కి హెలికాప్టర్‌లో వచ్చి పోతిరెడ్డిపల్లిలో కోస్గి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల గోవర్ధన్ రెడ్డి భౌతికాయానికి నివాళులు అర్పించి గోవర్ధన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు. వీరితో పాటు గుర్నాథ్ రెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

## బీజేవైఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



**విశ్వంభర, ఆమనగల్లు :** నిరుద్యోగ సమస్యలు వెంటనే పరిష్కరించాలి బీజేవైఎం నాయకులు రంగారెడ్డి కలెక్టరేట్ ముట్టడి చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు యాదిష్ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాకు సంబంధం లేని ఉపాధ్యాయులను బదిలీల పేరుతో డీఈవో అధికారం ఉపయోగించి డబ్బులు లంచాలుగా తీసుకొని రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేసి ఇక్కడి వారికీ అన్యాయం జరిగిందన్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని సస్పెండ్ చేయాలని అన్నారు. గ్రూప్ వన్ ప్రిలిమ్స్ లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలి. గ్రూప్ 2 గ్రూప్ 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలి. 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలి. ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను పోస్ట్ పోన్ చేసి నూతన తేదీలను ప్రకటించాలి. అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థుల కి 33% రిజర్వేషన్ ను కేటాయించాలిజాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహా రెడ్డి, నీలకంఠ పాండు, భగీరథ, జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ గౌడ్, పోతుగంటి మహేష్, మధు, ధనుష్, కిరణ్, రాజేందర్, కార్తీక్, రాజ్ కుమార్, రాష్ట్ర, జిల్లా, తాలూకా, మండల బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి, ఐ.టీ.శాఖ మంత్రికి

## బ్రాహ్మణ స్త్రీ శక్తి సభ్యుల పోస్ట్ కార్డ్స్ వినతి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** పెండింగ్‌లో ఉన్న విదేశీ విద్యా రుణాలను వెంటనే విడుదల చేయాలని టీబీఎస్ఎస్ఎస్ ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు, స్త్రీ శక్తి వ్యవస్థాపక అధ్యక్షురాలు తాడికొండ అనురాధ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ బ్రాహ్మణ స్త్రీ శక్తి సభ్యులు సమావేశమై బ్రాహ్మణ సమాజ సంక్షేమం గురించి చర్చించి, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వివిధ పథకాల గురించి చర్చించారు. ప్రధానంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న విదేశీ విద్యా రుణాల గురించి చర్చించారు. ఉన్నత చదువుల కోసం వెళ్లిన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పోస్ట్ కార్డ్ ఆందోళనను ముందుకు తీసుకెళ్తున్నారు. అల్కాపురి నందు స్త్రీ శక్తి సభ్యులు పోస్ట్ కార్డ్‌ల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఐ.టీ. శాఖ మంత్రి శ్రీధర్ బాబుకి పరిషత్‌కు నిధులు కేటాయించాలని పోస్ట్ కార్డ్స్ వినతి చేశారు. ఈ కార్యకమంలో స్త్రీ శక్తి సభ్యులు వి.రాజేశ్వరి, ప్రత్యూష హరి, జె.శ్రీలక్ష్మి, కె.సీతా కుమారి, డి.అరుణ, ఎం.సత్యవతి, జె.కళ్యాణి ఎన్.రాధిక, కె.రాజలక్ష్మి, సి.శిరీష, ఎ.మాధవాయి, వి.శ్రీలత, ఎ.సారిక, శ్రావణి, రుక్మిణి పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతీఒక్కరి బాధ్యత

### మున్సిపల్ చైర్మన్ అశోక్

**విశ్వంభర, పరిగి :** మున్సిపాలిటీ పరిధిలోని 3వార్డులో శుక్రవారం ప్రజలకు డెంగ్యూ వ్యాధిపై మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ అశోక్, వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని తెలిపారు. ఇంటి పరిసరాల ప్రాంతంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి ఇంటి పరిసరాలలో నీరు నిలువలు ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైతే నీరు నిలుస్తుందో ఆ ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ స్ప్రే ద్వారా నియంత్రణకు కృషి చేయాలన్నారు. సీజన్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కిరణ్, వైద్య సిబ్బంది రఘు, పురపాలక సిబ్బంది ఆగయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.





## ఘనంగా దయాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**విశ్వంభర, ఎల్బీనగర్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పారేపల్లి దయాకర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆర్కేపురం డివిజన్‌కి చెందిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ మైనార్టీ నాయకులు ఎస్కే మహమ్మద్ ఆధ్వర్యంలో కేకు కట్ చేయించి పుష్ప గుచ్చం అందచేసి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సొంత తండ్రిపై కొడుకుల దాడి

**విశ్వంభర, ఆమనగల్లు :** కడ్తాల్ మండలం రావిచెడు గ్రామంలో సొంత తండ్రిపై కొడుకులు దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. రావిచెడు గ్రామానికి చెందిన మెండే వెంకటయ్య తండ్రి కిష్టయ్య వయసు (65) సంవత్సరాలు అనున తనకి ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు సంతానం కలరు అందరికీ వివాహం జరిగింది. అతనికి నాలుగు ఎకరాల పొలం కలదుదు మూడు ఎకరాల పొలం కుమారులకు ఎకర పొలాన్ని ఇద్దరు కుమార్తెలకు 20 గుంటలు 20 గుంటలు సమానంగా రిజిస్ట్రేషన్ చేశారు దానితో కుమారులు ఇద్దరు రమేష్, నరసింహలు ఎందుకు కుమార్తెలకు పొలం రిజిస్ట్రేషన్ చేశావని పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టారు. అయినా వినకుండా ఇద్దరు కుమారులు తండ్రిపై కక్ష్య పెంచుకొని గత నెల 20వ తేదీన తండ్రి వెంకటయ్యను పారతో ఇద్దరు కలిసి చేతులను కాళ్ళను విరగొట్టి బలంగా గాయపరిచారు. వెంకటయ్య కూతురు మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్సై వరప్రసాద్ నరసింహ, రామేశ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం



**విశ్వంభర, ఆమనగల్లు :** తలకొండపల్లి మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ మరియు ఎంపీపీ తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్ కి ఐదు సంవత్సరాల పదవి కాలం పూర్తయిన సందర్భంగా మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో.. ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షులు బత్తుల బాల కుమార్ గౌడ్, తిరుమణి విష్ణు గౌడ్, అశోక్ గౌడ్, గణేష్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, సురేష్ గౌడ్, ప్రదీప్ గౌడ్, శ్రీశైలం గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కుమార్ గౌడ్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు అరెస్టు ఏడుగురు బైండోవర్

**విశ్వంభర, ఆమనగల్లు :** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, ఆమనగల్ పరిధిలోని 4 మండలాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా విశ్వసనీయ సమాచారం మేరకు చరకొండ నుంచి ఇర్విన్ వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తుండగా.. 2 వాహనాల్లో నాటు సారాయి తరలిస్తున్న మాడుగుల మండలం సండల గడ్డ తండా కు చెందిన సభావత్ దేవుల (60) తండ్రి పుల్లయ్య అప్పరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గుండాల రాములు (68) తండ్రి బుచ్చయ్య అనే ఇద్దరిని అరెస్టు చేసి వాహనాలను సీజ్ చేశామని అదేవిధంగా 6 లీటర్ల నాటు సారాయిని సీజ్ చేసి నాలుగు మండలాలకు చెందిన 7 మందిని ఆయా మండలాల తహసిల్దారు కార్యాలయల్లో బైండ్ ఓవర్ చేయడం జరిగిందని ఆమనగల్ ఎక్సైజ్ సీఐ సీఐ బైద్యనాథ్ చౌహాన్ తెలిపారు.



## సమస్యలు త్వరలోనే పరిష్కారం చేస్తా



### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**విశంభర, ఎల్బీనగర్ :** సరూర్ నగర్ డివిజన్‌లోని శంకర్ నగర్ బస్తీలోనీ సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు పట్లోళ్ల సబితా ఇంద్రా రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్లో స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ముఖ్యంగా కాలనీ పక్కన వున్న గ్రేవ్ యార్డ్‌లో కొంతమంది ఆకతాయిలు కూర్చొని గంజాయి డ్రగ్స్‌కు బానిసలు అయ్యి కాలనీవాసులకు ఇబ్బంది కలిగిస్తున్నారని కాలనీ వాసులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి తెలియజేశారు. కాలనీలో రోడ్స్, కరంట్ స్తంబాలు, మహిళా భవనం, ముఖ్యంగా తాగు నీటి సమస్య వున్నదని ఎమ్మెల్యేకు తెలిపారు. సమస్యలను తొందరలోనే పరిష్కరిస్తానని సబిత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ 5 డిప్యూటీ కమిషనర్ సుజాత, శానిటేషన్ ఇంచార్జ్ నీలిమ, మహేశ్వరం నియోజకవర్గ మాజీ యూత్ వింగ్ అధ్యక్షులు లోకసాని కొండల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ధర్పల్లి అశోక్, డివిజన్ మాజీ అధ్యక్షులు ఇంటూరి అంకి రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షులు ఆకుల అరవింద్ కుమార్, కేశవ రెడ్డి, కాలనీ వాసులు సాలమ్మ, బాల్ రాజ్ గౌడ్, రమేష్ గౌడ్, కిషోర్, శ్యామల, శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, ప్రత్యుష్, రాజు, సునీల్ యాదవ్, పోలె అరవింద్, కట్ట ప్రవీణ్, రిషి తదితరులు పాల్గొన్నారు .

## ఎంపీ డీకే అరుణకు ఘన సన్మానం




**విశ్వంభర, షాద్‌నగర్ :** శుక్రవారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందే బాబయ్య, విష్ణు వర్ధన్ రెడ్డి, రాజు పాల్గొన్నారు. సమావేశం అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన డీకే అరుణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేపల్లి అశోక్ గౌడ్, నర్సింహా గౌడ్, భూపాలా చారి, మల్చలం మురళి, హరీ భూషణ్, వెంకటేష్ యాదవ్, చెన్నయ్య, బోయ కుర్మయ్య, కొమరబండ శ్రీశైలం, మంగలి రమేష్, నాగరాజు చారి, రఘురామ్ గౌడ్, లష్కర నాయక్, మోహన్ సింగ్, లక్ష్మీకాంత్ రెడ్డి, ఆకుల ప్రదీప్, సుధాకరప్ప తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

### బీజెవైయం జిల్లానాయకులు పేర్ల గణేష్



**విశ్వంభర, చండూరు/ పూడూరు :** ఉద్యోగాల పేరుతో అధికారంలోకి వచ్చి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతూ నిరుద్యోగులు తలపెట్టిన టీజీపీఎస్సీ భవన్ ముందు శాంతియుతంగా ధర్నాకు పిలుపునిస్తే ధర్నాను భగ్నం చేయాలి అని బీజేవైఎం నాయకులను ముందస్తు అరెస్టు చేయడం జరిగింది. దీని ఉద్దేశించి బీజేవైఎం జిల్లా నాయకులు పేర్ల గణేష్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలనీ డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేద్దామంటే రెండు రోజుల నుంచి పోలీసు స్టేషన్ లో ముందస్తు అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రతిపక్ష నాయకులను అరెస్టులు చేసే దృష్టి, ఉద్యోగ నోటిఫికేషన్ మీద పెట్టాలని ప్రభుత్వంపై దుయ్యబట్టారు. గత ప్రభుత్వం చేసిన తప్పే ఈ ప్రభుత్వం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోకపోవడం, గ్రూప్ 2,3 పోస్టులు పెంచాలని డిసెంబర్లో పరీక్షలు పెట్టాలనీ డీఎస్సీ పరీక్షను మూడు నెలలు వాయిదా వేసి 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని అన్నారు. పోలీస్ కానిస్టేబుల్ నియామకాలు అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీవో నెంబర్ 46ను వెంటనే రద్దు



చేయాలి అని డిమాండ్ చేశారు.లేనిచో రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి శివ, భూతరాజు స్వామి, బోడ శివ , రావిరాల మారుతి, దోటి నవీన్ తదితరులు ఉన్నారు.

### పూడూరు మండల బీజేపీ నాయకుల అరెస్టు

కలెక్టర్ కార్యాలయం ముట్టడికి బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు నివ్వడంతో శుక్రవారం ముందస్తుగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూడూరు మండలానికి చెందిన జిల్లా బిజెపి అధికార ప్రతినిధి రవీందర్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు, బీజేవైఎం అసెంబ్లీ కో కన్వీనర్ మనోహర్ లను చన్గోముల్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. రవీందర్ మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలన్నారు. మెగా డీఎస్సీ వేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రభుత్వంపై నిరంతరం పోరాటం కొనసాగిస్తుందన్నారు.

# కోఠిలో ప్రభుత్వ వైద్యుడిపై దాడి

**డీఎంఈ కార్యాలయం ముందే ఇతర డాక్టర్ల దాడి**

**బదిలీలను అడ్డుకుంటున్నారని ఆరోపించిన బాధిత డాక్టర్**

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ కోఠిలోని డీఎంఈ కార్యాలయం వద్ద ప్రభుత్వ వైద్యుడిపై తోటి డాక్టర్లు దాడికి దిగారు. దీంతో డీఎంఈ కార్యాలయం ఎదుటే బాధిత డాక్టర్ శేఖర్ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. సాధారణ బదిలీలను అడ్డుకునేందుకు పలువురు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ముసుగులో ఎన్నో ఏళ్లుగా హైదరాబాద్ సిటీలోనే తిష్ట వేశారని.. వాటిని ప్రశ్నించినందుకే తనపై దాడి చేశారని తెలిపారు. సాధారణ బదిలీలపై ప్రభుత్వం ఇచ్చిన జీవో మేరకు అమలు చేయాలని డీఎంఈకు వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చానని బాధిత డాక్టర్ శేఖర్ తెలిపారు. ఈ జీవో అమలు చేస్తే 40 శాతం మేర హైదరాబాద్ సిటీలో పని చేస్తున్న వైద్యులు జిల్లాలకు, జిల్లాలలో పని చేస్తున్న వైద్యులు హైదరాబాద్‌కు రావాల్సి ఉంటుందని చెప్పారు. అయితే ఈ బదిలీలను అడ్డుకునేందుకు పల్లం ప్రవీణ్ కుమార్, బొంగు రమేశ్, రాథోడ్ , వినోద్ కుమార్ లు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. డీఎంఈకి వినతి పత్రం ఇవ్వకుండా తనను అడ్డుకుని దాడి చేశారని డాక్టర్ శేఖర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ముసుగులో వీరు ఎన్నో ఏళ్లుగా హైదరాబాద్ సిటీలోనే తిష్ట వేశారని ఆరోపించారు. వాటిపై ప్రశ్నించినందుకు తనపై దాడి చేశారన్నారు. దాడికి పాల్పడిన నలుగురు వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు దాడి చేసిన నలుగురు వైద్యులపై సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# శాసన మండలి మనుగడకు ప్రమాదం

**మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్**



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ శాసన మండలి మనుగడకు ప్రమాదం ఏర్పడిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యలయం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. శాసన మండలి పూర్తిగా రద్దు అయ్యే ప్రమాదం ఉందని, ఆర్టికల్ 169,170,171 ప్రకారం శాసన మండలిలో సీట్లు 40కంటే తక్కువ ఉండకూడదు, శాసన సభ సీట్లలో 1/3 వంతు కౌన్సిల్ సభ్యులు ఉండాలని కానీ ప్రస్తుతం శాసన మండలి ఉనికి ప్రమాదంలో పడిందన్నారు. ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యేను తొలగించడం వల్ల అసెంబ్లీలో సభ్యుల సంఖ్య 119కి తగ్గిందని, ఇప్పుడు రాజ్యాంగ నిబంధనల ప్రకారం 1/3 అంటే కౌన్సిల్ సంఖ్య 39కి పడిపోయిందన్నారు. దీంతో తెలంగాణ కౌన్సిల్ మనుగడ ప్రమాదంలో పడిందని, తెలంగాణ శాసన మండలి కొనసాగాలి అంటే అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరగాలన్నారు. చంద్రబాబు ప్రస్తుతం కేంద్రంలో కీలకంగా ఉన్నారు కాబట్టి తెలుగు రాష్ట్రల సీఎంలు కలిసి అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపునకు కృషి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ ఆస్తుల విషయంలో సీఎం రేవంత్ కాంప్రమైజ్ కావద్దని కోరారు. శాసన సభ సీట్లను పెంచాలని ఏపీ పునర్విభజన చట్టం సెక్షన్ 26లో స్పష్టంగా ఉంది, దీనికోసం తాము మోడీని, లా మినిస్టర్‌ను కలిసి చాలాసార్లు కోరినట్లు పేర్కొన్నారు. కానీ మోడీ విషయాన్ని దాట వేశారని, అదే మోడీ కాశ్మీర్ లో సీట్లను పెంచుకున్నట్లు తెలిపారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సమాచార హక్కు వికాసమితి సూర్యాపేట జిల్లా కమిటీ



**విశ్వంభర, చివ్వెంల :** శుక్రవారం సూర్యాపేట కలెక్టర్‌గా బాధ్యతలను చేపట్టిన తేజస్ నందలాల్ పవర్‌ని సమాచార హక్కు వికాసమితి సూర్యాపేట జిల్లా సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రైవేట్ విద్యాసంస్థలు సామాన్యుడిపై మోపిన భారాన్ని అధిక ఫీజులను తగ్గించాలని సమాచార హక్కు వికాసమితి సూర్యాపేట జిల్లా గౌరవ అధ్యక్షులు ఉన్నం సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు గుంతకండ్ల ముకుంద రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చేకూరు శివ, నియోజకవర్గ అధ్యక్షులు దండా వెంకటరెడ్డి, సూర్యాపేట పట్టణ అధ్యక్షులు బంగారు శ్రీధర్, పూలమ్మ, విమల గౌడ్, గోవిందరెడ్డి కలెక్టర్‌ని కోరారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

**విశ్వంభర, డిండి :** మండల పరిధిలోని నవాయు సంస్థ వ్యవస్థాపకులు మునగపాటి వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల ప్రతాప్ నగర్ విద్యార్థులకి శుక్రవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పవన్ మాట్లాడుతూ.. పేద విద్యార్థుల కు వారు చేస్తున్న సేవలని కొనియాడుతూ వారికి పాఠశాల పక్షాన అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరబాబు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## జెడిమెట్లలో మహా అన్నదానం



**విశ్వంభర, జెడిమెట్ల :** అమావాస్యను పురస్కరించుకొని వాసవి సేవాదళ్ సుచిత్ర, కొంపల్లి ఆధ్వర్యంలో శుక్రవారం జెడిమెట్ల దుర్గా దేవి గుడి దగ్గర మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భరత్ సింహారెడ్డి, జీహెచ్ఎంసీ కార్పొరేటర్ హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తోట భిక్షపతి, పళ్ళ నాగరాజు, పడకంటి వెంకటేశం, ఉప్పల నాగరాజు, మాశెట్టి శివ, ఉప్పల రమేశ్, రాము, తాటిపాముల రమేశ్, మురళికృష్ణ, మాశెట్టి కిష్టయ్య, ఉప్పల నరేందర్, సేగేశ్వర్ రావు, సీహెచ్ శ్రీనివాస్, గోలి నరేష్, దుర్గయ్య, వినయ్, ప్రణీత్ గుప్తా, శేఖర్, సిల్వర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించిన ఆరెకటిక సంఘం నాయకులు



**విశ్వంభర, షాద్‌నగర్ :** పట్టణ మున్సిపాలిటీలో చికెన్ వ్యర్థాల టెండర్ ప్రక్రియపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి తోడుగా ఆరెకటిక సంఘం నాయకులు మెహందీ కార్ శంకర్, ప్రకాష్, చందు, చిన్నజీ తదితరులు మున్సిపల్ కమిషనర్ వెంకన్నను కార్యాలయంలోకి వెళ్తుండగా వారు ప్రశ్నించారు. పత్రికా ద్వారా టెండర్ పిలిచామని కమిషనర్ వెంకన్న చెప్పగా ఏ పత్రికలో ఇచ్చారు? ఎప్పుడు ఇచ్చారు? అసలు ఆ పత్రిక సర్కులేషన్లో ఉందా? అని స్థానిక ఆరెకటిక సంఘం నాయకులు ప్రశ్నించారు. తాము ఐ అండ్ పి ఆర్ కు పంపించామని వాళ్లు ఏదైనా పత్రికకు ఇస్తారని చెప్పారు. ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, సూర్య , వార్త ఇంకా తదితర పత్రికలు ఉన్నాయని వాటిని వదిలేసి ఇతర పత్రికలకు సర్కులేషన్ లేని పత్రికలకు ప్రకటన ఇస్తే ఎవరు చూడాలని ఆరెకటిక సంఘం అధ్యక్షుడు మెహేంది కార్ శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులకే టెండర్ ఇవ్వండి మాంసం వ్యాపారంపై తమ కులవృత్తి జీవనాధారం సాగిస్తుందని తమకు కాకుండా ఎక్కడో గద్వాల ప్రాంతానికి చెందిన వారికి ఈ టెండర్ ఎలా ఇస్తారని ఆరెకటిక సంఘం అధ్యక్షులు శంకర్ ప్రశ్నించారు.

## ఘనంగా కొత్తూరు మాజీ సర్పంచ్ సుదర్శన్ గౌడ్ జన్మదిన వేడుకలు



**విశ్వంభర, కొత్తూర్ :** కొత్తూర్ మాజీ సర్పంచ్ జండగూడెం సుదర్శన్ గౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొత్తూర్ మున్సిపాలిటీ బంక్యాట్ హాల్‌లో అభిమానులు నిర్వహించిన జన్మదిన వేడుకలకు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌల్లపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుంధర్‌రెడ్డి ముఖ్య అతిథుగా హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చౌల్లపల్లి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. సుదర్శన్ గౌడ్ రాజకీయంగా మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకోవలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంచనపల్లి శివ శంకర్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, రాంరెడ్డి, శేఖర్ రెడ్డి, కుమారస్వామి గౌడ్, హరినాథ్‌రెడ్డి

## పవర్ లిఫ్టింగ్‌లో భీమారం బాలుర్లు రాష్ట్ర స్థాయిలో ఎంపిక



**విశ్వంభర, వరంగల్ :** ఈనెల 6 ,7న ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు వరంగల్ జిల్లా నుంచి భీమారం నేషనల్ జింకు చెందిన 9 మంది పవర్ లిఫ్టర్స్ ఎంపికయ్యారు. బాలికలో 55 కేజీల విభాగంలో పీ వైష్ణవి, బాలుర విభాగంలో సంఘాల బన్నీ59 కేజీల విభాగంలో, ఆర్ భరద్వాజ్ 57 కేటగిరి, కే లోకేష్ 58 కేటగిరిలో, టీ రఘు సాయి 58 కేటగిరిలో, జీ ధనుష్ రెడ్డి 73 కేటగిరిలో, గుగులోతు కిరణ్ 83 కేజీల విభాగంలో, సంఘాల సచిన్ 63 కేజీల విభాగంలో, సిద్ధ బోయిన ప్రణయ్105 కేజీల విభాగంలో జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు భీమరం నేషనల్ జింలో వరంగల్ జిల్లా సెక్రెటరీ, కోచ్ సంఘాల కమల్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్నారు. వీరు జిల్లాకు మంచి పేరు తేవాలని జిల్లా ప్రెసిడెంట్ నన్నబోయిన రమేష్ యాదవ్, 1 డివిజన్ అధ్యక్షుడు జిల్లా కాంగ్రెస్ నాయకులు దేవరకొండ అనిల్ కుమార్, ట్రెజరర్ పోతర బోయిన విజయ్, జిల్లా పవర్ లిఫ్టింగ్ సెక్రెటరీ సంగాల కమల్ పలువురు అభినందించారు.



## ట్రాన్స్‌జెండర్స్‌కు సమాన అవకాశాలను కల్పించాలి

**కలెక్టర్ సీ నారాయణ రెడ్డి**

**విశ్వంభర, నల్గొండ :** ట్రాన్స్ జెండర్స్‌కు స్వయం ఉపాధి శిక్షణ తరగతులు ముగించుకున్న సందర్భంగా శుక్రవారం కలెక్టర్ సీ నారాయణ రెడ్డి చేతుల మీదుగా 26 మంది వికలాంగులు మరియు ట్రాన్స్ జెండర్స్ కి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వయం ఉపాధి నైపుణ్య శిక్షణ అవకాశాలను పెంపొందించడం కోసం నేషనల్ ఇన్స్టిట్యూషన్ ఫర్ హాస్పిటల్ మేనేజ్మెంట్ హైదరాబాద్ వారి సహకారంతో తెలంగాణ ప్రభుత్వం సుమారుగా 10 లక్షల రూపాయలు వెచ్చించి వీరికి స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం కోసం వివిధ రంగాల్లో వారికి నైపుణ్యం ఇచ్చి ప్రోత్సహించినట్లు తెలిపారు. సమాజంలో లింగ వివక్షతను పోగొట్టడంలో భాగంగా వీరికి సమాన అవకాశాలను కల్పించడం వీరి యొక్క జీవనోపాదులు మెరుగుపరిచి మీరు కూడా సమాజంలో భాగమే అనే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ట్రాన్స్ జెండర్స్‌కి వికలాంగులకు మెరుగైన అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని సక్కుబాయి, అదనపు జిల్లా సంక్షేమ అధికారి వేణు, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి, ట్రాన్స్ జెండర్ నందిని, తనుశ్రీ, సితార పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరంపై జిల్లా పోలీసుల దాడులు

**6 లీటర్ల గుడుంబా పట్టివేత, 90 లీటర్ ల బెల్లం పానకం ధ్వంసం**



**విశ్వంభర, జగిత్యాల :** గుడుంబా రహిత జిల్లాగా జగిత్యాలను చూడాలనే ప్రధాన లక్ష్యంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐ పిఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ తండాలో గుడుంబా స్థావ రాలపై పోలీసులు మరియు ఎక్సైజ్ శాఖ వారితో సం యుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ యొక్క దాడిలో 6 లీటర్ల గుడుంబాను, 90 లీటర్ ల బెల్లం పానకం స్వాధీనం చేసుకొని గుడుంబా స్థావరాని ధ్వంసం చేశారు. ఈ సంద ర్భంగా ఎస్సై అనీల్ మాట్లాడుతూ.. ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారీ చేసినట్లయితే వారిని బైండోవర్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గుడుంబాకు అలవాటు పడి ఎంతోమంది కుటుంబాలను చిన్నబిన్నం చేసుకొని చివరకి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపా రు. అంతే కాకుండా మీ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఎవరైనా గుడుంబా తయారీ చేస్తునట్టు తెలిసినా.., అమ్మినా వెంటనే పోలీసు స్టేషన్‌కి సమాచారం అందించాలని కోరారు. వారి వివరాలు గొప్యంగా ఉంచడం జరుగుతుందని అన్నారు. ఈ యొక్క తనిఖీల్లో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వినోద్ రాథోడ్, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.



## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**చండూరు,విశ్వంభర :** ఉద్యోగాల పేరుతో అధికారంలోకి వచ్చి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతూ నిరుద్యోగులు తలపెట్టిన టీజీపీఎస్సీ భవన్ ముందు శాంతియుతంగా ధర్నాకు పిలుపునిస్తే ధర్నాను భగ్నం చేయాలి అని బీజేవైఎం నాయకులను ముందస్తు అరెస్టు చేయడం జరిగింది. దీని ఉద్దేశించి బీజేవైఎం జిల్లా నాయకులు పేర్ల గణేష్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలనీ డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేద్దామంటే రెండు రోజుల నుండి పోలీసు స్టేషన్ లో ముందస్తు అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రతిపక్ష నాయకులను అరెస్టులు చేసే దృష్టి ,ఉద్యోగ నోటిఫికేషన్ మీద పెట్టాలని ప్రభుత్వం పై దుయ్యబట్టారు . గత ప్రభుత్వం చేసిన తప్పే ఈ ప్రభుత్వం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోకపోవడం, గ్రూప్ 2,3 పోస్టులు పెంచాలని డిసెంబర్లో పరీక్షలు పెట్టాలనీ డీఎస్సీ పరీక్షను మూడు నెలలు వాయిదా వేసి 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలనీ అన్నారు.పోలీస్ కానిస్టేబుల్ నియామ కాలు అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీవో నెంబర్ 46ను వెంటనే రద్దు చేయాలి అని డిమాండ్ చేశారు.లేనిచో రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. అరెస్ట్ అయిన వారిలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి శివ, భూతరాజు స్వామి, బోడ శివ , రావిరాల

## విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన

**విశ్వంభర, కూకట్ పల్లి :** కూకట్ పల్లి సర్కిల్, ఆల్విన్ కాలనీ డివిజన్, ఎల్లమ్మబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వర్షాకాలంలో దోమల నివారణలో భాగంగా శుక్రవారం జీహెచ్ఎంసీ ఎంటమాలాజీ సూపర్వైజర్ డీ నరసింహులు ఆధ్వర్యంలో దోమ కాటు ద్వారా వ్యాపించే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలోని ఎక్కువ రోజులుగా నిలువ ఉన్న నీటిని తొలగించి దోమల బారిన పడద్దని సూచించారు. ఆంటీ లార్వల్ ఆపరేషన్ చేసే ఎంటమాలాజీ సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్స్, టీచర్స్ ఎంటమాలాజీ సిబ్బంది పాల్గొన్నారు.



## ఐఆర్ఎస్ అధికారి కళ్యాణ్ కుమార్ దాస్‌కు వీడ్కోలు

**విశ్వంభర, నల్గొండ :** పార్లమెంటు ఎన్నికలలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు నియమించిన 2012 ఐఆర్ఎస్ బ్యాచ్ అధికారి కళ్యాణ్ కుమార్ దాస్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోటీ చేసిన అభ్యర్థుల తుది లెక్కలను నిర్ధారించి ఎన్నికల సంఘానికి నివేదించారు. తుది లెక్కల నిర్ధారణ, నివేదికల సమర్పణ నిమిత్తం గత నెల 27న ఆయన జిల్లాకు వచ్చారు. గురువారం అభ్యర్థుల తుది లెక్కలను నిర్ధారించి కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించి శుక్రవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో కలెక్టర్ సీ నారాయణరెడ్డి ఆయనను శాలువా, మెమెంటోలతో సత్కరించి వీడ్కోలు పలికారు. పార్లమెంటు ఎన్నికల్లో వ్యయ పరిశీలకులుగా జిల్లాకు సేవలందించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్, ఎన్నికల విభాగం డిటి విజయ్, సహాయ ఎన్నికల అధికారి సురేష్ తదితరులు ఉన్నారు.



## ప్రభుత్వ హాస్టల్లోని విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలి

**కలెక్టర్ సీ నారాయణరెడ్డి**

**విశ్వంభర, నల్గొండ :** ప్రభుత్వ హాస్టల్లోని విద్యార్థులు బాగా చదువుకొని సమాజంలో ఉన్నత స్థానాలలో ఉండాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి ఆకాంక్షించారు. గురువారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ఆర్పి రోడ్డులో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి ఎదురుగా ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాస్టల్ వంటగదిని, భోజనాన్ని, టాయిలెట్లు, డైనింగ్ హాల్, విద్యార్థినుల బ్యారక్‌లు, బాత్రూంలు అన్నింటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినిలతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం హాస్టల్ ఆవరణలోనే విద్యార్థినిలతోపాటు కింద కూర్చుని వారితో మాట్లాడారు. హాస్టల్లో చదివే విద్యార్థినులు బాగా చదువుకోవాలని, ముఖ్యంగా తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తారని, విద్యార్థులు సైతం అదే రీతిన కష్టపడి చదివి సమాజంలో ఉన్నత స్థానం పొందాలన్నారు. రెండు సంవత్సరాలు కష్టపడి చదివితే జీవితంలో స్థిరపడవచ్చు అని చెప్తూ ఈ సందర్భంగా స్వామి వివేకానంద సూక్తిని విద్యార్థులకు బోధించారు. ప్రభుత్వం కల్పించిన అన్ని వసతులను, సౌకర్యాలను వినియోగించుకుని పైకి రావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ కోటేశ్వరరావు, హాస్టల్ వార్డెన్లు రమ్య సుధా, సోమేశ్వరి ఉన్నారు.

# కిడ్నీ మార్పిడి పేరుతో భారీ మోసం



**విశ్వంభర, విశాఖపట్నం :** విశాఖలో అవయవ మార్పిడి పేరుతో భారీ మోసం బయటపడింది. అనారోగ్యానికి గురైన తన భార్య కోసం ఆశ్రయించిన వ్యక్తిని నిండా ముంచారు. అడ్వాన్స్‌గా రూ.10లక్షలు తీసుకుని మోసగించినట్టు పోలీసులకు పిర్యాదు చేశాడు బాధితుడు. దీంతో మహిళ డాక్టర్ సహా ఆమె సహాయకుడిపై చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన విశాఖపట్నంలో వెలుగుచూసింది. విశాఖలో కిడ్నీ మార్పిడి పేరుతో భారీ మోసం వెలుగు చూడటంతో ప్రత్యేకంగా దృష్టి సారించారు పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి. డీసీపీ నేతృత్వంలో ఎనిమిది మందితో సిట్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందంలో డీసీపీ వన్ లక్ష్మీనారాయణ, ద్వారకా ఏసీపీ, సీఐ లతోపాటు ఇద్దరు ఎస్సైలు, మరో ఐదుగురు కానిస్టేబుల్ లో ఉన్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందం పని ప్రారంభించింది. పురుషోత్త పురం ప్రాంతానికి చెందిన గోపి భార్య శారద అనారోగ్యానికి గురైంది. మెడికల్ టెస్టులు చేయించారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో డయాలసిస్ కూడా చేయిస్తున్నారు. కిడ్నీ మార్పిడి చేయాల్సి రావడంతో.. కుటుంబ సభ్యులు ఎవరు ముందుకు రాలేదు. తన బ్లడ్ గ్రూప్ కూడా మ్యాచ్ కాకపోవడంతో, సీతమ్మధారలోని ఎన్నారై ఆసుపత్రి డాక్టర్ వాణిని సంప్రదించాడు గోపి. కిడ్నీ మార్పిడి చేయాలని అందుకు అనిల్ అనే ట్రాన్స్ ప్లాంట్ కోఆర్డినేటర్ తన సిబ్బందికి ఆ కేసును అప్పగించింది. కిడ్నీ ఆర్గాన్ డోనర్లు సిద్ధంగా ఉన్నారని, 27 లక్షల రూపాయల ఖర్చవుతుందని అందుకు అడ్వాన్స్‌గా పది లక్షల రూపాయలు చెల్లించాలని సూచించారు. దీంతో ఈ ఏడాది మార్చి మొదటి వారంలో ఐదు లక్షల రూపాయలు అనిల్‌కు ట్రాన్స్‌ఫర్ చేసినట్టు బాధితుడు గోపి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఏప్రిల్ లో మరో ఐదు లక్షల రూపాయలను దశల వారీగా తన స్నేహితుల ఖాతాల నుంచి ట్రాన్స్‌ఫర్ చేసినట్టు చెప్పుకొచ్చాడు. ఆ తర్వాత అనిల్ తోపాటు ఆసుపత్రి సిబ్బంది స్పందించకపోయేసరికి, 10 లక్షల రూపాయలు తిరిగి చెల్లించాలని కోరాడు గోపి. దీంతో వాళ్లు తనకు 10 లక్షల రూపాయలు ఇవ్వకపోగా బెదిరింపులకు దిగినట్టు ఫిర్యాదులు పేర్కొన్నాడు బాధితుడు. కిడ్నీ మార్పిడి పేరుతో మోసం వ్యవహారం వెలుగులోకి రావడంతో ఒకసారిగా విశాఖలో కలకలం రేగింది. పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా ఈ కేసుపై దృష్టి సారించారు. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని రంగంలోకి దింపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని ఆదేశించారు. ఇక ఘటనకు సంబంధించి మహిళ డాక్టర్ సహా ఆమె సహాయకుడిపై చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ చేపట్టారు.

# టీటీడీపీ పగ్గాలు ఎవరికి..?

- చంద్రబాబు చర్చలు
- ఓబీసీలవైపే మొగ్గు

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ టీడీపీ పగ్గాలు ఎవరికి అప్పగిస్తే బాగుంటుందని బాబు ఆరా తిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం టీ.టీడీపీ అధ్యక్ష పదవిపై ఆసక్తి నెలకొంది. ఏ సామాజికవర్గానికి ఇస్తారనే చర్చ పార్టీలో కొనసాగుతోంది. రాష్ట్రంలో అన్ని ప్రధాన పార్టీలు బీసీలకు పెద్దపీట వేయాలని భావిస్తున్న ఈ తరుణంలో ఇక్కడ టీడీపీ పగ్గాలు ఎవరికి ఇస్తారు అనేది ఉత్కంఠగా మారింది. అన్ని పార్టీలు అత్యధిక ఓటు శాతం ఉన్న బీసీలకు దగ్గర అయ్యేందుకు బీసీ నేతలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే మరో మూడు రోజుల్లో చంద్రబాబు నాయుడు తెలంగాణ టీడీపీ నేతలతో సమావేశం కానున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఒసిలకు పార్టీ బాధ్యతలు అప్పగించలేదు. మొన్నటివరకు ఆ పార్టీ అధ్యక్షుడుగా కొనసాగిన బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ బిఆర్ఎస్ లో చేరిన సంగతి తెలిసిందే. అయితే మరోసారి బీసీ నేతకే ఇస్తారా లేక ఓసి నేతకు ఇస్తారా అనేది ఇంట్రెస్టింగ్ గా మారింది.

### మూడు రోజుల్లో క్లారిటీ

తెలంగాణ తెలుగుదేశం పార్టీకి రాష్ట్ర సారథి ఎంపికపై మరో మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ముఖ్య నేతలతో సిఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఈనెల 7న హైదరాబాద్ లోని ఎన్టీఆర్ భవన్‌లో సమావేశం కానున్నారు. ఈ భేటీలో పార్టీ అధ్యక్షుపై పూర్తి స్థాయిలో క్లారిటీ వస్తుందని నేతలు చెబుతున్నారు. కాసాని జ్ఞానేశ్వర్ రాజీనా మాతో పార్టీకి అధ్యక్షుడు లేకపోవడంతో రాష్ట్రం లో పార్టీ కార్యక్రమాలు, పార్టీ ఉనికి స్తంభించి పోయింది. అయితే మళ్ళీ తెలంగాణ లో పార్టీ నిర్మాణంపై దృష్టి పెడతానని, పార్టీని బలోపేతం చేసి పూర్వవైభవం తీసుకొస్తానని బాబు అన్నా రు. గత తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతామని చెప్పడంతో తెలంగాణలో పార్టీ అధ్యక్ష పదవి కోసం ఆశవహులు ఎదురు చూస్తున్నారు.



### స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేలా ప్లాన్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో ఉండాలంటే రాష్ట్ర అధ్యక్ష పదవి అవసరం. కేడర్ కు దిశానిర్దేశం, నేతలను సమన్వయం చేయ డం, కార్యకర్తల్లో ఉత్సాహం నింపలంటే సమర్థవంతమైన నాయకుడు అవసరం. అందుకే పార్టీ అధినేత ఈ అంశంపై ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు సమాచారం. బలమైన సామాజిక వర్గానికి చెందిన నేతలు బాధ్యతలు అప్పగిస్తేనే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటే అవకాశం ఉంది.

### అధ్యక్ష పదవి ఆశిస్తున్న ఒసీలు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ రాజకీయాలను అంతగా పట్టించుకో లేదు. పూర్తిస్థాయి-ంలో అయన ఆంధ్రప్రదేశ్ రాజ కీయాల్లోనే నిమగ్నమయ్యారు. అయితే ఇక్కడ పార్టీ బాధ్యతలను బీసీ నేతలైన ఎల్ రమణ, కాసాని జ్ఞానేశ్వర్ కు అప్పగించారు. ఇక ఎస్సీ సామాజికవర్గానికి చెందిన భక్కని నర్సింహులు కు ఒకసా రి పార్టీ బాధ్యతలు అప్పగించారు. గడిచిన పదేళ్ళలో ము గ్గురు బడుగు, బలహీనవ ర్గాలకు చెందిన నేతలకే బాబు అవకాశం ఇచ్చారు. కాగా ఈసారి ఓసిలకు అవకాశం వస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ లో సీనియర్ నేత,పార్టీ ఉపాధ్యక్షుడు సామ భూపల్ రెడ్డి, నర్సిరెడ్డి, కత్ర గడ్డ ప్రసూనతో పాటు మరికొంత మంది లీదర్లు అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు సమా చారం. అయితే రాష్ట్రంలో బిఆర్ఎస్ పరిస్థితి పై కూడా చంద్రబాబు నాయుడు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

# కుమారీ ఆంటీని కలిసిన సోనూసూద్



**విశ్వంభర, హైదరాబాద్ :** కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు కుమారి ఆంటీ. హైదరాబాద్ లోని మాదాపూర్‌లో రోడ్డు పక్కన ఓ ఫుడ్ స్టాల్ నడుపుతున్న ఈమె సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. ఆమె చెప్పిన 'మీది మొత్తం రూ.1000 అయ్యింది. రెండు లివర్లు ఎక్స్‌ట్రా' అనే డైలాగ్ ఎంత ఫేమస్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అప్పటి నుంచి యూట్యూబర్లు, సినీ తారలు ఆమె ఫుడ్ స్టాల్ వద్దకు క్యూ కడుతున్నారు. తాజాగా కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్‌లో ప్రముఖ స్టార్ నటుడు సోనూసూద్ సందడి చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఐటీసీ కోహినూర్ పక్కన స్ట్రీట్ ఫుడ్ అమ్ముతున్న కుమారి ఆంటీ వద్దకు వెళ్లిన సోనూసూద్ అక్కడున్నవారందరినీ సర్ప్రైజ్ చేశారు. కుమారి ఆంటీని కలిసి శాలువాతో సత్కరించి బోకే ఇచ్చారు. అనంతరం ఆమెతో సరదాగా మాట్లాడారు. పంచ్‌లు వేస్తూ అక్కడున్న వారిని నవ్వించారు. ఫుడ్ సర్వ్ చేశారు. ఈ సందర్భంగా మహిళా సాధికారతకు కుమారీ ఆంటీ బెస్ట్ ఉదాహరణగా సోనూసూద్ అభివర్ణించారు.
భవిష్యత్తులో ఎలాంటి సాయం అవసరమైన చేస్తానని ఈ సందర్భం గా హామీ ఇచ్చారు. కుమారి ఆంటీని సోనూ సూద్ కలిసిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.

# ఆర్టీసీ బస్సులో మహిళ ప్రసవం

- ప్రసవం చేసిన ఆర్టీసీ కండక్టర్
- అభినందించిన మంత్రి పొన్నం

**విశ్వంభర, హైదరాబాద్ :** ఆర్టీసీ బస్సులో పురిటి నొప్పులతో అవస్థపడుతన్న గర్భిణీకి ప్రసవం చేసిన ఆర్టీసీ సిబ్బందిని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఆపదలో ఉన్న గర్భిణీకి సాయం చేసి ఆర్టీసి బస్సులో ప్రసవం చేసిన సిబ్బందికి, మహిళా ప్రయాణికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలిపారు. హైదరాబాద్ బహదూర్ పురలో టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణికి ప్రసవం చేసిన ముషీరాబాద్ డిపో కండక్టర్ సరోజ, మహిళా ప్రయాణికులను అభినందించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించడం వల్లే తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని అన్నారు. వారికి సరైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. సామాజిక సేవలో ఆర్టీసీ సిబ్బంది కూడా ముందు నిలవడం అభినందనీయం అన్నారు. ఈ ఘటనపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పందించారు. ముషీరాబాద్ డిపోకు చెందిన 1 జెడ్ రూట్ బస్సులో శుక్రవారం ఉదయం శ్వేతా రత్నం అనే గర్భిణీ ఆరాంఘర్ లో ఎక్కారు. బహదూర్ పూర వద్దకు రాగానే ఆమెకు పురిటి నొప్పులు తీవ్రమయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ ఆర్.సరోజ అప్రమత్తమై మహిళా ప్రయాణికుల సాయంతో సాధారణ ప్రసవం చేశారు. ఆమె పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సమీపంలోని గవర్నమెంట్ మెటర్నటీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లిబిడ్డా క్షేమంగా ఉన్నారు. బస్సులోనే కాన్పు చేసి మానవత్వం చాటుకున్న కండక్టర్ సరోజతో పాటు సహా మహిళా ప్రయాణికులను ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ ప్రశంసించారు. ఆర్టీసీ సిబ్బంది సకాలంలో స్పందించడం వల్లే తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు సేవా స్ఫూర్తిని ఆర్టీసీ సిబ్బంది చాటుతుండటం అభినందనీయం అన్నారు.





# ఎమ్మెల్సీలుగా ఏకగ్రీవ ఎన్నిక

### రామచంద్రయ్య, హరిప్రసాద్‌ల విజయం

**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ తరుపున, మాజీ మంత్రి రామచంద్రయ్య జనసేన తరుపున హరిప్రసాద్ మంగళవారం నామినేషన్లు వేశారు. పోటీగా నామినేషన్లు రాకపోవడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శుక్రవారం ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీ ఎమ్మెల్సీలుగా ఉన్న సి. రామచంద్రయ్య, షేక్ మహ్మద్ ఇక్బాల్ వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వీరిలో ఇక్బాల్ ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా చేయగా రామచంద్రయ్యపై అనర్హత వేటు పడింది. దీంతో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఈనెల 12న ఉప ఎన్నిక జరగాల్సి ఉండగా రెండు పదవులు ఏకగ్రీవం కావడంతో ఎన్నికల నిర్వహణ తప్పింది. కడప జిల్లా రాజంపేటకు చెందిన రామచంద్రయ్య టీడీపీ హయాంలో మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. 2008లో టీడీపీకి రాజీనామా చేసి చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరారు. ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన తరువాత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి మంత్రి పదవిని అప్పగించింది. అనంతరం 2018లో వైసీపీలో చేరి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు రాజకీయ కార్యదర్శిగా ఉన్న పి. హరిప్రసాద్‌ను ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల ఏపీలో జరిగిన ఎన్నికల్లో 175 స్థానాలకు గాను టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన 164 మంది సభ్యులు గెలుపొందగా వైసీపీ కేవలం 11 మంది మాత్రమే విజయం సాధించారు.



# గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతల ఆందోళన

- గద్వాల ఎమ్మెల్యేను చేర్చుకోవద్దంటూ నిరసనలు
- నచ్చజెప్పినా వినని వైనం

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ గాంధీభవన్‌లో గద్వాల కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని కాంగ్రెస్ లో చేర్చుకోవద్దని నిరసనకు దిగారు. గాంధీభవన్ ఎదుట కూర్చుని బండ్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గతంలో బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని ఎలా చేర్చుకుంటారని ప్రశ్నిస్తున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ కార్యకర్తలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా కార్యకర్తలు ససేమిరా అంటున్నారు. ఈ సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మహేశ్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దు అంటూ ఆ పార్టీ నేతలు నిరసనకు దిగారు. గద్వాల నియోజకవర్గం అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు గాంధీభవన్‌కు తరలివచ్చారు. బీఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్యే బండ్ల కాంగ్రెస్ కార్యకర్తలను అనేక రకాలుగా వేధించారని వారు వాపోయారు. ప్రజల మధ్య ఎన్నో గొడవలు సృష్టించి భయాందోళనకు గురి చేశారని ఆరోపించారు. తమను ఎన్నో ఇబ్బందులు పెట్టిన అలాంటి ఎమ్మెల్యేని కాంగ్రెస్ లోకి ఎలా రానిస్తామని కార్యకర్తలు అంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఎమ్మెల్యే బండ్లను కాంగ్రెస్ లో చేర్చుకోవద్దని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మెల్యే బండ్ల ప్రతి విషయంలో విఫలమైన వ్యక్తి అని అన్నారు. మనుషులను తొక్కేయడం, ఇబ్బందులకు గురి చేయడం, వాళ్ల కుటుంబాలను దెబ్బతీయడం.. ఇలాంటి పనులు, రాజకీయం చేసే కృష్ణమోహన్ రెడ్డి మాకు వద్దే వద్దు అని గద్వాల కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి పదేళ్ల నుంచి మాకు మనశ్శాంతి లేదని వాపోయారు.

# రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగుల అడ్డగింపు

### జిల్లాల్లోనే అరెస్ట్ చేసిన పోలీసులు

**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రూప్ పోస్టుల సంఖ్య పెంపు, గ్రూప్1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి పాటించాలి, జాబ్ క్యాలెండర్, జీవో 46 రద్దు వంటి డిమాండ్లతో నిరుద్యోగులు పోరుబాటపట్టారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. 30 లక్షల మందితో 'నిరుద్యోగుల మార్చ్' నిర్వహిస్తున్నట్టు తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ప్రకటించింది. అయితే నిరుద్యోగలు మార్చ్‌ను ప్రభుత్వం ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నది. జిల్లాల నుంచి యువతను రాజధానికి రాకుండా అక్రమ-అరెస్టులు చేస్తున్నది. హైదరాబాద్ చుట్టూ పికెటింగ్‌లు ఏర్పాటుచేసింది. జిల్లాల నుంచి వస్తున్న ప్రతివాహనాన్ని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద భారీగా పోలీసులు మోహరించారు. అమ్రబాద్ మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాగర్‌కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్, జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సుల్తాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ములుగు జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నేతలను ముందస్తు అరెస్టు చేశారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలోని బూర్గంపహాడ్‌లో సేవాలాల్ సేన రాష్ట్ర కోకన్వీనర్ బాణావత్ హుస్సేన్‌నాయక్‌ను పోలీసు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లో, ఉస్మానియా తదితర వర్సిటీలు, గ్రంథాలయాలు, స్టడీ సర్కిళ్లు, స్టడీ రూమ్‌లతోపాటు అనేక ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ నేతలను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేసి నిర్బంధంలో పెట్టినట్టు తెలుస్తున్నది. నిజామాబాద్ జిల్లాలో పలువురు విద్యార్థి నేతలను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డిని గురువారం రాత్రి కరీంనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి మహేందర్, కార్యదర్శి యుగేందర్‌నూ అదుపులోకి తీసుకోని వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన విద్యార్థి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హాజీపూర్ చౌరస్తాలో సిద్దాపూర్ పోలీసులు అరెస్టు చేసి అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సేవాలాల్‌సేన రాష్ట్ర కో కన్వీనర్ హుస్సేన్‌నాయక్ సహా మరో 20 మందిని ముందస్తు అరెస్టు చేశారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కేతేపల్లికి చెందిన అర్జున్, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన నగేశ్‌ను వనపర్తి పట్టణ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. వరంగల్ జిల్లా ఇంతేజార్‌గంజ్ పోలీసులు గురువారం రాత్రి పలువురు బీజేవైఎం నేతలను అరెస్టు చేశారు. ఉద్యోగాల సాధన కోసం నిరుద్యోగులు నిత్యం ఉద్యమాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఓయూతోపాటు రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో కూడా నిరుద్యోగుల నిరసనలు, శాంతియుత ర్యాలీలు కొనసాగుతున్నాయి. జిల్లాల వారీగా ప్రజా గ్రంథాలయాల్లో ప్లకార్డులతో నిరసన ప్రదర్శనలు, ప్రభుత్వ నినాదాలు జోరందుకున్నాయి. కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్, ఫ్యాకల్టీ అశోక్ తమ ఇండ్లలోనే ఆమరణ నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు.




# తిరుమలలో రెండు రోజులు బ్రేక్ దర్శనాలు రద్దు

**విశ్వంభర, తిరుపతి :** శ్రీవారి ఆలయంలో ఈనెల 9, 16వ తేదీల్లో బ్రేక్‌దర్శనాలను రద్దు చేసినట్లు టీటీడీ వెల్లడించింది. జూలై 16న సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం సందర్భంగా జూలై 9న నిర్వహించే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 16న బ్రేక్ దర్శనాలను రద్దు చేశామని అధికారులు తెలిపారు. ఈ కారణంగా జూలై 8, 15వ తేదీల్లో సిఫారసు లేఖలు స్వీకరించబడవని పేర్కొన్నారు.

### లడ్డూ పోటుపై సమీక్ష

టీటీడీ ఈవో శ్యామలరావు జేఈవో వీరబ్రహ్మం శుక్రవారం తిరుమలలో లడ్డూ పోటు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గోకులం విశ్రాంతి భవనం సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో వైష్ణవ బ్రాహ్మణ , వైష్ణవ బ్రాహ్మణేతర వర్గాల్లోని లడ్డూల తయారీ కోసం వారి జాబ్‌చార్ట్‌తో సహా , సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. బూందీ ఫ్రై, షుగర్ సిరప్, జీడిపప్పు ఫ్రై, బూందీ మిక్సింగ్, లడ్డూ మౌల్డింగ్, ట్రే లిఫ్టింగ్, కన్వేయర్ బెల్ట్, ప్రసాదం పంపిణీ అధికారులు వివరించారు.

# ఆగస్టులో ఎన్డీయే సర్కార్ కూలుతుంది

## లాలూ ప్రసాద్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రీయ జనతాదళ్ పార్టీ అధ్యక్షుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కేంద్రంలోని మోదీ సర్కారు గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చాలా బలహీనంగా ఉన్నదని, ఆ ప్రభుత్వం ఏ క్షణమైనా కూలిపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. బలహీనమైన నరేంద్రమోదీ ప్రభుత్వం వచ్చే ఆగస్టు నెలలో కుప్పకూలవచ్చునని లాలూ యాదవ్ అనుమానం వ్యక్తంచేశారు. ఆగస్టులో మోదీ సర్కారు కూలిపోయే అవకాశం ఉన్నదని, కాబట్టి ఏ క్షణమైనా ఎన్నికలు రావచ్చని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, కేంద్రంలో ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే గత రెండు పర్యాయాల్లో బీజేపీకి ఫుల్ మెజారిటీ ఉండేది. ఈసారి బీజేపీకి సొంత మెజారిటీ దక్కలేదు. దాంతో మిత్రపక్షాలతో కలిసి మోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బలహీన సంకీర్ణ సర్కారు ఏ క్షణమైనా కూలిపోతుందని లాలూ అంచనా వేశారు.

# దేశంలో వాయుకాలుష్య కోరలు

**• ఏటా 12వేల మంది మృతి • 10 నగరాల్లోనే అత్యధిక మరణాలు**



**విశ్వంభర, హైదరాబాద్ :** దేశంలో వాయు కాలుష్యం బారిన పడి ఏటా వేల మంది ప్రణాలు కోల్పోతున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రతి ఏటా 12వేల మంది వాయు కాలుష్యం కారణంగా మరణిస్తున్నారు. ఈ విషయాన్ని తాజాగా జరిపిన ఓ పరిశోధనలో శాస్త్రవేత్తలు తెలిపారు. ముఖ్యంగా దేశ రాజధానితో పాటు హర్యానా, పంజాబ్, వారణాసి ప్రాంతాల్లో చనిపోతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. దేశంలోని 10 నగరాల్లో ఏటా వాయు కాలుష్యంతో దాదాపు 33వేల మరణాలు సంభవిస్తున్నాయని లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ నివేదిక వెల్లడించింది. స్వచ్ఛమైన వాయువు ప్రమాణాలు, ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలు సూచించిన ప్రతీ క్యూబిక్ మీటర్ గాలిలో 15 మైక్రో గ్రాములకన్నా ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. కాలుష్యం బారి నుంచి దేశ పౌరులను రక్షించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలు పాటించాలని ఆ నివేదిక సూచించింది. ఢిల్లీలో ప్రతీ ఏడాది 2వేల మంది వాయు కాలుష్యం కారణంగా మరణిస్తున్నారని నివేదిక తెలిపింది. కాలుష్యం కారణంగా దేశంలో ఢిల్లీలోనే అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయని తెలిపింది. భారత్ లోని మొత్తం 10 నగరాలు అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, కోల్ కతా, ముంబై, పుణె, సిమ్లా, వారణాసిలో అధ్యయనం చేశారు. ఏటా ఈ నగరాల్లో దాదాపు 33వేల మరణాలు వాయు కాలుష్యం కారణంగా సంభవించి ఉండొచ్చని నివేదిక తెలిపింది. సిమ్లాలో అత్యల్పంగా 59మంది వాయు కాలుష్యంతో మరణించారు. అక్కడ సంభవిస్తున్న మరణాల్లో ఇది 3.7 శాతానికి సమానం. మొత్తం 10 నగరాల్లో నమోదైన మరణాల్లో 7.2 శాతం.. కాలుష్యం వల్లే అని నివేదిక తెలిపింది. భారత్ సహా విదేశీ పరిశోధకులు కలిసి ఈ అధ్యయనం చేశారు. 10 నగరాల్లో కాలుష్య రేణువుల స్థాయి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రామాణిక పరిమితులను మించాయని వెల్లడించింది. సంవత్సరంలో 99శాతం రోజులు ఇదే పరిస్థితి ఉంటోందని తెలిపింది. ఢిల్లీలో మరణాల సంఖ్య 0.31 శాతం పెరిగితే బెంగళూరులో అది 3.06 శాతం పెరిగినట్లు వెల్లడించింది. ఇలా వివిధ నగరాల్లో స్వల్ప కాలంలో కాలుష్యం ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయడం భారత్ లో ఇదే తొలిసారి.

## ఒకరి తర్వాత ఒకరుగా ఐదుగురిని
# వరుసగా మింగేసిన నీళ్ల బావి



**ఛత్తీస్‌గఢ్, జులై 5:** ఛత్తీస్‌గఢ్‌లో దారుణం చోటు చేసుకుంది. బావిలో విషవాయువు పీల్చి ఒకరి తర్వాత ఒకరుగా ఐదుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఓ తండ్రి, అతని ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. ఈ విషాద సంఘటన ఛత్తీస్‌గఢ్‌లోని చంపా జిల్లా కికిర్దా గ్రామంలో శుక్రవారం (జులై 5) ఉదయం చోటు చేసుకుం ది. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (బిలాస్‌పూ ర్ రేంజ్) సంజీవ్ శుక్లా తెలిపిన వివరాల ప్రకారం.. చంపా జిల్లా బిర్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని కికిర్దా గ్రామానికి చెందిన రామ చంద్ర జైశ్వాల్ (60) అనే వ్యక్తి తన ఇంటి పెరట్లోని బావిలో పడిపోయిన చెక్క ముక్క కోసం దాదాపు 30 అడుగుల లోతైన బావిలోకి దిగాడు. అయితే అతను ఎంతసేపటికీ బయట కు రాకపోవడంతో అతడి భార్య గొల్లుగొల్లున ఏడుస్తూ ఇరుగు పొరుగు సాయం కోరింది. దీంతో జైశ్వాల్‌ను రక్షించేందుకు రమేశ్ పటేల్ (50), అతని ఇద్దరు కుమారులు రాజేంద్ర పటేల్ (20), జితేంద్ర పటేల్ (25) ముగ్గురూ ఒకరితర్వాత ఒకరు బావిలోకి దిగారు. అయితే ఈ ముగ్గురూ కూడా తిరిగి పైకి రాలేదు. ఆ తర్వాత చంద్ర (25) అనే మరో వ్యక్తి కూడా అందులోకి దిగాడు. అతడు కూడా బయటకు రాలేదు. దీంతో భయాందోళనలకు గురైన గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు బావిలోని విషవాయువు పీల్చి వారంతా చనిపోయినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం బావిలోంచి ఐదుగురి మృతదేహాలను స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్ వెలికి తీయగా.. పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోస్టుమార్టం అనంతరం వీరి మరణానికి అసలు కారణం తెలుస్తుందని న్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సంజీవ్ శుక్లా తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేస్తునట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ సాయి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కక్కరికి రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

# బ్రిటన్ ఎన్నికల్లో రిషి సునాక్ ఓటమి

- లేబర్ పార్టీ ఘన విజయం
- కొత్త ప్రధానిగా కీర్ స్టార్మర్



**విశ్వంభర, హైదరాబాద్ :** బ్రిటన్ రాజకీయాల్లో చారిత్రక ఘట్టం! 14ఏళ్ల పాటు సుదీర్ఘ పాలన సాగించిన కన్జర్వేటివ్ పార్టీ, 2024 యూకే ఎన్నికల్లో దారుణ ఓటమికి అడుగు దూరంలో నిలిచింది. జులై 4న ఎన్నికలు జరగ్గా, ఒక్కొక్కటిగా వెలువడుతున్న ఫలితాల్లో విపక్ష లేబర్ పార్టీ హవా స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిణామాల మధ్య తన ప్రధాని పదవికి రిషి సునక్ రాజీనామా చేయనున్నారు. ఓటమికి తాను బాధ్యత వహిస్తున్నట్టు స్పష్టం చేశారు.

### 'క్షమించండి.. నాదే బాధ్యత..'

యూకేలో 650 సీట్లకు ఎన్నికలు జరగ్గా.. మెజారిటీ మార్క్ 326ని ఇప్పటికే దాటేసింది లేబర్ పార్టీ. తాజా సమాచారం ప్రకారం కీర్ స్టార్మర్ నేతృత్వంలోని లేబర్ పార్టీ 350కిపైగా సీట్లల్లో విజయం సాధించింది. కన్జర్వేటివ్ పార్టీ మాత్రం 100 కన్నా తక్కువ సీట్లలోనే ప్రస్తుతం ఉంది. ఈ వ్యవహారంపై ప్రధాని రిషి సునక్ స్పందించారు. “2024 యూకే ఎన్నికల్లో లేబర్ పార్టీ విజయం సాధించింది. సర్ కీర్ స్టార్మర్‌కి శుభాకాంక్షలు. ఈరోజు, అధికార బదిలీ అనేది ప్రశాంతం, ప్రజల మంచిని కోరుకునే విధంగా జరుగుతుంది. మన దేశ స్థిరత్వం, భవిష్యత్తుకు ఇది చిహ్నంగా నిలుస్తుంది,” అని సునక్ అన్నారు. “ఈ ఓటమికి నేను బాధ్యతలు తీసుకుంటున్నాను. క్షమాపణలు,” అని రిషి సునక్ స్పష్టం చేశారు. 2010 తర్వాత తొలిసారిగా లేబర్ పార్టీ అధికారంలోకి రానుంది. కీర్ స్టార్మర్ ప్రధాని అవ్వనున్నారు. కానీ పాలన అంత సులభంగా ఉండకపోవచ్చు. కన్జర్వేటివ్ పార్టీని దారుణంగా ఓడించిన ప్రజలు.. లేబర్ పార్టీ ప్రభుత్వంపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం, ప్రజా సేవల్లో జాప్యం, జీవన ప్రమాణాల పతనం, నిరుద్యోగం వంటి అంశాలు బ్రిటన్‌ని వెంటాడుతున్న సమయంలో.. వాటిని కొత్త ప్రభుత్వం ఏలా డీల్ చేస్తుందో చూడాలి.

### స్పందించిన కీర్ స్టార్మర్..

యూకే ఎన్నికల ఫలితాలపై లేబర్ పార్టీ నేత, బ్రిటన్‌కి కాబోయే ప్రధాని కీర్ స్టార్మర్ స్పందించారు. “ధన్యవాదాలు. మీరు మన దేశాన్ని మార్చేశారు. కానీ ఇలాంటి ఫలితాలు మా మీద బాధ్యతను పెంచుతాయి. ఈరోజు కొత్త అధ్యయనాన్ని ప్రారంభిస్తున్నాము. దేశాన్ని పునర్మించాలి. ప్రజాసేవ కోసం రాజకీయాలు చేయాలి. ప్రభుత్వం మంచి చేయగలదు అని నిరూపించారు. ఈరోజున యూకే భవిష్యత్తు తిరిగొచ్చింది,” అని కీర్ స్టార్మర్ అన్నారు. అయితే, కీర్ స్టార్మర్ పాలనలో బ్రిటన్- భారత్ సంబంధం బలపడే అవకాశాలే కనిపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారాల వేళ ఆయన భారత్‌తో బంధంపై సానుకూల వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు, భారత్‌తో సరికొత్త వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేస్తామన లేబర్ పార్టీ మేనిఫెస్టోలో కూడా స్పష్టం చేశారు. అంటే.. ఇండియాతో ట్రేడ్ ఒప్పందాలు మరింత వేగంగా జరిగే అవకాశాలు లేకపోలేదు. యూకేలో భారత సంతతి ప్రజలను ఆకర్షించేందుకు సైతం ప్రయత్నించారు కీర్ స్టార్మర్.

# బ్రిటన్ ఎన్నికల్లో గెలిచిన భారత సంతతి నేతలు వీరే!



**బ్రిటన్:** యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిన బ్రిటన్ సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. కీర్ స్టార్మర్ నాయకత్వంలోని లేబర్ పార్టీ అద్భుత విజయం సాధించింది. బ్రిటన్ పార్లమెంటులో మొత్తం సీట్ల సంఖ్య 650 కాగా.. ఇప్పటివరకు 644 స్థానాల్లో ఫలితాలు తేలాయి. లేబర్ పార్టీ 409 స్థానాలతో తిరుగులేని విజయం అందుకుంది. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 326 కాగా... లేబర్ పార్టీ 400కి పైగా సీట్లతో ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమైంది. రిషి సునాక్ నాయకత్వంలోని కన్జర్వేటివ్ పార్టీ 119 స్థానాలు నెగ్గింది. ఓవరాల్ గా... 330 మంది తొలిసారిగా ఎంపీలయ్యారు. ఇక అసలు విషయానికొస్తే... బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో పలువురు భారత సంతతికి చెందిన నేతలు విజయం సాధించారు. వారిలో రిషి సునాక్ కూడా ఉన్నారు. రిషి సునాక్ ఎంపీగా గెలిచినప్పటికీ, తన కన్జర్వేటివ్ పార్టీ ఓడిపోవడంతో ఆయన ప్రధాని పదవి నుంచి దిగిపోవాల్సి వస్తోంది.

### రిషి సునాక్

ప్రస్తుతం బ్రిటన్ ఆపద్ధర్మ ప్రధానిగా ఉన్న రిషి సునాక్ సార్వత్రిక ఎన్నికల్లో నార్తర్న్ ఇంగ్లండ్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆయన గతంలోనూ ఇదే స్థానం నుంచి నెగ్గారు. ఆయన 47.5 శాతం ఓట్లు దక్కించుకున్నారు. దేశంలో ద్రవ్యోల్బణం పెరగడం, నిరుద్యోగ సమస్య, ఆరోగ్య బీమా అంశాలు, అంతర్జాతీయ సమస్యలపై ప్రభుత్వ వైఖరి... ఇలా అనేక కారణాలతో రిషి సునాక్ నాయకత్వంలోని కన్జర్వేటివ్ పార్టీ పట్ల ఎన్నికల్లో తీవ్ర వ్యతిరేకత కనబరిచారు.

### శివానీ రాజా

శివానీ రాజా... లేబర్ పార్టీకి చెందిన మహిళా రాజకీయ నేత. ఆమె ఈ ఎన్నికల్లో లీసెస్టర్ (తూర్పు) నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. మాజీ ఎంపీలు, రాజకీయ దిగ్గజాలు క్లాడ్ వెబ్, కీత్ వాజ్ లీసెస్టర్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్లుగా బరిలో దిగడంతో ఇక్కడ గట్టి పోటీ నెలకొంది. అయితే, శివానీ రాజానే విజయం వరించింది. శివానీ లీసెస్టర్ లోనే పుట్టి పెరిగారు. హెర్రిక్ ప్రైమరీ స్కూల్లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. సోర్ వ్యాలీ కాలేజ్, క్వీన్ ఎలిజబెత్-2 కాలేజీలో చదువుకున్నారు. ఆమె డి మోంట్ ఫోర్ట్ యూనివర్సిటీ నుంచి కాస్మెటిక్ సైన్స్ లో ఫస్ట్ క్లాస్ ఆనర్స్ డిగ్రీ అందుకున్నారు.

### కనిష్క నారాయణ్

వేల్స్ ప్రాంతంలో మైనారిటీ నేపథ్యంతో ఎన్నికైన మొట్టమొదటి భారత సంతతి ఎంపీ కనిష్క నారాయణ్. నారాయణ్ భారత్ లోనే పుట్టారు. 12 ఏళ్ల వయసున్నప్పుడు ఆయన కుటుంబం బ్రిటన్ లోని కార్డిఫ్ కు వలస వచ్చింది. ప్రత్యేక స్కాలర్ షిప్ సాధించి ఈటన్ విద్యా సంస్థలో చదువుకున్న కనిష్క నారాయణ్... ఆ తర్వాత ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్ ఫర్డ్ వర్సిటీ, స్టాన్ ఫర్డ్ వర్సిటీలో విద్యాభ్యాసం చేశాడు.

### సువెల్లా బ్రువెర్మన్

భారత సంతతికి చెందిన సువెల్లా బ్రువెర్మన్ ఈ ఎన్నికల్లో ఫేర్ హామ్ అండ్ వాటర్లూ విల్లా ఎంపీ స్థానం నుంచి విజయం సాధించారు. రిషి సునాక్ క్యాబినెట్లో ఆమె హోంమంత్రిగా వ్యవహరించారు. అయితే పదవీకాలం మధ్యలోనే ఉద్వాసనకు గురయ్యారు. అప్పట్లో సువెల్లా బ్రువెర్మన్ స్థానంలో జేమ్స్ క్లెవర్లీని హోంమంత్రిగా నియమించారు. లండన్ పోలీసులు పాలస్తీనా మద్దతుదారుల పట్ల అనుకూల వైఖరిని కనబరుస్తున్నారంటూ చేసిన ఆరోపణలు సువెల్లా బ్రువెర్మన్ కు ప్రతికూలంగా మారాయి.

### గగన్ మహీంద్రా

గగన్ మహీంద్రా బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ తరఫున పోటీ చేశారు. సౌత్ వెస్ట్ హెర్ట్ ఫోర్డ్ షైర్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఆయనకు 16,458 ఓట్లు లభించాయి. ఆయన సమీప ప్రత్యర్థి, లిబరల్ డెమొక్రాటిక్ పార్టీకి చెందిన శాలీ సిమింగ్టన్ కు 12,002 ఓట్లు వచ్చాయి. గగన్ మహీంద్రా... ఓ పంజాబీ హిందు కుటుంబానికి చెందిన వ్యక్తి.

### నవేందు మిశ్రా

నవేందు మిశ్రా స్టాక్ పోర్ట్ ఎంపీ స్థానం నుంచి విజ యం సాధించారు. 2019 ఎన్నికల్లోనూ ఆయన ఇదే స్థానం నుంచి గెలుపొందారు. నవేందు మిశ్రా లేబర్ పార్టీ నేత. ఎన్నికల్లో ఆయనకు 21,787 ఓట్లు వచ్చాయి.

### సత్వీర్ కౌర్

బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల్లో సౌతాంప్టన్ టెస్ట్ నియోజకవర్గం నుంచి సత్వీర్ కౌర్ జయభేరి మోగించారు. ఆమె లేబర్ పార్టీకి చెందిన మహిళా నేత. ఆమె భారీ మెజారిటీతో నెగ్గారు. సీనియర్ ఎంపీ అలెన్ వైట్ హెడ్ రాజకీయాల నుంచి తప్పుకోవడంతో ఈ ఎన్నికల్లో సత్వీర్ కౌర్ కు టికెట్ ఇచ్చారు.

# నీట్ పరీక్షపై సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన కేంద్రం

- నీట్ పేపర్ లీకేజిపై దేశవ్యాప్తంగా దుమారం
- సుప్రీంకోర్టులో విచారణ
- నీట్ పరీక్ష రద్దు చేసేది లేదన్న కేంద్రం
- ఇప్పటికే నిందితులను అరెస్ట్ చేశామని వెల్లడి
- నీట్ రద్దు చేస్తే లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతారని వివరణ

**విశ్వంభర, ఢిల్లీ :** జాతీయ స్థాయిలో వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడంతో దేశవ్యాప్తంగా దుమారం రేపింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ విచారణలో నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ పరీక్షను రద్దు చేసేది లేదని తేల్చి చెప్పింది. పోటీ పరీక్షలను పారదర్శక రీతిలో నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నామని కేంద్రం స్పష్టం చేసింది. నీట్ పేపర్ లీకేజి కేసులో ఇప్పటికే నిందితులను అరెస్ట్ చేశామని, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించామని తన అఫిడవిట్ లో వెల్లడించింది. అయితే, భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్టు ఆధారాలు లేవని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వివరించింది. అందువల్ల నీట్ పరీక్ష రద్దు చేయడం సరికాదని అభిప్రాయపడింది. నీట్ పరీక్షను రద్దు చేస్తే నిజాయతీగా పరీక్ష రాసిన లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతారని వివరించింది.

# టీమిండియాకు రూ.11 కోట్ల నజరానా

## ప్రకటించిన మహారాష్ట్ర సీఎం షిండే



**విశ్వంభర, ఢిల్లీ :** అమెరికా, వెస్టిండీస్ సంయుక్తంగా నిర్వహించిన టీ20 వరల్డ్ కప్ టోర్నీలో విజేతగా నిలిచి స్వదేశానికి తిరిగొచ్చిన టీమిండియాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తాజాగా, వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా జట్టుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే రూ.11 కోట్ల నజరానా ప్రకటించారు. ఇవాళ ముంబయిలోని మహారాష్ట్ర విధాన్ భవన్ లో టీమిండియా ఆటగాళ్లు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, యశస్వి జైస్వాల్, శివమ్ దూబేలను మహారాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలోనే సీఎం ఏక్ నాథ్ షిండే టీమిండియాకు నజరానా ప్రకటించారు. కాగా, తన ప్రసంగంలో షిండే మాట్లాడుతూ, చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ ను వరల్డ్ కప్ లో టీమిండియా ఓడించడం తనకెంతో సంతోషం కలిగించిందని అన్నారు. దక్షిణాఫ్రికాతో ఫైనల్లో సూర్యకుమార్ యాదవ్ బౌండరీ లైన్ వద్ద పట్టిన అద్భుత క్యాచ్ గురించి ప్రస్తావించారు. అంతేకాదు, మహారాష్ట్ర క్రికెట్ కు చెందిన పరాస్ మాంబ్రే, అరుణ్ కనాడే టీమిండియా సహాయక సిబ్బందిగా తమ పాత్రను విజయవంతంగా నిర్వర్తించారని సీఎం షిండే అభినందించారు. గతరాత్రి ముంబయి మెరైన్ డ్రైవ్ లో లక్షలాది మంది హాజరైన టీమిండియా విక్టరీ పరేడ్ లో ఎలాంటి అపశ్రుతులు జరగకుండా సమర్థవంతంగా ఏర్పాట్లు చేశారంటూ పోలీసులను కూడా అభినందించారు.



# 9 నెలల్లో పూర్తి చేయండి

- అసెంబ్లీ బిల్డింగ్ సముదాయాలపై స్పీకర్ ఆర్డర్
- అధికారులతో పరిశీలించిన అయ్యన్న పాత్రుడు

**విశ్వంభర, అమరావతి :** అమరావతి రాజధాని ప్రాంతంలో ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు పర్యటించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన నిర్మాణ సముదాయాలను పరిశీలించారు. ఈ భవనాలను 9 నెలల కాలంలో పూర్తి చేయాలని సీఆర్డీఏ అధికారులను కోరారు. శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాల్ లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్ల భవన సముదాయాలపై స్పీకర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎంఎల్ఏ, ఎంఎల్సి క్వార్టర్ల భవనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ 9 మాసాల్లోగా పూర్తి చేసి ఇవ్వాలని కోరారు. ఒక నిర్దిష్ట కాలవ్యవధి ప్రకారం పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా అమరావతి రాజధాని ప్రాంతంలో ఎంఎల్ఏ,ఎంఎల్సిల నివాస భవన సముదాయాలతో పాటు ఇతర భవనాల పనులు నిలిచిపోయాయని స్పీకర్ అన్నారు. పనులు ఎక్కడివి అక్కడే నిలిచి పోవడంతో వాటికి సంబంధించిన మెటీరియల్ అంతా తుప్పు పట్టిపోయే పరిస్థితులు నెలకొన్నాయని వ్యాఖ్యానించారు. పూర్తి చేసేందుకు అయ్యే అంచనా వ్యయం కూడా పెరిగి పోయిందని పేర్కొన్నారు. అసెంబ్లీ భవనంలో లీకేజీలు ఉన్నట్టు గుర్తించామని వాటిని వెంటనే అరికట్టాలని అధికారులకు స్పీకర్ సూచించారు. అదే విధంగా ప్రస్తుతం మీడియా పాయింట్ ఉన్న ఎనెక్సా భవనంలో కూడా సౌకర్యాలను మెరుగు పర్చాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా అసెంబ్లీకి సంబంధించిన ప్రత్యేక గ్రంధాలయన్ని అక్కడ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని.. ఆదిశగా తగిన చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సెక్రటరీ జరనల్ కు సూచించారు. అసెంబ్లీ కమిటీల చైర్మెన్ లకు కూడా ఈ భవనంలోనే రూమ్ లను ఏర్పాటు చేయడంతో పాటు అసెంబ్లీకి వచ్చే వారికి సౌకర్యవంతంగా ఉండే విధంగా చిన్న క్యాంటీన్ ను ఏర్పాటు చేయాలని స్పీకర్ దిశానిర్దేశం చేశారు. ఈసమావేశంలో సిఆర్డిఎ కమిషనర్ కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ 2019 నాటికి ఎంఎల్ఏ, ఎంఎల్సిల క్వార్టర్లకు సంబంధించి 77 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. మిగతా పనులు పూర్తి చేసి ఆభవనాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతామని అన్నారు. చాలా వరకూ ఫినిషింగ్ పనులే పెండింగ్‌లో ఉన్నందును త్వరితగతిన పనులు నిర్వహిస్తామని తెలిపారు. 9 మాసాల్లో పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదే విధంగా శాశ్వత అసెంబ్లీ భవనం అందుబాటులోకి వచ్చే లోగా ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ భవనం నిర్వహణను పూర్తి స్థాయిలో మెరుగు పర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటాని వివరించారు. సౌకర్యాలను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. అనంతరం స్పీకర్ అయ్యన్న పాత్రుడు అధికారులతో కలిసి భవనాన్ని పరిశీలించారు.

# జగన్‌పై కేసు పెట్టాలి

**మంత్రి రామానాయుడు డిమాండ్**



**విశ్వంభర, విశాఖపట్నం :** ఈవీఎంల ధ్వంసం తప్పుకాదని జగన్ అనడం సరికాదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జగన్ వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ సుమోటోగా కేసు పెట్టాలని కోరారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోకుండా ప్రజలను జగన్ తప్పుబడుతున్నారని మండిపడ్డారు. ప్రజలపై నిందలు వేయడం సరికాదని హితవుపలికారు. జగన్ ఇలాగే ఉంటే మొన్నటి ఎన్నికల్లో రెండంకెలే మిగిలాయని.. భవిష్యత్తులో ఒక సంఖ్య మాత్రమే మిగులుతుందని ఎద్దేవా చేశారు. జలవనరుల శాఖను గాడిలో పెడతామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. జలవనరుల శాఖ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గతంలో గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయాయని గుర్తుచేశారు. గత ప్రభుత్వం కాల్వల్లో మట్టి కూడా తీయలేదని ఆరోపించారు. రైతులకు సాగునీరు అందించే విషయంలో ప్రణాళికతో ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. కృష్ణా డెల్టా ఆయకట్టుకు ఆగస్టులోపు సాగునీటిని ఇవ్వడం సాధ్యం కాదని తెలిపారు. ఖరీఫ్‌కు అవాంతరాలు లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. ప్రతి రిజర్వాయర్‌లో జగన్ నిర్లక్ష్యం కనిపిస్తోందని మంత్రి నిమ్మల అన్నారు. పులిచింతల ప్రాజెక్టులో గతంలో 40 టీఎంసీలు నిల్వ ఉంచుకుని వాడుకునే వాళ్లమని.. ప్రస్తుతం అర టీఎంసీ కూడా లేదని తెలిపారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు కొంచెం తాగు, సాగు నీరు ఇవ్వగలుగుతున్నామని చెప్పారు. జగన్ పాలనలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ బాగా నష్టపోయిందని తెలిపారు. అసమర్థ పాలన వల్ల సాగునీటి ప్రాజెక్టులు 20 ఏళ్లు వెనక్కి వెళ్లాయని అన్నారు.

# నాకు ప్రాణహాని ఉంది

**మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపణలు : హైకోర్టులో పిటిషన్**




**విశ్వంభర, అమరావతి :** తనకు ప్రాణహాని ఉందని, భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు అంబటి రాం బాబు ఏపీ హైకోర్టు లో పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటి వరకు ఉన్న ఫోర్ ప్లస్ ఫోర్ గన్‌మెన్ల భద్రతను యధావిధిగా కొనసాగించాలని కోరారు. భద్రతను ఉపసంహరించడాన్ని సవాల్ చేస్తూ కోర్టులో అంబటి పిటిషన్ వేశారు. భద్రత పునరుద్ధరణపై పల్నాడు ఎస్పీ, డీజీపీకి వినతిపత్రాలు సమర్పించినా ప్రయోజనం లేదని వాపోయారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి ఇరువాదనలు విని తదుపరి విచారణను ఈనెల 10వ తేదీకి వాయిదా వేశారు. ఈ వ్యాజ్యానికి సంబంధించి పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించారు.

# రాష్ట్రానికి నిధులివ్వండి

- బడ్జెట్‌లో ఏపీకి ఎక్కువ కేటాయింపులు ఇవ్వాలి
- ఆర్థిక మంత్రిని కోరిన సీఎం చంద్రబాబు
- రాజ్‌నాథ్‌సింగ్, నడ్డాలతో కూడా భేటీ



**విశ్వంభర, ఢిల్లీ :** సిఎం హెూదాలో తొలి సారి ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది,. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రాజెక్టుల కోసం తొలి పర్యటనలోనే చంద్రబాబు వరుస భేటీలు నిర్వహిస్తున్నారు ప్రధాని మోదీతో సహా తొలిరోజు 7గురు కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులతో సిఎం భేటీ అయ్యారు. శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు సహా పలు కీలక అంశాలను చంద్రబాబు నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వీలైనంతగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గురువారం కేంద్ర మంత్రులు అమిత్ షా, గడ్కరీ, పీయూష్ గోయల్, శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్, హర్ దీప్ సింగ్, ఆర్థిక సంఘం చైర్మన్‌లతో బాబు భేటీ అయ్యారు. శుక్రవారం ఉదయం నీతిఆయోగ్ ఛైర్మన్,సీఈవోలతో భేటీ అయ్యారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఎంపీలతో కలిసి భేటీ అయ్యారు. చంద్రబాబు పర్యటనలో రాజ్ నాధ్ సింగ్, నిర్మలా సీతారామన్, నడ్డా, నీతీ ఆయోగ్ సీఈవోలతో పాటు పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో భేటీ అవుతున్నారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో నాటి ముఖ్యమంత్రి జగన్ డిల్లీ పర్యటనలకు, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనల్లో వ్యత్యాసంపై హస్తినలో సైతం విస్తృత చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం వినతులతో వస్తున్న కారణంగా ఏపి సిఎంకు ఢిల్లీలో ప్రాధాన్యం లభిస్తోంది. చంద్రబాబుకు కేంద్ర మంత్రులు తగిన గౌరవం ఇస్తున్నారు. లోక్‌సభలో టీడీపీకి పెరిగిన బలం నేపథ్యంలో చంద్రబాబుకు డిల్లీలో అందుకు తగ్గట్టుగా గౌరవం లభిస్తోంది. కేంద్ర పెద్దల స్పందన వేగంగా, సానుకూలంగా ఉందంటున్న ఏపీ ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర మంత్రులతో పాటు.... వివిధ శాఖల్లో ఉన్న 60 మంది ఐఎఎస్ అధికారులకు ఏపీ సిఎం చంద్రబాబు విందు ఇచ్చారు. రాష్ట్రానికి సంబంధించి నిధుల విడుదలకు సహకరించాలని కోరారు. ప్రాజెక్టుల మంజూరుతో పాటు శాఖా పరమైన సహాయంలో చొరవ చూపాలని ఐఎఎస్‌లను చంద్రబాబు కోరారు. ఢిల్లీ ప్రర్యటనలో ప్రతి శాఖకు సంబంధించి పెండింగ్ పనుల వివరాలతో కేంద్ర మంత్రులను చంద్రబాబు కలుస్తున్నారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నడ్డాతో రాష్ట్ర మంత్రులు, ఎంపీలతో కలిసి భేటీ అయ్యారు. వైద్య రంగానికి సంబంధించి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, అనుమతులను వేగంగా మంజూరు చేయాని నడ్డాకు చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

# కాపులకు 5శాతం రిజర్వేషన్లు కల్పించండి

**పవన్ కల్యాణ్ కు హరిరామజోగయ్య లేఖ**




**విశ్వంభర, విశాఖపట్నం :** ఏపీలో లేఖ రాజకీయాలు మొదలయ్యాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య లేఖ రాశారు. ఈ లేఖ రాజకీయంగా చర్చనీయాంశమైంది. పూర్తిస్థాయిలో రాజకీయ విశ్లేషణాత్మక లేఖగా పేర్కొన్నారు ఆయన. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి అయిన నారాచంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ సమపాళ్లల్లో పరుగులు పెట్టిస్తారని భావిస్తున్నానన్నారు. సంక్షేమ ఫలాలు ప్రజల అవసరాలు తీర్చే విధంగా ఉండాలి తప్ప రాజకీయ లబ్ధి కోరే విధంగా ఉండకూడదని తెలిపారు. అభివృద్ధి కూడా ఒకే చోట కేంద్రీకరించొద్దని పేర్కొన్నారు. ప్రధానంగా కాపు సామాజికవర్గం ఆశిస్తున్న ఐదు శాతం రిజర్వేషన్లను తమ పాలనలో అమలు చేస్తారని ఆశిస్తున్నానని డిప్యూటీ సీఎంకు రాసిన లేఖలో ప్రస్తావించారు. గతంలో కాపుసామాజికవర్గానికి రిజర్వేషన్లు కల్పిస్తామని, కాపులను బీసీల్లో చేరుస్తామని హామీ ఇచ్చారు అప్పటి సీఎం చంద్రబాబు. అయితే అది సాధ్యం కాలేదు. అందులో భాగంగానే ఈ కాపు రిజర్వేషన్ ప్రస్తావన చేసినట్లు తెలుస్తోంది. కృష్ణా జిల్లాకు వంగవీటి మోహన రంగ పేరు పెట్టాలని కోరారు. సినిమాలు మానేయకుండానే సగం రోజులు షూటింగులకు, మిగిలిన సగం రోజులు రాష్ట్ర పరిపాలనకు కేటాయించాలని సూచించారు. అలాగే చేసే సినిమాలు కూడా సమాజానికి ఉపయోగపడేవి, సందేశాత్మకంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో నిర్వీర్యమైన జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ రాజ్ వ్యవస్థలను ఆ శాఖ మంత్రిగా బలోపేతం చేయాలని మాజీ ఎంపీ హరిరామ జోగయ్య ఈ లేఖలో పేర్కొన్నారు. అలాగే ప్రతి జిల్లా కేంద్రాల్లో ఎమ్మార్వో ఆఫీసులు మొదలు జిల్లా కలెక్టర్ భవనాలను, సచివాలయ కట్టడాలను సమకూర్చి అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దీంతో పాటూ రోడ్లు, డ్రైనేజీలు, సాగు నీరు, విద్యుత్, పారిశుద్ధ్యం లాంటి సౌకర్యాలు కల్పించాలని, ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. వీటిపై డిప్యూటీ సీఎం ఎలా స్పందిస్తారో చూడాలి.

# పవన్ టార్గెట్ ద్వారంపూడి

**అందుకే కాకినాడ పర్యటన..?**



**విశ్వంభర, విశాఖపట్నం :** కాకినాడ జిల్లాల్లో జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తల నోట ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేరే వినబడుతుంది. గత ప్రభుత్వం హయాంలో ఆయన డైరెక్షన్ లో జరిగిన వ్యవహారాలన్నింటిపై ఫోకస్ పెట్టేస్తున్నారు. ఇందుకు కారణాలు కూడా లేకపోలేదు. గత ప్రభుత్వ హయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పవన్‌కు చేతనైతే కాకినాడ సిటీలో పోటీ చేయాలని సవాల్ విసిరారు. అంతే కాకుండా పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగతంగా విమర్శలు చేశారు. దీంతో జనసేనకు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మధ్య వైరం పెరిగింది. పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి నివాసం ఎదుట ఆందోళనకు యత్నించిన జనసేన పార్టీ కార్యకర్తలు, వీర మహిళలపై ఆయన అనుచరులు దాడి చేశారు. దీంతో అప్పట్లో పవన్ కళ్యాణ్ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. వివిధ సభల్లో ద్వారంపూడిపై జనసేననాని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. చీడపురుగు మదమెక్కి మాటలాడుతోందంటూ తీవ్ర పదజాలంతో మండిపడ్డారు. దీనికి ద్వారంపూడి కూడా స్పందించి అదే రీతిలో కౌంటర్ ఇచ్చేవారు. ఇలా ఎన్నికల వరకు ఈ తంతు కొనసాగింది. అలాగే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కాకినాడ పోర్టును అడ్డా పెట్టుకొని ఆఫ్రికా దేశాలకు అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్నారనే ఆరోపణలు వినిపించాయి. కాకినాడలో ఆయన అనుచరుల రౌడీయిజం, కబ్జాలు వంటి ఆరోపణలు అనేకం ఉన్నాయి. జిల్లాల్లో మొత్తం ఆయన పెత్తనమే ఉండేది. కలెక్టర్, ఎస్పీ నుంచి అందరు అధికారులు ఆయన చెప్పుచేతుల్లోనే ఉండేవారన్న టాక్ ఉండేది. తుని ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పటికీ కాకినాడలో జరిగిన వ్యవహారాల్లో తలదూర్చేవారు కాదు. అందుకు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డే కారణంగా చెబుతుంటారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కూరసాల కన్నబాబు మంత్రిగా ఉండి, కాకినాడ వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించారు. ఆయన జోక్యాన్ని చంద్రశేఖర్ రెడ్డి అడ్డుకున్నారు. దీంతో వారిద్దరి మధ్య కూడా కొంత కాలం జగడం నడిచింది. మళ్లీ జగన్మోహన్ రెడ్డి జోక్యంతో అది సమిసిపోయింది. ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి తండ్రి బాస్కర్ రెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ చైర్మన్‌గానూ, తమ్ముడు వీరభద్రరెడ్డి రాష్ట్ర రైసు మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. దీంతో అక్రమ బియ్యం తరలింపు చంద్రశేఖర్ రెడ్డి సులువుగా చేశారని ఆరోపణలు ఉన్నాయి. అంతకు ముందు కృష్ణా జిల్లాలో అడపదడపా చేసినా రెండు రోజుల పాటు సుధీర్ఘంగా పర్యటించింది మాత్రం కాకినాడలోనే..! నాదెండ్ల మనోహర్ రెండు రోజుల పాటు కాకినాడ సిటీలో పర్యటించి ద్వారంపూడి చంద్రశేఖర్ లెక్కలతో పాటు మరికొన్ని అంశాలపై ఆరా తీశారు. దీంతో ద్వారంపూడే వ్యవహారాలను బయటికి తీయటంతో పాటు గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి లెక్కలను బయటికి తీయటమే టార్గెట్ అని స్పష్టం అయింది.



# కుల గణన స్థానంలో నైపుణ్య గణన

- జగన్ పాలనలో అమరావతికి అన్యాయం
- వచ్చే ఐదేండ్లలో అమరావతిని తీర్చిద్దుతాం
- ఢిల్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన

**విశ్వంభర, ఢిల్లీ :** ఐదేళ్ల జగన్ పాలనలో సరిదిద్దలేనంత నష్టం జరిగిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఢిల్లీలో మీడియాతో చిట్ చాట్ చేసిన ఆయన ఐదేళ్లపాటు రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పని చేస్తామని చెప్పారు. దక్షిణాదిలో ఏ రాష్ట్రానికి లేని గొప్ప వనరులు ఏపీకి ఉన్నాయని చంద్రబాబు తెలిపారు. నదుల అనుసంధానంతో అద్భుతాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. గోదావరి నుంచే మొత్తం దక్షిణాది రాష్ట్రాలకు నీరు ఇవ్వవచ్చన్నారు. కేంద్రం నుంచి తాము ఎలాంటి పదవులూ ఆశించలేదని చంద్రబాబు చెప్పుకొచ్చారు. వాజ్‌పేయీ ప్రభుత్వంలోనూ పదవులు ఆశించలేదని గుర్తు చేశారు. ఏడు మంత్రి పదవులు తీసుకోవాలని వాజ్‌పేయీ కోరినా తీసుకోలేదన్నారు. ఎన్డీయేలో ఉన్నందున అప్పుడు స్పీకర్ పదవి తీసుకున్నామని చెప్పారు. ఇప్పుడు కూడా ఎన్డీయే ఇచ్చిన రెండు మంత్రి పదవులే తీసుకున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ఎన్డీఏ ఇచ్చిన మంత్రి పదవులతో సంతోషంగానే ఉన్నామన్న ఆయన జగన్ పాలనతో అమరావతిపైన ఆకర్షణ కొంత వరకు తగ్గిందని వ్యాఖ్యానించారు. అమరావతికి పూర్వ వైభవం తేవడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘటించారు. అమరావతిలో 135 ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. అమరావతికి అవసరమైన మౌలిక వసతులన్నీ కల్పిస్తున్నామని అమరావతిలో ఐకానిక్ బిల్డింగ్స్ సహా అన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అమరావతిలో తొలుత నిర్మాణంలో ఉన్నవాటిని పూర్తి చేస్తామని చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. రాష్ట్రంలో కులగణన స్థానంలో నైపుణ్య గణన చేస్తామన్నారు. నైపుణ్య గణనకు త్వరలో మార్గదర్శకాలు విడుదల చేస్తామని వెల్లడించారు. మానవ వనరులే పెట్టుబడిగా సంపద సృష్టిస్తామన్న చంద్రబాబు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో ఉపాధి కల్పిస్తామన్నారు. పీపీపీ నమూనా స్థానంలో పీ-4 విధానం తెస్తామని చెప్పారు. మళ్లీ జగన్ వస్తే ఎలా అని అన్ని వర్గాలూ అడుగుతున్నాయని చెప్పిన చంద్రబాబు డెవిల్‌ను నియంత్రించామని కామెంట్స్ చేశారు. ఇకపై ఎవరికీ ఇబ్బంది ఉండదని దావోస్ పెట్టుబడుల సదస్సుకు తప్పక హాజరవుతానని ప్రకటించారు.



# భారత్ మాతాకీ జై నినాదాలతో
# మహమ్మద్ సిరాజ్‌కు ఘన స్వాగతం

- శంషాబాద్ విమానాశ్రయంలో అభిమానుల బ్రహ్మారథం
- ప్రపంచకప్ గెలిచినందుకు సంతోషంగా ఉందన్న మహమ్మద్ సిరాజ్
- ఇది హైదరాబాద్‌కు గర్వించదగ్గ క్షణాలు అని వ్యాఖ్య



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమిండియా ఆటగాడు మహమ్మద్ సిరాజ్‌కు హైదరాబాద్‌లో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న అతనికి క్రికెట్ అభిమానులు బ్రహ్మరథం పట్టారు. భారత్ మాతాకీ జై అనే నినాదాల మధ్య స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిరాజ్ మాట్లాడుతూ... ప్రపంచ కప్ గెలిచినందుకు చాలా సంతోషంగా ఉందన్నాడు. రానున్న రోజుల్లో తాను మరింతగా కష్టపడి భారత జట్టుకు మరిన్ని పథకాలు సాధించే విధంగా కృషి చేస్తానన్నాడు. ఛాంపియన్‌గా నిలిచిన అనుభూతి వర్ణించడానికి మాటలు రావట్లేదన్నాడు. ఇది హైదరాబాద్‌కు గర్వించదగ్గ క్షణాలు అన్నాడు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి వచ్చిన సిరాజ్‌కు మెహిదీపట్నంలో క్రికెట్ అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అతనిని వాహనంలో ఊరేగించారు. సరోజిని కంటి ఆసుపత్రి నుంచి ఈద్గా మైదానం వరకు రోడ్డు షో నిర్వహించారు. అభివాదం చేస్తూ సిరాజ్ ముందుకు కదిలాడు.

# మా జనాభా కంటే వీళ్లు 20 రెట్లు ఎక్కువ...

**టీమిండియా విక్టరీ పరేడ్ కు వచ్చిన జనాన్ని చూసి ఐస్ లాండ్ క్రికెట్ బోర్డు ఆశ్చర్యం**



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 వరల్డ్ కప్ గెలిచి స్వదేశానికి వచ్చిన టీమిండియాకు నిన్న సాయంత్రం ముంబయిలో లభించిన స్వాగతం చరిత్రలో నిలిచిపోతుంది. ముంబయి మెరైన్ డ్రైవ్ నుంచి వాంఖడే స్టేడియం వరకు టీమిండియా ఆటగాళ్లను ఓపెన్ టాప్ బస్సులో ఊరేగింపుగా తీసుకువెళ్లగా... ఈ విక్టరీ పరేడ్ కు లక్షల సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. దీనికి సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి. అందులో ఒక ఫొటోను చూసిన ఐస్ లాండ్ దేశ క్రికెట్ బోర్డు నోరెళ్లబెట్టింది. వామ్మో... ఇంత జనమా!... మా దేశ జాతీయ జనాభా కంటే టీమిండియా వరల్డ్ కప్ పార్టీకి హాజరైన జనం 20 రెట్లు ఎక్కువ అని సంభ్రమాశ్చర్యాలు వ్యక్తం చేసింది.

# 'వందేమాతరం' పాటకు కోహ్లీ, పాండ్యా డ్యాన్స్




**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 ప్రపంచకప్ 2024 ట్రోఫీతో స్వదేశానికి చేరుకున్న టీమిండియా ఆటగాళ్లకు ఢిల్లీలో ఘన స్వాగతం లభించింది. ఆ తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం తర్వాత ముంబై చేరుకున్నారు. ముంబైలోని వాంఖడే స్టేడియంలో సన్మానించేందుకు బీసీసీఐ ఘనంగా ఏర్పాట్లు చేసింది. మెరైన్ డ్రైవ్ ప్రాంతంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించిన అనంతరం టీమిండియా వాంఖడే మైదానానికి చేరుకోగానే హర్షధ్వానాలతో స్టేడియం మార్మోగింది. ఆటగాళ్లు జాతీయ జెండాలు చేతబూని స్టేడియమంతా కలియతిరిగారు. బాలీవుడ్ పాటలకు స్టెప్పులు వేసి అభిమానుల్లో జోష్ నింపారు. అనంతరం వాంఖడే స్టేడియంలో భారత ఆటగాళ్లు ప్రపంచకప్ ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. వాంఖడే స్టేడియంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో కోహ్లీ మాట్లాడుతూ, "స్టేడియంలోకి వచ్చిన వారందరికీ ధన్యవాదాలు. ఈ రాత్రి వీధుల్లో చూసింది నా జీవితంలో ఎప్పటికీ మరచిపోలేను" అని అన్నారు. ఇక వేడుక ముగిసిన తర్వాత భారత జట్టు వాంఖడే స్టేడియం చుట్టూ దేశభక్తి గీతాలపై ర్యాలీ తీసింది. ఆ సమయంలో ఐకానిక్ 'వందేమాతరం' పాట ప్రసారమైంది. దాంతో విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్యాతో పాటు టీమిండియా సభ్యులందరూ ఆ పాటను ఆలపించారు. అది చూసిన అభిమానులకు గూస్‌బంప్స్ వచ్చాయి.

# స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్


- భారత స్టాక్ మార్కెట్లలో ప్రతికూల పవనాలు
- ఉదయం నష్టాలతో మొదలైన ట్రేడింగ్
- అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులతో ప్రభావితమైన సెన్సెక్స్, నిఫ్టీ




**విశ్వంభర, బిజినెస్ :** భారత స్టాక్ మార్కెట్లో నేడు ప్రతికూల పవనాలు వీచాయి. అంతర్జాతీయ మార్కెట్ల ఒడిదుడుకులు భారత స్టాక్ మార్కెట్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీపై ప్రభావం చూపించాయి. ఇవాళ్టి ట్రేడింగ్ ఆరంభంలో నష్టాలు ఎదుర్కొన్న సూచీలు... సాయంత్రానికి కొనుగోళ్ల అండతో కోలుకున్నాయి. ముగింపు సమయానికి సెన్సెక్స్ 53.07 పాయింట్ల నష్టంతో 79, 996 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 21.70 పాయింట్ల లాభంతో 24, 323 వద్ద ముగిసింది. ఓఎన్జీసీ, రిలయన్స్, ఎస్బీఐ, బ్రిటానియా, సిప్లా షేర్లు లాభపడగా... హెచ్ డీఎఫ్ సీ బ్యాంక్, టాటా స్టీల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, టైటాన్, మైండ్ ట్రీ షేర్లు నష్టాలు చవిచూశాయి.

# దేశంలో మొట్టమొదటి సీఎన్జీ బైక్ విడుదల

**విశ్వంభర, బిజినెస్ :** బజాజ్ ఆటో మొదటి సీఎన్జీ బైక్ ఫ్రీడమ్ ఈరోజు పూణేలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో ప్రారంభించారు. బజాజ్ ఫ్రీడమ్ అనేది ప్రపంచంలోనే మొట్టమొదటి సీఎన్జీ బైక్, దాని గ్రాండ్ లాంచ్ ఈరోజు పూణేలో జరిగింది. బజాజ్ ఫ్రీడమ్ సీఎన్జీ బైక్ మూడు వేరియంట్లలో విడుదల చేశారు. బజాజ్ సీఎన్జీ బేసిక్ వేరియంట్ బజాజ్ ఫ్రీడమ్ డ్రమ్ ఎక్స్-షోరూమ్ ధర రూ. 95,000గా ఉంది. ఈ బైక్ ఫుల్ ట్యాంక్ కెపాసిటీతో 330 కిలోమీటర్ల డ్రైవింగ్ రేంజ్ ఇవ్వగలదని కంపెనీ పేర్కొంది. ఇది 1 కిలోల సిఎన్‌జిపై 102 కిమీ, 1 లీటర్ పెట్రోల్‌పై 67 కిమీ మైలేజీని ఇస్తుంది. బజాజ్ సీఎన్జీ విడుదల కావడంతో బజాజ్ ఆటో షేర్లు బలమై పుంజుకున్నాయి. బజాజ్ ఆటో షేర్ల ఆల్ టైమ్ హై రూ. 10,038.80 చేరుకున్నాయి. నేటి ట్రేడ్‌లో బజాజ్ ఆటో గరిష్టంగా రూ. 9660కి చేరుకుంది. బజాజ్ ఆటో షేర్లు శుక్రవారం రూ. 173.25 లేదా 1.83 శాతం పెరుగుదలతో రూ. 9,634.10 వద్ద ముగిసింది.



### మూడు వేరియంట్లలో బైక్స్

బజాజ్ ఫ్రీడమ్ బైక్ యొక్క మూడు వేరియంట్లుగా ఉన్నాయి. బజాజ్ ఫ్రీడమ్ డ్రమ్ - రూ 95,000, బజాజ్ ఫ్రీడమ్ డ్రమ్ ఎల్ఈడీ - రూ 1,05,000, బజాజ్ ఫ్రీడమ్ డిస్క్ ఎల్ఈడీ - రూ 1,10,000, మీరు బజాజ్ ఫ్రీడమ్ బైక్ హ్యాండిల్ బార్‌పై ఉన్న స్విచ్ ద్వారా బటన్‌ను నొక్కడం ద్వారా మోడ్‌ను మార్చవచ్చు. పెట్రోల్ నుంచి సీఎన్జీకి, సీఎన్జీ నుంచి పెట్రోల్ ఫ్యూయల్ మోడ్‌కి సులభంగా మార్చుకోవచ్చు. దాని సీఎన్జీ సిలిండర్ బరువు 16 కిలోలు, బజాజ్ ఫ్రీడమ్ మూడు వేరియంట్లలో విడుదల సంగతి తెలిసిందే. ఇందులో డ్రమ్ బ్రేక్, డిస్క్ బ్రేక్ బ్రేకింగ్ సిస్టమ్‌లు అందుబాటులో ఉన్నాయి. బజాజ్ ఫ్రీడమ్ సమకాలీన స్టైలింగ్‌తో పొడవైన, వెడల్పాటి సీటు కలిగి ఉంది. బజాజ్ ఫ్రీడమ్ బలమైన ట్రేల్లిస్ ఫ్రేమ్, ఇన్నోవేటివ్ టెక్ ప్యాకేజింగ్ మరియు లింక్డ్ మోనోషాక్‌ని కలిగి ఉంది. బజాజ్ ఫ్రీడమ్ 7 రంగులలో రానుంది. ఇందులో మోడల్ కరేబియన్ బ్లూ, ఎబోనీ బ్లాక్-గ్రే, ఎబోనీ బ్లాక్-రెడ్, ప్యూటర్ గ్రే-బ్లాక్, ప్యూటర్ గ్రే-ఎల్లో, రేసింగ్ రెడ్‌తో పాటు సైబర్ వైట్‌లలో లభిస్తుంది. బజాజ్ ఫ్రీడమ్ బైక్‌లో 2 లీటర్ పెట్రోల్ ట్యాంక్ ం 2 లీటర్ సిఎన్‌జి ట్యాంక్ ఉన్నాయి. బజాజ్ ఫ్రీడమ్ 125 పెట్రోల్ ఇంజన్‌ను కలిగి ఉంటుంది, దీనితో ఇది 9.5 పవర్ చేస్తుంది.




# అమెజాన్ ప్రైమ్ డే సేల్ వచ్చేస్తున్నాయ్..

- జులై 20 నుంచి 21 వరకు ప్రైమ్ డే సేల్
- 48 గంటల పాటు ఆఫర్ల పండగ
- ఎస్బీఐ, ఐసీఐసీఐ క్రెడిట్ కార్డులపై 10 శాతం వరకు రాయితీ

**విశ్వంభర, బిజినెస్ :** భారీ డిస్కౌంట్ ధరలు, కొత్త ప్రొడక్టులు, ఊరించే ఆఫర్లు... వీటన్నింటికి కేరాఫ్ అడ్రస్ అమెజాన్ ప్రైమ్ డే సేల్. ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ తాజాగా తన ప్రైమ్ డే సేల్-2024 తేదీలను ప్రకటించింది. జులై 20 నుంచి 21వ తేదీ వరకు 48 గంటల పాటు ఈ ప్రైమ్ డే సేల్ నిర్వహిస్తారు. ఈ సేల్ లో అమెజాన్ ప్రైమ్ మెంబర్లకు ప్రాధాన్యత ఉంటుంది. ఇక పలురకాల బ్యాంకు కార్డులపై డిస్కౌంట్లు లభించనున్నాయి. ఐసీఐసీఐ, ఎస్బీఐ బ్యాంకు క్రెడిట్ కార్డుపై 10 శాతం వరకు రాయితీ లభించనుంది. అయితే ఈ డిస్కౌంట్ ఈఎంఐ కొనుగోళ్లకు మాత్రమే వర్తిస్తుంది. అమెజాన్ ప్రైమ్ డే సేల్ లో ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థలు తమ ఉత్పత్తులను లాంచ్ చేయనున్నట్టు తెలుస్తోంది.

# నటీనటుల యాడ్స్‌పై జెరోధా సీఈఓ ఆందోళన..

### అలా చేస్తే ఇబ్బందులు తప్పవంటూ వ్యాఖ్యలు

**విశ్వంభర, బిజినెస్ :** ప్రముఖ ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్ జెరోధా సీఈఓ నితిన్ కామత్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంటారు. తన ఆలోచనలను ఫాలోవర్స్‌తో పంచుకోవడం ఆయనకు అలవాటే. కాగా ఈ మధ్య తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. పలు విషయాలపై తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ వస్తున్నారు. తాజాగా సినీ నటుల గురించి ఓ పోస్ట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. అనధికార ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌లను ప్రచారం చేసే ప్రకటనలలో ప్రముఖ నటులు నటించడం పట్ల జెరోధా సహ వ్యవస్థాపకులు నితిన్ కామత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరహా క్రమబద్ధీకరించబడని ప్లాట్‌ఫారమ్ కోసం ఒక ప్రసిద్ధ నటుడి ప్రకటనను తాను చూశానని కామత్ చెప్పారు. ఆ ప్లాట్‌ఫారమ్ గురించి సదరు నటుడికి ఏ మాత్రం తెలిసి ఉండకపోవచ్చని అభిప్రాయపడ్డారు. గతంలో ఇదే తరహాలోని ఫారెక్స్ ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్ ఆక్టాఎఫ్ఎక్స్ కోసం ప్రకటనలలో నటించిన నటులకు ఇబ్బంది కలిగినట్లు గుర్తుచేశారు. ప్రమోట్ చేసినందుకు మరియు దానికోసం నగదును స్వీకరించినందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కాగా ఇటీవల టెలివిజన్ నటులు కరణ్ వాహి మరియు క్రిస్టల్ డిసౌజాలను నియంత్రణ సంస్థలు ప్రశ్నించినట్లు ప్రముఖ




మీడియా సంస్థ నివేదించింది. ఈ యాప్ మరియు దాని ప్రమోటర్లు అధిక రాబడి ఆశచూపి అనేక మంది పెట్టుబడిదారులను మోసగించారని మనీలాండరింగ్ కేసులో ఆరోపిం చింది. ఫారెక్స్ ట్రేడింగ్‌కు సంబంధించి సదరు సంస్థ ఆర్బీఐ నుంచి అనుమతి పొందలేదని తెలుస్తోంది. అయితే ఈ తరహా ప్లాట్‌ఫారమ్స్ కార్యకలాపాలను ఏజెన్సీలు నిశితంగా గమనిస్తున్నాయి. వాటికి సంబంధించిన ప్రకటనలలో నటిం చిన నటీనటులు తప్పు చేయకపోయినా నిందితులుగా కనిపించే అవకాశం లేకపోలేదని అర్థమవుతోంది.



## కడలి తీరాన కవ్విస్తోన్న కేరళ కుట్టి..

మలయాళీ కుట్టి మడోన్నా సెబస్టియన్ బీచ్‌లో క్రేజీ ఫోటోషూట్ చేసింది. మత్తెక్కించే చూపులతో అలల మధ్యలో ఫోటోలకు ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ బ్యూటీ షేర్ చేసిన కూల్ ఫోటోస్ నెట్టింట వైరలవుతున్నాయి. మడోన్నాకు తెలుగులో మంచి ఫాలోయింగ్ ఉంది. కెరీర్ మొదట్లో ట్రెడిషనల్ గా కనిపించిన ఈ అమ్మాయి ఇప్పుడు రూటు మార్చింది. సినిమాలకు అందం, అభినయంతోపాటు గ్లామర్ కూడా ముఖ్యమే అంటోంది ఈ భామ. ఇన్నాళ్లు కంటెంట్ పరంగా సినిమాలను ఎంచుకున్న మడోన్నా.. ఇకపై గ్లామర్ పాత్రలు కూడా చేసేందుకు రెడీ అయినట్లుగా తెలుస్తోంది. హీరోయిన్ గానే కాకుండా సింగర్ గానూ గుర్తింపు తెచ్చుకుంది. ప్రేమమ్ సినిమాతో హీరోయిన్ గా మారింది. తెలుగు, తమిళం, మలయాళంలో పలు సినిమాల్లో నటించింది. కానీ ఈ బ్యూటీకి మాత్రం స్టార్ డమ్ రాలేదు. దీంతో కొన్ని సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా కనిపించింది. విజయ్ దళపతి నటించిన లియో చిత్రంలో హీరో చెల్లిగా కనిపించింది. మడోన్నా సెబస్టియన్ చేతిలో మరో రెండు తమిళ సినిమాలు ఉన్నాయి. మరోవైపు సోషల్ మీడియాలో నిత్యం ఫోటోషూట్స్ షేర్ చేస్తూ సందడి చేస్తుంది. తాజాగా కడలి తీరాన అలల మధ్యలో ఫోటోలకు ఫోజులిచ్చింది.

## ‘భారతీయుడు 2’ ప్రీరిలీజ్ వేడుకకు ఫ్రీ ఎంట్రీ!




స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో కమలహాసన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం భారతీయుడు 2. భారతీయుడు’కు కొనసాగింపుగా వస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీ జులై 12న తెలుగు, తమిళ, కన్నడ ,మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. తాజాగా మూవీ ప్రీరిలీజ్ వేడుకను ఈ నెల 7న హైదరాబాద్లోని N కన్వెన్షన్లో నిర్వహించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈవెంట్ సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభం కానుంది. అలాగే ఈ ఈవెంట్ కి ఫ్రీ ఎంట్రీని చిత్ర యూనిట్ కల్పిస్తుంది. కాగా, ఎస్‌జే సూర్య, బాబీ సింహా, సిద్దార్థ్,మధుబాల, రకుల్ ప్రీత్ సింగ్,బ్రహ్మానందం, సముద్రఖని, ప్రియా భవాని శంకర్ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ రెడ్ జియాంట్ మూవీస్ పై ఉదయనిధి స్టాలిన్‌సుభాస్కరన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఫేమస్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుద్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతాన్ని సమకూరుస్తున్నాడు. ఇటీవల విడుదలైనటువంటి ఈ చిత్రానికి సంబంధించిన గ్లింప్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది.

## పవన్ కల్యాణ్‌ను కలవనున్న సమంత?

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలవనున్నారట టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత. గత కొంతకాలంగా మయోసైటీస్ వ్యాధితో బాధపడుతున్న టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత.. సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా ఆమెకు సంబంధించిన ఓ వార్త వైరల్ అవుతోంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను సమంత కలవబోతున్నట్లు తెలుస్తోంది. చెట్లను నరకకుండా ఉండటానికి ప్రజల్లో అవగాహన కల్పించడానికి పవన్ సాయం తీసుకోబోతుందని సమాచారం. కాగా, సమంత మయోసైటిస్ కారణంగా కొంతకాలం ఇండస్ట్రీ నుండి బ్రేక్ తీసుకుంది మళ్లీ ఇప్పుడు రియంట్రీ ఇచ్చింది సమంత. అక్కినేని నాగచైతన్య ని ప్రేమించే పెళ్లి చేసుకుంది కొన్ని రోజులకే విడాకులు తీసుకొని విడిపోయింది తర్వాత మాయోసైటిస్ కారణంగా బాధపడింది. మూవీస్ కి గ్యాప్ ఇచ్చింది ఈ మధ్య మళ్ళీ రీఎంట్రీ ఇచ్చింది. ఇక వరుసగా సినిమాలు తీసుకుంటూ ముందుకు సాగుతోంది సామ్.





ఎంతసేపు టాప్ హీరోయిన్ల గురించి మాత్రమే మాట్లాడుకోవడం కాదు.. మేం కూడా ఉన్నాం.. మమ్మల్ని గుర్తించండి.. మా గురించి కూడా చెప్పంటి అంటున్నారు మీడియం రేంజ్ హీరోయిన్లు. టైర్ 2లో టాప్ ప్లేస్ కోసం వాళ్లు పెద్ద యుద్ధమే చేస్తున్నారు. ఒకరో ఇద్దరో కాదు.. టైమ్ వస్తే టాప్ గేర్ వెళ్లడానికి అరడజన్ మంది బ్యూటీస్ పోటీ పడుతున్నారు. మరి వాళ్లెవరు..? ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్ల హవానే కాదు.. వాళ్ల తర్వాత ఉండే ముద్దుగుమ్మలు కూడా బాగానే ప్రభావం చూపిస్తుంటారు. మీడియం బడ్జెట్ సినిమాలకు వీళ్లే ఆధారం. ఈ లిస్టులో అందరికంటే ముందు దూసుకుపోతున్నారు మీనాక్షి చౌదరి. వరస సినిమాలతో టాప్ రేస్‌లోకి వచ్చేయాలని చూస్తున్నారు మీనాక్షి. వెంకటేష్, అనిల్ రావిపూడి సినిమాలో ఈమె ఓ హీరోయిన్. నభా నటేష్ కూడా చాలా రోజుల తర్వాత మళ్లీ బిజీ అయ్యారు. అప్పుడెప్పుడో యాక్సిడెంట్‌కు ముందు వరస సినిమాలు చేసిన ఈ బ్యూటీ.. కాస్త గ్యాప్ తీసుకుని మళ్లీ ప్రాజెక్ట్స్ సైన్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రియదర్శితో డార్లింగ్.. నిఖిల్‌తో స్వయంభు సినిమాల్లో నటిస్తూ టైర్ 2లో టాప్ ప్లేస్ కోసం చూస్తున్నారు.డిజే టిల్లు ఫేమ్ నేహా శెట్టికి కూడా వరస అవకాశాలు వస్తూనే ఉన్నాయి. గతేడాది బెదురులంక, రూల్స్ రంజన్ లాంటి సినిమాలు చేసారు. మొన్నటికి మొన్న గ్యాంగ్స్ ఆఫ్ గోదావరిలోనూ నటించారు. అయితే కెరీర్‌ను డిసైడ్ చేసే హిట్ కోసం ఇంకా ఎదురు చూస్తూనే ఉన్నారు నేహా శెట్టి. ప్రస్తుతానికి తెలుగులో నేహాకు అవకాశాలు రావట్లేదు. తెలుగు ఇండస్ట్రీలో టైర్ 2లో టాప్ ప్లేస్ కోసం పాకులాడుతున్న మరో బ్యూటీ సాయి మంజ్రేకర్. సల్మాన్ ఖాన్ దబంగ్ 3తో పరిచయమైన ఈ బ్యూటీ.. మేజర్, గని, స్కంద లాంటి సినిమాలు చేసారు. కానీ కోరుకున్న గుర్తింపైతే రాలేదు. తాజాగా నిఖిల్ ది ఇండియా హౌజ్‌లో హీరోయిన్‌గా ఎంపికయ్యారు సాయి మంజ్రేకర్. మరోవైపు భాగ్య శ్రీ బోర్సే పేరు కూడా టాలీవుడ్‌లో బానే వినిపిస్తుంది.

## టాలీవుడ్‌లో హీరోయిన్ల మధ్య ఆసక్తికర పోరు


## రేవ్ పార్టీలో జబర్దస్త్ రోహిణి..

రేవ్ పార్టీలో జబర్దస్త్ కమెడియన్, యాంకర్, నటి రోహిణీ పట్టు బడిన వీడియో ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. ఇందులో పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి తీసుకెళుతుండగా.. మైకులు పట్టుకుని రిపోర్టర్లు ప్రశ్నల వర్షం కురిపించారు. దీనికి రోహిణీ బదులిస్తూ తనకేం సంబంధం లేదని, బర్త్ డే పార్టీ ఉందంటే వచ్చానంది. అయినా విలేకర్లు ఆమెను వదిలిపెట్టకుండా.. మీకు కూడా పాజిటివ్ వచ్చింది కదా? అని ప్రశ్నలేస్తారు. దీనికి రోహిణి.. నాకు టెస్టులే చేయలేదు పాజిటివ్ ఎలా వచ్చిందని ఎదురు ప్రశ్నిస్తుంది. అనంతరం ఎన్ఆర్ఐ బర్త్ డే పార్టీ అనగానే వెనుక ముందు చూడకుండా రాకూడదంటూ బోరున ఏడుస్తుంది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో తెగ వైరలవుతోంది. అయితే దీనిని చూసిన ఎవరికైనా ఇది ప్రాంక్ అని ఇట్టే అర్థమైపోయింది. అది ‘బర్త్ డే బాయ్’ ప్రమోషన్ కోసం చేసినట్లు తెలుస్తుంది. వెరైటీగా ఉంటుందని రోహిణి అలా చేసినట్లు సమాచారం. అయితే ఈ వీడియోను చూసిన నెటిజన్లు.. బెంగళూరు రేవ్ పార్టీలో హేమ వ్యవహారాన్ని గుర్తుకు తెచ్చుకుంటున్నారు. రోహిణీ ఇన్ డైరెక్టుగా హేమపై సెటైర్లు వేసిందంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి దీనిపై హేమ ఎలా స్పందిస్తుందో చూడాలి.



## ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతున్నారా?

**విశ్వంభర, ఫీచర్ :** ఒకప్పుడు అందరితో కలిసి ఉండటం, గ్రూప్‌గా ట్రిప్స్ ప్లాన్ చేయడం అంటే ఇష్టపడిన వాళ్లు.. ఎప్పుడు ఎంత వీలైతే అంత ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతున్నారు. ఒంటరిగా ఉండటం అంటే వాళ్లకు అదే పెద్ద సంతోషం అన్నట్లు తయారయ్యారు. ఎవర్ని కలవకుండా, ఎటూ వెళ్లకుండా రోజంతా ఇంట్లోనే ఉన్నా కొంచెం కూడా బోర్ ఫీల్ అవ్వరు. కానీ ఇలా మీరు ఉంటున్నారు అంటే.. మీ మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది అని నిపుణులు చెబుతున్నారు. మెదడుపై చెడు ప్రభావం చూపుతాయని అధ్యయనాలు రుజువు చేశాయి. హార్వర్డ్ మెడికల్ స్కూల్, UN నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ డిజార్డర్స్ అండ్ స్ట్రోక్ వంటి సంస్థల నివేదికలు ఈ దిగ్భ్రాంతికరమైన పరిణామాలను పరిశోధించాయి మరియు మెదడుకు సమస్యలను కలిగించే కొన్ని అలవాట్లు మంచివి కావని అక్కడి మనస్తత్వవేత్తలు అంటున్నారు. ఒంటరిగా గడపడం, హెడ్‌ఫోన్స్‌తో ఎక్కువ సమయం గడపడం, ఇంట్లోనే ఉండడం, చీకటి గదుల్లో ఉండడం మంచిది కాదు. వీటన్నింటికి తోడు సరిగా నిద్రపోకపోవడం, మొబైల్ ఫోన్లు ఎక్కువగా వాడటం ప్రమాదకరమని అంటున్నారు. మన మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే ఇతరులతో మాట్లాడటం చాలా ముఖ్యమని సర్వే నివేదికలు చెబుతున్నాయి. నిత్యం ఒంటరిగా ఉండటంతోపాటు నిద్రలేమి మెదడును దెబ్బతీస్తుంది. కాబట్టి స్నేహితులు మరియు కుటుంబ సభ్యులతో



వీలైనంత ఎక్కువ సమయం గడపడం కూడా మీ ఆరోగ్యానికి మంచిది. ఈ ఒంటరితనం వల్ల డిప్రెషన్, యాంగ్జయిటీ, డిమెన్షియా, అల్జీమర్స్ వంటి వ్యాధుల ముప్పు పెరుగుతుందని కూడా నిపుణులు చెబుతున్నారు. మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కుటుంబం లేదా స్నేహితులతో తగినంత సమయం గడపండి, నిపుణులు అంటున్నారు. మనం ఒంటరిగా ఉన్నప్పుడు కంటే.. నలుగురితో కలిసి ఉన్నప్పుడే మెదడు షార్ప్‌గా పనిచేస్తుందట. వర్క్ ఫ్రమ్ హోమ్ వల్ల చాలా మంది ఒకరకమైన డిప్రెషన్‌లోకి వెళుతున్నారు. ఆఫీస్‌కు వెళ్తే.. పనితో పాటు ఫన్ ఉంటుంది. కబుర్లు చెప్పుకోవచ్చు, గాసిప్స్ వినొచ్చు. మెదడుకు ఇవన్నీ ఎంటర్‌టైమెన్మెంట్. కానీ ఇంట్లోనే ఉండటం వల్ల కేవలం పని, ఆ ఇంట్లో నలుగురితోనే కమ్యునికేట్ అవుతారు. కొంతమంది ఇంట్లో వాళ్లతో కూడా సరిగ్గా మాట్లాడరు. తెలియకుండా వాళ్లలో ఒక సైకో డవలప్ అవుతుంటారు. దేనికి పెద్దగా ఫీల్ అవరు.. వాళ్లకు ఏ విషయం అంత హ్యాపీని ఇవ్వదు. మీరు ఈ స్టేజ్‌లో ఉంటే వెంటనే మీ లైఫ్‌స్టైల్ మార్చేయండి.

## బ్రేక్ అప్ కూడా బరువు పెరగడానికి కారణమేనా?


**విశ్వంభర, ఫీచర్ :** ఈ రోజుల్లో ఊబకాయం ప్రతి వ్యక్తికి పెద్ద సమస్యగా మారింది. ముఖ్యంగా మహిళల్లో ఊబకాయం ఒక పెరుగుతున్న సమస్య. దీనికి కారణం కేవలం ఆహారపు అలవాట్లు, వ్యాయామం మాత్రమే కాకుండా ఇతర కారణాలు కూడా ఉన్నాయి. స్త్రీ తన జీవితంలో అనేక శారీరక, మానసిక మార్పులను ఎదుర్కొంటుంది. ఇవి వారి ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయి. మహిళల్లో ఊబకాయం పెరగడం కూడా అటువంటి దుష్ప్రభావాలలో చేర్చబడుతుంది. స్త్రీలలో స్థూలకాయం సమస్య పెరగడం మొదలయ్యే వివిధ దశలను గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**ప్యూబర్టీ**

ఈ సమయంలో అమ్మాయిల శరీరంలో అనేక హార్మోన్ల మార్పులు జరుగుతాయి.ఇవి శారీరకంగా, మానసికంగా లోతైన ప్రభావాన్ని చూపుతాయి. ఈ సమయంలో, అమ్మాయిలు ఎక్కువ ఆకలితో ఉంటారు. దీని కారణంగా శరీరంలోని కొవ్వు కణాలు పరిమాణం పెరగడం ప్రారంభమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆడపిల్లలు తమ ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. స్థూలకాయాన్ని అదుపులో ఉంచుకోవాలంటే ఆరోగ్యకరమైన వాటిని ఆహారంలో చేర్చుకోవాలి.

**కళాశాల**

ఏ అమ్మాయికైనా కాలేజ్ టైమ్ అంటే ఫస్ట్ ఫ్రీడమ్ డే. అక్కడికి చేరుకున్న తర్వాత, ఆమె ఇంట్లో ఆరోగ్యకరమైన ఆహారం తినడానికి బదులుగా స్నేహితులతో జంక్ ఫుడ్, స్నాక్స్ తినడానికి ఇష్టపడుతుంది. ఇది మరింత బరువు పెరగడానికి కారణమవుతుంది.



**రిలేషన్ షిప్**

తరచుగా, రిలేషన్ షిప్ లోకి వచ్చాక అమ్మాయిలు తమను తాము పట్టించుకోవడం మానేస్తారు. పెళ్లికి ముందు తనకు ఇష్టమైన డ్రెస్ లో ఫిట్ గా ఉండేందుకు స్ట్రిక్ట్ డైట్ ఫాలో అయ్యే అమ్మాయి.. పెళ్లి తర్వాత ఒత్తిడి వర్కవుట్ లో మార్పులు వల్ల బరువు పెరిగిపోతుంది.

**గర్భం**

గర్భధారణ సమయంలో స్త్రీ బరువు పెరగడం సహజం. ప్రెగ్నెన్సీ సమయంలో పిండం బరువు పెరగాలంటే తల్లి పౌష్టికాహారం తీసుకోవాలి. ఇది సాధారణ సమయం: గర్భిణీ స్త్రీ బరువు 12 నుండి 16 కిలోల వరకు పెరుగుతుంది. గర్భం దాల్చిన తర్వాత, మీరు మీ వైద్యుడిని సంప్రదించి వ్యాయామం మరియు యోగా చేయడం ద్వారా మీ టోన్డ్ ఫిగర్‌ని తిరిగి పొందవచ్చు.

**ఆఫీసు ఒత్తిడి**

గంటల తరబడి ఒకేచోట పనిచేయడం వల్ల మహిళల్లో ఊబకాయం సమస్య పెరుగుతోంది. ట్రెడ్‌మిల్, సైక్లింగ్ వంటి వ్యాయామాలు చేయాలి.

**బ్రేక్ అప్**

బ్రేక్ అప్ తర్వాత చాలా సందర్భాల్లో అమ్మాయిలు లావుగా మారతారు. బ్రేక్ అప్ తర్వాత భావోద్వేగాలను కంట్రోల్ చేసుకుందుకు ఆహారాన్ని ఒక ఆప్షన్ గా ఎంచుకునే మహిళలు బరువు పెరుగుతారని అమెరికాలోని పెన్ స్టేట్ యూనివర్శిటీకి చెందిన బృందం ఒక అధ్యయనంలో కనుగొంది. అటువంటి పరిస్థితిలో, మీ భావోద్వేగాలను నియంత్రించడానికి, ఒత్తిడిని తగ్గించడానికి పార్క్‌లో వాకింగ్‌కు వెళ్లండి, స్నేహితులతో సమయం గడపండి, మంచి పుస్తకాలు చదవండి.

**టెన్షన్**

ఒత్తిడి అనేది స్త్రీ మానసిక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా శారీరక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. అందులో బరువు పెరగడం కూడా ఒకటి. స్ట్రెస్ హార్మోన్ కార్టిసాల్.. అతిగా తినాలనే కోరికను పెంచుతుంది అనారోగ్యకరమైన ఆహారాల వైపు ఆకర్షితులను చేస్తుంది. దీని వల్ల ఊబకాయం సమస్య పెరుగుతుంది.

**మెనోపాజ్**

రుతువిరతి తర్వాత మహిళల్లో హార్మోన్ల మార్పులు, బరువు పెరగడానికి కారణమవుతాయి. మెనోపాజ్ తర్వాత పొత్తికడుపు చుట్టూ కొవ్వు పెరుగుతుంది. సరైన ఆహారపు అలవాట్లు, జీవన శైలితో ఈ సమస్యను దూరం చేయవచ్చు

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com